www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

భారత్ మధ్యవర్తిత్వంతో..
శాంతి చర్చలకు సిద్ధం
రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్
చైనా, బ్రెజిల్ కూడా మధ్యవర్తిత్వం చేయగలవన్న రష్యా అధినేత
అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్‌కు మద్దతిస్తామని ప్రకటన 2

శుక్రవారం | 6-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 143 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 3.02 తదుపరి చవితి; నక్షత్రం: హస్త ఉ. 9.25 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 6.28-8.16; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.21, మ. 12.37-1.26; అమృతఘడియలు: తె. 5.19 మొదలు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వైఎస్సార్ కాలనీలో నడుంలోతు వరద నీటిలో మంచినీటి కోసం బారులుదీరిన జనం


వరద బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రి లోకేశ్

తీరని కష్టం!

వరద బాధితుల దయనీయ గాథలు

33 మృతుల సంఖ్య
275 పశువుల మృతి
3,756 కి.మీ. దెబ్బతిన్న రోడ్లు
5.02 లక్షల ఎకరాలు పంట నష్టం
214 పునరావాస శిబిరాలు
45,369 శిబిరాల్లోని బాధితులు
1,000 కోట్లు సగం ప్రభుత్వ శాఖల పరిధిలో నష్టం ప్రాథమిక అంచనా

సర్వం కోల్పోయిన చిరు వ్యాపారులు, కష్ట జీవులు
ఇళ్లలోని వస్తువులన్నీ వరదకు ధ్వంసం
మళ్లీ కుదుటపడటం కష్టమని కన్నీళ్లు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)
చిన్న వ్యాపారులు, చిరుద్యోగులు, రోజువారీ కూలీలు... ఇంకా ఎందరెందరో సామాన్య, పేద, దిగువ మధ్య తరగతి జీవులు! బుడమేరు వరద వీరి బతుకులను ముంచేసింది! వరద తగ్గుముఖం పట్టిన తర్వాత... తమ ఇళ్లు, దుకాణాల తలుపులు తెరిచినప్పుడు కనిపించిన దృశ్యం వీరిని హతాశులను చేస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒక్కొక్కరిది ఒక్కో విషాదగాథ! గురువారం నాటికి సింగ్ నగర్ ప్రధాన రహదారుల్లో వరద దాదాపు పూర్తిగా తగ్గుముఖం
మిగతా 14వ పేజీలో...

సాయం.. ముమ్మరం!

సాధారణ పరిస్థితులు నెలకొల్పే చర్యలు
బాధితులకు పాలు, నీరు, ఆహార సరఫరా
వివిధ ప్రాంతాల నుంచి వెయ్యి నీటి ట్యాంకర్లు
104 అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలు
పారిశుధ్య యజ్ఞంలో పది వేల మంది కార్మికులు
ముంపు ప్రాంతాల్లో మంత్రులు, అధికారులు
బాధితుల కష్టాలు చూసి బాబు కంటనీరు


వరద ప్రభావిత ప్రాంతంలో బురదలోనే సీఎం చంద్రబాబు పర్యటన

అన్నివిధాలా ఆదుకుంటాం

నష్టం అంచనాలు అందగానే సాయం.. విపత్తుతో భారీ నష్టం జరిగింది
పంటలు బాగా దెబ్బతిన్నాయి.. బెజవాడలో ఎన్నడూ చూడని జలప్రళయం
చంద్రబాబు, ఆయన బృందం 24 గంటలూ కష్టపడి పనిచేస్తున్నారు
మరింత వరద వచ్చినా తట్టుకొనేలా ప్రకాశం బ్యారేజీని పటిష్ఠపరుస్తాం 12
కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ వెల్లడి.. వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే 13 14

రంగంలోకి సైన్యం

బుడమేరు గండ్లు పూడ్చే బాధ్యత అప్పగింత
జగన్ ప్రభుత్వం వాటిని అలాగే వదిలేసింది
ఆ గండ్ల నుంచే విజయవాడకు వరద
రెండు రోజుల్లోనే 40 సెంటీమీటర్ల వర్షం
వాగుకు ఏకంగా 30 వేల క్యూసెక్కుల వరద
15 లక్షల క్యూసెక్కులను తట్టుకొనేలా 'ప్రకాశం'ను పటిష్ఠపర్చడంపై దృష్టి: చంద్రబాబు

పూడికలతోనే బుడమేరు ముంపు

వరద తగ్గగానే ప్రక్షాళన.. ఇంతకంటే భారీ వరదలు వచ్చినా ప్రమాదాలు జరగకుండా చేస్తా: చంద్రబాబు
ఎనికేపాడులో ఆకస్మిక పర్యటన.. క్షేత్రస్థాయి పరిశీలన
రైల్వే బ్రిడ్జివద్ద బాబుకు తప్పిన పెనుముప్పు

మళ్లీ వర్షం టెన్షన్

అల్పపీడన హెచ్చరికలతో ఆందోళన.. బుడమేరు గండ్లతో పొంచి ఉన్న ముప్పు

గోదారి ఉగ్రరూపం

ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ

నందిగం సురేశ్ అరెస్టు

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అదుపులోకి

అరెస్టు సమయంలో హైడ్రామా

పారిపోయేందుకు సురేశ్ విఫలయత్నం
ఔటరు రింగ్ రోడ్‌లో చేజ్ చేసి పట్టుకున్న పోలీస్

హైదరాబాద్‌లో పట్టుకుని మంగళగిరికి తరలింపు
2 వారాల రిమాండ్.. గుంటూరు జైలుకు
ఈ కేసులో ఇప్పటివరకు ఇద్దరి అరెస్టు
అప్పిరెడ్డి, అవినాశ్, తలశిల సహా 12 మంది కోసం ముమ్మర వేట
అప్పిరెడ్డి అరెస్టుపై రోజంతా డైలామా
బెంగళూరులో అరెస్టు అంటూ వైసీపీ ప్రచారం
ఆ వదంతుల్ని తోసిపుచ్చిన పోలీసు వర్గాలు


మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను గుంటూరులో జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 5: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పారిపోయే ప్రయత్నంలో ఉన్న ఆయనను గురువారం హైదరాబాద్‌లో వెంబడించి మంగళగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నందిగం సురేశ్‌తోపాటు పలువురు వైసీపీ నేతలపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఇదే కేసులో సురేశ్‌ను అరెస్టు చేశారు. మరో వైసీపీ నేత, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేశారని, ఆయనను బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారని ఉదయం నుంచి వైసీపీ వర్గాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. కానీ, అప్పిరెడ్డి అరెస్టు వార్త నిజం కాదని, తమ పోలీసులు బెంగళూరుకే వెళ్లలేదని ఉన్నతాధికారులు వివరణ ఇచ్చారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నందిగం సురేశ్, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురాం సహా 14 మంది వేసిన పిటిషన్‌ను బుధవారం హైకోర్టు కొట్టివేసిన వెంటనే, వారందరి అరెస్టుల కోసం పోలీసులు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వేట ప్రారంభించారు. ఈ క్రమంలో సురేశ్‌ను అదుపులోకి తీసుకునేందుకు రాజధానిలోని తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని ఆయన నివాసానికి పోలీసులు వెళ్లారు. అక్కడే కొద్దిసేపు వేచి ఉన్న పోలీసులు సురేశ్ అక్కడ లేరని ధ్రువీకరించుకుని వెనుదిరిగారు. అరెస్టు భయంతో సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని ఆయన హైదరాబాద్ వెళ్లిపోయారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బుధవారం రాత్రి ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్టు పోలీసులు
మిగతా 9వ పేజీలో...

ఆదిమూలం వేధించారు!

తిరుపతిలో హోటల్‌కు పిలిచి పలుమార్లు లైంగిక దాడిచేశారు

రాత్రి సమయాల్లో ఫోన్ చేసేవారు
బయటకు చెబితే చంపేస్తానన్నారు
నా భర్త సూచనలతో వ్యవహారం
మొత్తం పెన్ కెమెరాలో రికార్డ్ చేశా
సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటిపై ఆ పార్టీ మహిళా నేత ఆరోపణలు
ఆధారాలు బయట పెట్టిన బాధితురాలు
బాబు సీరియస్.. సస్పెన్షన్ వేటు



పంజాగుట్ట/తిరుపతి/అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అదే పార్టీకి చెందిన మండల స్థాయి మహిళా నాయకురాలు సంచలన ఆరోపణలు చేశారు. ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తనను, తన కుటుంబాన్నీ చంపేస్తానని బెదిరించారని ఆరోపించారు. తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని, లేకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని
మిగతా 2వ పేజీలో...



మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం

మీ మాటలు మరింత ఉత్తేజాన్ని కలిగించాయి 12
చంద్రబాబును కొనియాడిన డిప్యూటీ సీఎం పవన్
సూపర్ క్లోరినేషన్ చేపట్టాలి
పారిశుధ్య పనులు వేగవంతం చేయండి
డిప్యూటీ సీఎం ఆదేశాలు
వైరల్ జ్వరంలోనూ అధికారులతో సమీక్ష


గురువారంనాటికీ వరద నీటిలోనే ఉన్న పాయకాపురం ప్రాంతం

ముంచింది జగనే!

బుడమేరు ఆధునీకరణకు మోకాలడ్డు
అధికారంలోకి రాగానే 'కలంపోటు'
ఏకంగా 198 సాగునీటి పనులు రద్దు
అందులో బుడమేరు ఆధునీకరణ కూడా!
బాబు హయాంలో చేపట్టడమే కారణం
ఆ పనులే పూర్తయితే ఈ విపత్తు ఉండేదా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
బెజవాడ వరదపై విపక్షనేత వైఎస్ జగన్‌వి బురదజల్లుడు రాజకీయమే అని స్పష్టమైంది. బుడమేరు సృష్టించిన విధ్వంసానికి ఆయన అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలే కారణమని తేలిపోయింది. కేవలం టీడీపీ అధినేత చంద్రబాబుకు పేరొస్తుందన్న దురుద్దేశంతో జల వనరుల శాఖ చేపట్టిన 198 అభివృద్ధి పనులను ఒక్క కలంపోటుతో జగన్ రద్దు చేశారు. అందులో... బుడమేరు కాల్వల ఆధునీకరణ పనులూ ఉన్నాయి. రద్దు చేసిన పనులు తానైనా కొత్తగా చేపట్టారా అంటే అదీ లేదు! అన్నింటినీ రద్దుపద్దులో కలిపేశారు. ఆ పనులు పూర్తయి ఉంటే బుడమేరు ప్రధాన కాలువ 15,000 క్యూసెక్కుల నుంచి 45,000 క్యూసెక్కుల ప్రవాహానికి తట్టుకునేలా విస్తరించేది. కాలువ
మిగతా 13వ పేజీలో...

ఏఐతో ఆయుర్దాయం పెంపు!

పదేళ్లలో సాధ్యమే.. ఒక్క ఏడాది పెరిగినా రూ.వేల కోట్ల సంపద సృష్టి
వయోధికుల ఆలోచనల్ని, అనుభవాల్ని ఏఐ సాయంతో భద్రపర్చాలి
ముందుతరాలకు వాటిని అందించాలి.. ఏఐతో తలెత్తే సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలి
అమెరికా పారిశ్రామికవేత్త, రచయిత డాక్టర్ పీటర్ డియెమాండిస్
'గ్లోబల్ ఏఐ' సదస్సులో కీలకోపన్యాసం



కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)తో మనిషి ఆయుర్దాయాన్ని పెంచే సాంకేతిక పరిజ్ఞానం పదేళ్లలో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త, రచయిత డాక్టర్ పీటర్ డియెమాండిస్ తెలిపారు. సాంకేతిక రంగంలో మానవాళి గత వందేళ్లలో సాధించిన అభివృద్ధి.. ఏఐతో వచ్చే పదేళ్లలో సాధించినా
మిగతా 2వ పేజీలో...

25 పతకాలతో భారత్ అదుర్స్ 11

పారాలింపిక్స్ జూడోలో కపిల్‌కు కాంస్యం


కపిల్ కాంస్య పట్టు


ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

భద్రాద్రి జిల్లాలో మళ్లీ పేలిన తూటా

అరుగురు మావోయిస్టుల మృతి
బోనాలగుంట అడవిలో భారీ ఎన్‌కౌంటర్
ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు గాయాలు
తప్పించుకున్న మావోయిస్టు మాసయ్య
విప్లవ ద్రోహుల పనే: మావోయిస్టుల ప్రకటన 9

స్వీపర్ పోస్టులకు 1.7 లక్షల దరఖాస్తులు

» వీరిలో 6వేలకుపైగా పోస్టు గ్రాడ్యుయేట్లు

» 40వేల మంది గ్రాడ్యుయేట్లు

చండీగఢ్, సెప్టెంబరు 5: హరియాణాలో నిరుద్యోగ తీవ్రతకు ఇదో నిదర్శనం. ప్రభుత్వ విభాగాలు, కార్పొరేషన్లలో స్వీపర్ పోస్టుల కోసం సుమారు 1.7 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసిన వారిలో ఉన్నత విద్యావంతులు ఉన్నారు. 6వేల మందికిపైగా పోస్టు గ్రాడ్యుయేట్లు, సుమారు 40వేల మంది గ్రాడ్యుయేట్లు అప్లికేషన్లు సమర్పించారు. స్వీపర్‌కు ఇచ్చే నెల జీతం రూ.15వేలు కావడం గమనార్హం. ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ సంస్థ అయిన హరియాణా కౌశల్ రోజ్‌గార్ నిగం లిమిటెడ్ (హెచ్‌కేఆర్‌ఎన్) ఆగస్టు ఆరో తేదీ నుంచి సెప్టెంబరు రెండో తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తుల్లో ఈ విషయం వెల్లడయింది. పీజీ, బిజినెస్ స్టడీస్‌లో డిప్లొమో చేసిన మనీష్ కుమార్ కూడా ఈ పోస్టు కోసం దరఖాస్తు చేశారు. ప్రయివేటు సంస్థలు, పాఠశాలల్లో నెలకు రూ.10 వేలు మించి ఇవ్వడం లేదని, భవిష్యత్తులో రెగ్యులర్ ఉద్యోగం వస్తుందన్న ఆశ కూడా లేకపోవడంతో ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసినట్టు చెప్పారు. స్వీపర్ అంటే రోజంతా చేయాల్సిన ఉద్యోగం కాదని, ఇతర పనులు చేసుకోవచ్చన్న ఉద్దేశంతో దీనిపై ఆశ పెంచుకున్నట్టు తెలిపారు. రోహతక్‌లోని సుఖ్‌పుర్ చౌక్ చెందిన సుమిత్ర మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని చెప్పారు. దాంతో చివరి ప్రయత్నం కింద ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసినట్టు తెలిపారు.

తల్లిదండ్రుల చేతుల్లో పిల్లల యూట్యూబ్ నియంత్రణ

స్టేటస్ వీక్షణకు వాట్సా‌ప్‌లో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: పిల్లల యూట్యూబ్ నియంత్రణ ఇకపై తల్లిదండ్రుల చేతుల్లో ఉండేలా యూట్యూబ్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని సాయంతో పిల్లల యూట్యూబ్ ఖాతాను తల్లిదండ్రుల అకౌంట్‌కు లింక్ చేయొచ్చు. యూట్యూబ్ ఫ్యామిలీ సెంటర్ పేరుతో తీసుకొచ్చిన ఈ ఫీచర్‌తో పిల్లలు ఏదైనా వీడియో అప్‌లోడ్ చేసినా, లైవ్‌స్ట్రీవింగ్ మొదలుపెట్టినా వెంటనే తల్లిదండ్రులకు ఈ మెయిల్ ద్వారా నోటిఫికేషన్ అందుతుంది. అలాగే యూట్యూబ్‌లో పిల్లలు అప్‌లోడ్ చేసే వీడియోలు, సబ్‌స్క్రైబ్ చేసే చానళ్లు, కామెంట్లు, పోస్టుల గురించి తల్లిదండ్రులకు తెలిసిపోతుంది. అంటే తల్లిదండ్రుల నియంత్రణలో పిల్లల యూట్యూబ్ అకౌంట్ ఉంటుందన్న మాట. తల్లిదండ్రులు తమ యూట్యూబ్ యాప్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'ఫ్యామిలీ సెంటర్ పేజ్'ను ఎంచుకుని ఈ ఫీచర్ యాక్టివేట్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఫోన్ వినియోగదారులు ఈ సేవలు వినియోగించుకోవచ్చు. మరోవైపు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారుల కాంటాక్ట్స్‌లోని వారు స్టేటస్ పెట్టినట్లయితే.. వారి ప్రొఫైల్ పిక్చర్ చుట్టూ ఒక పచ్చని వలయం కనిపిస్తుంది. దానిపై నొక్కి వారి స్టేటస్‌ను వీక్షించవచ్చు.

లోకం తీరు



అఘాడీలో లుకలుకలు

» రాహుల్ సభకు ఉద్ధవ్ డుమ్మా

సాంగ్లి, సెప్టెంబరు 5, ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర పర్యటనలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాకరే డుమ్మా కొట్టారు. సాంగ్లిలో రాహుల్ నిర్వహించిన బహిరంగ సభకు కూడా ఉద్ధవ్ గైర్హాజరయ్యారు. ఒకరోజు పర్యటనలో భాగంగా రాహుల్ ఇటీవల కన్నుమూసిన నాందేడ్ ఎంపీ వసంత్ చవాన్ కుటుంబ సభ్యులను తొలుత పరామర్శించారు. ఆ తర్వాత సాంగ్లీలో మాజీ మంత్రి పతంగ్ రావ్ కదం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాంగ్లీలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. అయితే కార్యక్రమానికి హాజరుకాలేనని గతవారమే ఉద్ధవ్ చెప్పారని పతంగ్ రావ్ కదం తనయుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వజిత్ కదం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల వేళ జరిగిన ఈ సభకు ఉద్ధవ్‌తో పాటు ఆయన పార్టీ నేతలెవ్వరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. నవంబరు 2019 నుంచి 2022 జూన్ వరకూ శివసేన(యూబీ టీ), ఎన్సీపీ (ఎస్పీ), కాంగ్రెస్ సంయుక్తంగా మహావికాస్ అఘాడీగా ఏర్పడి మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మరోవైపు త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కూట మి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనేది తేల్చాలని ఉద్ధవ్ పట్టుబడుతున్న నేపథ్యంలో ఆయన గైర్హాజరు చర్చనీయాంశమైంది.

భయపెడుతున్న గోదావరి

» కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు ముంపు ముప్పు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అటు కృష్ణమ్మ శాంతించగా.. ఇటు గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. పోలవరం , రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ఉరకలేస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఉపనదులు శబరి, మంజీర, ప్రవర, సీలేరు, ఇంద్రావతి జలాలు, కొండవాగుల జలాలతో గోదావరి నీటిమట్టం గురువారం అనూహ్యంగా పెరిగింది. భద్రాచలం వద్ద సాయంత్రం 6 గంటల సమయంలో నీటిమట్టం 45.50 అడుగులకు చేరింది. 9,67,437 క్యూసెక్కుల వరద జలాలను పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ద్వారా దిగువకు విడుదల చేసినట్లు పోలవరం ప్రాజెక్టు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.520 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.960 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజి వద్ద 6 గంటలకు నీటిమట్టం 11.60 అడుగులుగా ఉంది. పాండ్ లెవల్ 14.20 మీటర్లుగా ఉంది. డెల్టా కాలువలకు 1800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. ఇక ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 10,04,528 క్యూసెక్కులు ప్రవాహం వెళ్తోంది. రాత్రి ఇక్కడ ఒకటో నంబరు హెచ్చరిక జారీచేశారు. మరోవైపు ఎర్రకాలువ పొంగుతోంది. కొవ్వాడకాలువకు నీరు చేరుతోంది. ముందస్తు జాగ్రత్తగా రాజ మండ్రి అఖండగోదావరిలోని లంక ప్రజల కోసం రాజమండ్రిలో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు ఎర్రకాలువ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి, రైతులకు ప్రజలకు పలు సూచనలు చేశారు. అటు ఎగువన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు ముంపు ముప్పు నెలకొంది. కుక్కునూరు మండలం లోని గొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాదాపు వంద కుటుంబాలను సమీపంలోని దాచారం పునరావాస కాలనీకి తరలిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని 30 గ్రామాలను వరద చుట్టుముట్టింది. వేలేరుపాడు, రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, కొయిదా ప్రధాన రహదారులపై వరద చేరుకోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

వరద బాధితులకు సీజీఎస్టీ ఆపన్నహస్తం

» ఆహారం, మంచినీరు, మందుల పంపిణీ



వరద ప్రాంతంలో సీజీఎస్టీ బృందం సహాయ చర్యలు

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద బాధితులకు సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్, కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్ విజయవాడ కార్యాలయ అధికారులు ఆపన్నహస్తం అందించారు. ఈనెల 2న రాత్రిపూట హుటాహుటిన ఒక ప్రైవేట్ బోట్‌ను, గజ ఈతగాళ్లను, భద్రతా సామగ్రిని అందుబాటులోకి తెచ్చి, సుమారు 250 మందిని వరద నీటి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అలాగే దాదాపు 2,500 మందికి ఆహారం, రేషన్, మందులను పంపిణీ చేశారు. ఐఆర్‌ఎస్ అధికారి, కమిషనర్ సాధు నరసింహారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎం.నాగరాజుతో సహా కాకినాడ నుంచి వచ్చిన అనేక మంది జీఎస్టీ అధికారులు ఈ సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

తెలుగు రాష్ట్రాల ఉపాధ్యాయులకు అందజేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదుల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. అలాగే, తెలంగాణ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తిరుమలాయపాలెం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు పేసర ప్రభాకర్‌రెడ్డి, దమ్మన్నపేట జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్, హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ అధ్యాపకురాలు వనమాల స్వప్న కూడా అవార్డులు అందుకున్నారు. అదే విధంగా ఏపీలోని గుడివాడ ఎస్పీఎస్ మునిసిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు, ఉరందూర్ జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు సురేష్ కునాటి కూడా పురస్కారాలు స్వీకరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరందరికీ అవార్డులు ప్రదానం చేశారు.

సెమీకండక్టర్ల తయారీకి సింగపూర్ సహకారం

ఆ దేశ ప్రధానితో నరేంద్ర మోదీ భేటీ

» హెల్త్‌కేర్, ఇతర రంగాలపైనా ఒప్పందాలు

» ప్రతి దేశానికి స్ఫూర్తిదాయకం సింగపూర్: మోదీ



సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ముచ్చటిస్తున్న మోదీ

సింగపూర్ సిటీ, సెప్టెంబరు 5: భారత్‌లో సెమీకండక్టర్ల తయారీకి సింగపూర్ సహకరించనుంది. గురువారం ఈ మేరకు సెమీకండక్టర్ల తయారీలో సహకారంతోపాటు.. నాలుగు కీలక అంశాలపై ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ఒప్పందాలతో భారత్, సింగపూర్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడతాయని అభిప్రాయపడ్డారు. సెమీకండక్టర్ల రంగంతోపాటు.. కనెక్టివిటీ, డిజిటలైజేషన్, హెల్త్‌కేర్ అండ్ మెడిసిన్, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి, ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు జరిగాయని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ భేటీ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. తాజా ఒప్పందంతో భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి భారీ ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. "ఆర్థిక సంబంధాల విషయంలో.. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించాలని ఈ భేటీలో నిర్ణయించాం. 160 బిలియన్ డాలర్ల(రూ.1.34 లక్షల కోట్లు) పెట్టుబడితో భారత్‌కు సింగపూర్ ప్రధాన ఆర్థిక భాగస్వామి. రక్షణ, సముద్ర వనరులు, విద్య, కృత్రిమ మేధ, ఫిన్‌టెక్, శాస్త్రసాంకేతిక రంగాల్లో ఇప్పటికే ఉన్న సహకారంపైనా చర్చించాం" అని వ్యాఖ్యానించారు. అనంతరం తమ భేటీ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అంతకు ముందు ఇరువురు ప్రధానులు సెమీకండక్టర్ల కంపెనీని సందర్శించారు. రెండ్రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నంతో భేటీ కానున్నారు. సీనియర్ మం త్రి లీ సియన్ లూంగ్ ఇచ్చే విందులో పాల్గొననున్నారు. కాగా.. గురువారం సాయంత్రం మోదీ సింగపూర్‌కు చెందిన దిగ్గజ కంపెనీల సీఈవోలతో భేటీ అయ్యారు.

స్వచ్ఛభారత్‌తో మెరుగైన ప్రజారోగ్యం

శిశు మరణాలు భారీగా తగ్గాయి: మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: స్వచ్ఛభారత్ మిషన్‌తో పరిశుద్ధ భారత్ కల సాకారమవుతోందని.. ప్రజారోగ్యం మెరుగవుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు నిర్మించడంతో నవజాత శిశు, పిల్లల మరణాలు భారీగా తగ్గాయని చెప్పారు. ఈ విషయాన్ని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించిందని.. తనకు ఎంతో సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. 'ప్రజారోగ్యాన్ని కాపాడటంలో స్వచ్ఛ, సురక్షితమైన పారిశుధ్యమే కీలకం. భారత్ ఇందులో ముందున్నందుకు సంతోషంగా ఉంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కారణంగా భారత్‌లో శిశు మరణాలు తగ్గాయంటూ 'నేచర్' అనే బ్రిటిష్ జర్నల్ ప్రచురించిన కథనాన్ని ఆయన పంచుకున్నారు. అమెరికాలోని ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 2014లో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా దేశమంతటా మరుగుదొడ్ల నిర్మాణం అనూహ్యంగా పెరిగిందని.. దీంతో ఏటా 60 వేల నుంచి 70 వేల నవజాత శిశు, పిల్లల మరణాలు తగ్గాయని వారు వెల్లడించారు. మెరుగైన పారిశుధ్యంతో 5-30 శాతం వరకు పిల్లల మరణాలు రేటును తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.



న్యూయార్క్, సెప్టెంబరు 5: న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ తెలుగు సంప్రదాయాలు, సంస్కృతికి వేదికగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక వారసత్వం అమెరికావాసులను ఆకట్టుకొంది. ఉత్తర అమెరికాలో గత 53 ఏళ్లుగా ఇండియన్-అమెరికన్ తెలుగు వారి వికాసానికి కృషి చేస్తున్న తెలుగు లిటరసీ అండ్ కల్చరల్ అసోసియేషన్ (టీఎల్‌సీఏ) సంస్థ వారాంతం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఆ సంస్థ టైమ్స్ స్క్వేర్‌లో సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించడం ఇదే ప్రథమం. యువతీయువకులు, మహిళలు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కూచిపూడి నృత్యం, కలంకారీ చిత్రాలు, కలంకారీ దుస్తులు, శిల్పాలు సహా 35 రకాల ప్రదర్శనలు ఇందులో ఉన్నాయి. టైమ్స్ స్క్వేర్‌కు వచ్చిన వారంతా వీటిని తిలకించారు. రెండు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఉండేలా కార్యక్రమాన్ని రూపొందించారు. కొత్త తరం వారికి తెలుగు భాష, సంస్కృతులపై అవగాహన కలిగించేందుకే ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్టు టీఎల్‌సీఏ అధ్యక్షుడు కిరణ్ రెడ్డి పర్వతాల చెప్పారు.

భారత్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలకు సిద్ధం

» రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై రష్యా అధినేత పుతిన్

» చర్చలకు తాను సిద్ధమేనని ప్రకటన



మాస్కో, సెప్టెంబరు 5: ఉక్రెయిన్‌పై రెండున్నరేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా.. శాంతి చర్చల్లో భారత్ మధ్యవర్తిత్వం వహించగలదని అభిప్రాయపడింది. భారత్‌తోపాటు.. బ్రెజిల్, చైనాల వల్ల మధ్యవర్తిత్వం సాధ్యమవుతుందని పేర్కొంది. ఈ మేరకు రష్యా అధినేత పుతిన్ వ్లాదివాస్తోక్‌లో జరుగుతున్న తూర్పు ఆర్థిక ఫోరం సదస్సు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ఆంగ్ల పత్రిక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. "యుద్ధం మొదలైన తొలి వారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో కుదిరిన ప్రాథమిక ఒప్పందాన్ని ఉక్రెయిన్ అమలు చేయలేదు. నిజానికి ఆ ఒప్పందంతో ఉక్రెయిన్ అధ్యక్షుడి ప్రతినిధి సంతృప్తి వ్యక్తం చేశాకే.. సంతకం చేశారు. అయితే.. అమెరికా, ఐరోపా ఒత్తిడి కారణంగా ఉక్రెయిన్ ఆ ఒప్పందాన్ని అమలు చేయడం లేదు. ఆ ఒప్పందం ఆధారంగానే భవిష్యత్ చర్చలుంటాయి. ఉక్రెయిన్‌తో చర్చలకు మేం సిద్ధంగానే ఉన్నాం. అయితే.. అసంబద్ధ డిమాండ్ల ఆధారంగా చర్చలు జరపలేం" అని పుతిన్ వివరించారు. క్రెమ్లిన్‌లో పుతిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. "శాంతి ప్రక్రియలో భారత్ కీలకం. భారత ప్రధాని మోదీ-పుతిన్ మధ్య నిర్మాణాత్మక, స్నేహపూర్వక సంబంధాలున్నాయి. మోదీకి రష్యా, ఉక్రెయిన్, అ మెరికాతో సంబంధాలున్నాయి. భారత్ వల్ల శాంతి చర్చలు సాధ్యం" అని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా ఎన్నికలపై పెస్కోవ్ మాట్లాడుతూ ట్రంప్‌తో పోలిస్తే కమలాహ్యారిస్‌ను అంచనావేయడం తేలికని పేర్కొన్నారు. పుతిన్ కూడా అమెరికా ఎన్నికల్లో కమలాహ్యారిస్‌కు మద్దతిస్తానని ప్రకటించారు. కాగా.. 2022 ఫిబ్రవరి 24న మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకకపోవడంతో.. ఇరువైపులా ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది. అయితే.. ఇదివరకే భారత ప్రధాని మోదీ అటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యి.. చర్చలే శాంతికి మార్గమని సూచించిన విషయం తెలిసిందే.!

రద్దయిన ఏంఓయూపై దర్యాప్తు శవానికి చికిత్సలాంటిదే

» ఐఎంజీ భారత్ వాదనలు.. తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీలో 2003 నాటి ప్రభుత్వం ఐఎంజీ భారత్‌కు చేసిన భూకేటాయింపు, ఎంవోయూలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలపై గురువారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. ఇవి 21 ఏళ్ల క్రితం నాటి అంశాలని, అనంతరం అవి రద్దయ్యాయని, వాటిపై దర్యాప్తు చేయడం అంటే శవానికి చికిత్స చేయడం, కూలిపోయిన భవనం పునాది ఎలా ఉందని వెతకడం లాంటిదేనని ప్రతివాదులైన ఐఎంజీ భారత్ సంస్థ, భూముల కేటాయింపులో పాత్ర ఉన్న అప్పటి క్రీడాశాఖ మంత్రి పి.రాములు వాదించారు. ఐఎంజీ భారత్‌కు అప్పటి టీడీపీ ప్రభుత్వం చేసిన 850 ఎకరాల భూకేటాయింపు, ఎంవోయూపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ జర్నలిస్టు ఏబీకే ప్రసాద్, ఎంపీ విజయసాయిరెడ్డి, న్యాయవాది టి. శ్రీరంగారావులు 2012లో రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఐఎంజీ భారత్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ, మాజీ మంత్రి పి.రాములు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. "కేటాయించిన భూమి తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో ఉంది. కానీ ప్రతివాదిగా ఏపీ ప్రభుత్వం ఉంది. ఎవరిని ప్రతివాదులుగా చేర్చాలో కూడా పిటిషనర్‌లకు తెలియడం లేదు" అని అన్నారు.. వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేశారు.

పబ్లిక్ నోటీసు ఖర్చు మార్గదర్శే భరించాలి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి డిపాజిట్ల వ్యవహారంలో ఇంకా ఎవరికైనా బకాయిలు రావాల్సి ఉందా? అని తెలుసుకోవడానికి ప్రముఖ పత్రికల్లో ఇచ్చే పబ్లిక్ నోటీసు ఖర్చును ఆ సంస్థే భరించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం స్పష్టంచేసింది. మార్గదర్శి నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పిటిషన్ నేపథ్యంలో ఆ కేసులను సుప్రీంకోర్టు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పబ్లిక్ నోటీసు పత్రికల్లో ప్రకటన రూపంలో ఇవ్వాల్సి ఉంది. దాని ఖర్చును మార్గదర్శే భరించాలని, ప్రకటన ఇచ్చిన ఏడురోజుల్లో రిజిస్ట్రీకి ఆ మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 1కి వాయిదా వేసింది.

ఏఐతో ఆయుర్దాయం పెంపు!

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్చర్యం లేదన్నారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన ఏఐ సదస్సులో పీటర్ కీలకోపన్యాసం చేశారు. 'ఏఐతో ఎన్నో అద్భుతాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల వయసున్న పిల్లలు కూడా చాట్ జీపీటీ ఉపయోగించి చదువుకునే రోజులు ఏంతో దూరంలో లేవు. డ్రోన్లతో వ్యవసాయం చేస్తామని ఎప్పుడైనా ఊహించామా? డ్రైవర్ రహిత వాహనాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. వైద్య రంగంలో ఏఐ అద్భుతాలు చేస్తోంది. సమస్త విజ్ఞానం సెల్‌ఫోన్‌లోకి వచ్చేసింది. ఏఐతో ఇన్ని అద్భుతాలు జరుగుతున్నప్పుడు మనిషి ఆయుర్దాయాన్ని పెంచే టెక్నాలజీని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన శాస్త్రవేత్తల్లో మొదలైంది. ఈ దిశగా మా సంస్థ కూడా కృషి ప్రారంభించింది' అని పీటర్ డియెమాండిస్ వెల్లడించారు. వచ్చే పదేళ్లలో మనిషి ఆయుర్దాయాన్ని పెంచే సాంకేతికతను తీసుకురాగలమని శాస్త్రవేత్తలు బలంగా నమ్ముతున్నారన్నారు. జీవిత కాలాన్ని ఒక ఏడాది పెంచగలిగినా రూ.వేల కోట్ల విలువైన అదనపు సంపదను సృష్టించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏఐతో తలెత్తే సమస్యల గురించి ప్రస్తావిస్తూ.. ఏ సాంకేతిక పరిజ్ఞానంతోనైనా కొన్ని సమస్యలు ఉంటాయని, ఆహార ఉత్పత్తిలో కొత్త ఆవిష్కరణలు జరగకపోతే ప్రపంచ మానవాళికి అవసరమైన ఆహారాన్ని అందించగలిగే వాళ్లమేనా? అని ప్రశ్నించారు. ఏఐతో తలెత్తే సమస్యలను ఎలా అధిగవించాలనే దానిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వయోధికుల అనుభవాలను పదిలపర్చాలి

భారత్‌లో అపారమైన మానవ వనరులు ఉన్నాయని, లక్షలాది మంది సాంకేతిక నిపుణులు ఉన్నారని పీటర్ డియెమాండిస్ గుర్తు చేశారు. 'ఏఐ రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోంది. దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్న 70 ఏళ్లకు పైబడిన వయోధికుల మనసుల్లో ఏముంది? వారి ఆలోచనలు, పూర్వీకుల నుంచి వారు అందిపుచ్చుకున్న సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన వివరాలను భద్రపరచాలి. వాటిని ముందుతరాలకు అందించేలా ఏఐ సహకారంతో కృషి చేయాలి' అని సూచించారు. ఏఐపై యువతలో ఆసక్తి పెంచేలా తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ పీటర్ డియెమాండిస్ తాజాగా 'లాంగివిటీ' అనే పుస్తకాన్ని రచించారు. కొత్త ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించటం కోసం ఆయన ఎక్స్‌ప్రైజెస్ ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించారు. - స్పెషల్ డెస్క్

ఆదిమూలం వేధించారు!

(మొదటి పేజీ తరువాయి)

సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె తన భర్తతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొన్ని ఫొటోలు, వీడియోలు, మొబైల్ కాల్ లిస్ట్ వంటి ఆధారాలను రిలీజ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఆదిమూలం టీడీపీలో చేరారు. చంద్రబాబు ఆయనకు టికెట్ ఇచ్చారు. దీనిని నేను తీవ్రంగా వ్యతిరేకించా. అయినా బాబు ఆదేశాల మేరకు ఇతర నాయకులను కలుపుకొని ఆదిమూలంను గెలిపించాం. ఒకే పార్టీకి చెందిన వాళ్లం కావడంతో నా ఫోన్ నెంబర్ తీసుకున్నారు. అప్పటి నుంచి వేధించడం ప్రారంభించారు. రాత్రి సమయాల్లో ఫోన్లు చేసి.. తనతో గడపడానికి హోటల్‌కు రావాలని ఒత్తిడి చేసేవారు. పలుమార్లు తిరస్కరించా. దీంతో నన్ను, నా కుటుంబ సభ్యులను అంతుచూస్తానని బెదిరించారు. ఆయన వేధింపులు భరించలేక మాట్లాడదామనే ఉద్దేశంతో జూలై 6న తిరుపతిలోని ఓ హోటల్ గదికి వెళ్లా. అక్కడే నాపై ఆదిమూలం అత్యాచారం చేశారు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించారు. దీంతో గతిలేని పరిస్థితిలో ఆయనకు లొంగిపోవాల్సి వచ్చింది. అలా నాపై మూడుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. అర్థరాత్రులు ఫోన్లు చేస్తుండడంతో నా భర్త గట్టిగా నిలదీశారు. దీంతో జరిగిన విషయం చెప్పా. నా భర్త సూచనతో పెన్ కెమెరా పట్టుకుని హోటల్‌కు వెళ్లా. ఆ గదిలో పెన్ కెమెరా పెట్టి ఆదిమూలం బాగోతాన్ని రికార్డ్ చేశా" అని బాధితురాలు వివరించారు. ఆదిమూలం వేధింపులు పెరగడంతో ఆయనను దూరం పెట్టానని, అప్పటి నుంచి తమ ఇంటి చుట్టూ గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారని తెలిపారు. దీంతో ఈ విషయం మొత్తాన్నీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకు వివరిస్తూ లేఖ రాసినట్టు చెప్పారు. తన వద్ద అన్ని సాక్ష్యాలూ ఉన్నాయని తెలిపారు. రోజుకో అమ్మాయితో ఆదిమూల ఎంజాయ్ చేసేవారని, ఇలా ఎంతో మందిని టార్చర్ చేశారని బాధితురాలు ఆరోపించారు. తన కార్యకలాపాలకు తిరుపతిలోని భీమా ప్యారడైజ్ హోటల్‌ను అడ్డాగా మార్చుకున్నారని తెలిపారు. ఆదిమూలం బారి నుంచి మహిళలను కాపాడాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే సామూహిక ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు.

కుట్ర చేశారు: ఎమ్మెల్యే

మహిళా నాయకురాలి ఆరోపణలతో సత్యవేడు ఎమ్మెల్యే అజ్ఞాతంలోకి వెళ్లారు. తనపై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు. మార్ఫింగ్ చేసిన వీడియోలతో తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. "నేను తప్పు చేయలేదు. ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధం. నా బిడ్డల సాక్షిగా చెబుతున్నా.. ఆ మహిళ నియోజకవర్గ తెలుగు మహిళా నేతగా మాత్రమే తెలుసు. ఇతర పరిచయాలు లేవు. నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన రమేశ్‌బాబుతో పాటు పార్టీలోని మునుస్వామి యాదవ్, గిరిబాబు, బాలరాజు తదితర నాయకులు పన్నిన కుట్ర" అని ఆదిమూలం ఆరోపించారు. కాగా, ఎమ్మెల్యే సొంత మండలమైన భీముని చెరువులో మహిళలు ఆదిమూలానికి మద్దతు తెలిపారు. ఈ ఆరోపణల వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉందని టీడీపీ నేతలు ఆరోపించారు.

టీడీపీ శ్రేణుల అనుమానాలు

ఆదిమూలం ఎన్నికల ముందే వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తనకు జగన్ టికెట్ నిరాకరించడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపైనా తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆదిమూలం తనను లైంగికంగా వేధించారంటూ టీడీపీ మహిళా నేతే ఆరోపించడం సంచలనంగా మారింది. అయితే.. ఈ విషయంలో అనేక సందేహాలు ఉన్నాయని స్థానిక టీడీపీ నేతలు చెబుతున్నారు. బాధితురాలు మొదట్లోనే పోలీసులకు, పార్టీ అధిష్ఠానానికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని, జూలై 10న ఆధారాలు సేకరించాక అప్పుడే ఫిర్యాదు చేయకుండా ఇన్ని రోజులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లా స్థాయిలో ఎస్పీకి, విజయవాడలో హోం మంత్రి, డీజీపీలకు ఫిర్యాదు చేసే అవకాశముండగా, హైదరాబాదులో మీడియా సమావేశం పెట్టడంపైనా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో బాధితురాలు మరికొందరు నేతలతో కలసి స్వతంత్ర అభ్యర్థికి బహిరంగంగా మద్దతు ఇచ్చి ప్రచారం చేశారని పోలింగ్‌కు ముందే ఆదిమూలం ఆరోపించారు. ఫొటోలు, వీడియోలు చూపి ఎమ్మెల్యేతో కొందరు బేరసారాలు సాగించారన్న వాదన కూడా వినిపిస్తున్నారు. భారీమొత్తంలో నగదు డిమాండ్ చేశారని, ఎమ్మెల్యే నిస్సహాయత వ్యక్తం చేయడంతో తెర వెనుక వ్యక్తులు.. ఈ వ్యవహారాన్ని వైసీపీకి చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చేరవేసినట్టు చెబుతున్నారు.

ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు

» గంటల వ్యవధిలోనే టీడీపీ నిర్ణయం

» ఇందుకా గెలిపించింది: సీఎం సీరియస్

» పార్టీ పరంగా విచారణకు కమిటీ

టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సొంత పార్టీ తెలుగు మహిళా నేత చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు పార్టీలో ప్రకంపనలు సృష్టించాయి. రాజకీయంగా దుమారం రేగింది. దీంతో గంటల వ్యవధిలోనే టీడీపీ అధిష్ఠానం తీవ్రంగా స్పందించింది. ఆదిమూలంపై పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీంతో పాటు ఈ వ్యవహారంపై పార్టీపరంగా విచారణకు కమిటీ వేసింది. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, గురువారం సీఎం చంద్రబాబు విజయవాడలో వరదపై సమీక్ష జరుపుతున్నప్పుడు ఈ వ్యవహారం ఆయన దృష్టికి వచ్చింది. వీడియోలు వాస్తవమేనని నిఘా వర్గాలు ధ్రువీకరించడంతో తక్షణమే చర్యలు చేపట్టారు. 'వీరిని ప్రజలు గెలిపించింది ఎందుకు? వీరు చేస్తోందేమిటి? వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయండి' అని సీఎం వ్యాఖ్యానించారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా వివరణ కోరాల్సిన అవసరం కూడా లేదన్నారు. దీంతో వెంటనే పల్లా ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.


గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
గౌ॥ శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, మానవ వనరులు, ఐటీ & ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ శాఖామాత్యులు
గౌ॥ శ్రీమతి దగ్గుబాటి పురందరేశ్వరి గారు
ఎం పి - రాజమండ్రి
భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు (ఆంధ్రప్రదేశ్)
ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్యం
మెడికవర్
క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్
విశాఖపట్టణం
గౌ॥ శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గారు
కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు
వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
తేది: 6 సెప్టెంబరు 2024, ఉ. 11:30 ని॥లకు
స్థలం: హెల్త్‌సిటి, ఆరిలోవ
విశిష్ట అతిథి
గౌ॥ శ్రీ వై. సత్య కుమార్ యాదవ్ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు
MEDICOVER CANCER INSTITUTE
MEDICOVER
CANCER INSTITUTE
గౌరవ అతిథులు
గౌ॥ శ్రీమతి గొలగాని హరి వెంకట కుమారి గారు
మేయరు - విశాఖపట్టణం
గౌ॥ శ్రీ శ్రీభరత్ మతుకుమిల్లి గారు
ఎం పి - విశాఖపట్టణం
గౌ॥ శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు గారు
ఎమ్మెల్యే - విశాఖపట్టణం (తూర్పు)
గౌ॥ శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు
ఎమ్మెల్యే - గాజువాక
గౌ॥ శ్రీ గంటా శ్రీనివాసరావు గారు
ఎమ్మెల్యే - భీమిలి
గౌ॥ శ్రీ ఎ. జి. వి. ఆర్ నాయుడు (గణబాబు) గారు
ఎమ్మెల్యే - విశాఖపట్టణం (పశ్చిమ)
గౌ॥ శ్రీ పంచకర్ల రమేష్ బాబు గారు
ఎమ్మెల్యే - పెందుర్తి
గౌ॥ శ్రీ పెన్మెత్స విష్ణుకుమార్ రాజు గారు
ఎమ్మెల్యే - విశాఖపట్టణం (ఉత్తరం)
గౌ॥ శ్రీ సి హెచ్ వంశీ కృష్ణ శ్రీనివాస్ గారు
ఎమ్మెల్యే - విశాఖపట్టణం (దక్షిణం)
ఆహ్వానించువారు
డా. జి. అనిల్ కృష్ణ
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
డా. ఎ. శరత్ రెడ్డి
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
పి. హరి కృష్ణ
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
డా. ఎ. ఆర్. కృష్ణ ప్రసాద్
డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (వైజాగ్) ప్రత్యేకతలు
బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్
4డి పెట్-సిటి స్కాన్
రోబోటిక్ సర్జరీ
ఎలెక్టా వెర్సా రేడియేషన్ థెరపీ
ఇమేజ్ గైడెడ్ బ్రాకీ థెరపీ
మెడికవర్ ఇండియా ప్రత్యేకతలు
23 హాస్పిటల్స్
16 నగరాలు
5000 బెడ్స్
1636+ ఐసియు బెడ్స్
135+ ఆపరేషన్ థియేటర్స్
24+ క్యాత్ ల్యాబ్
1 కోటి మందికి పైగా వైద్యం
1200+ డాక్టర్స్
13500+ ఎంప్లాయిస్
మెడికవర్ ఇండియా హాస్పిటల్స్ నెట్‌వర్క్: ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | మహారాష్ట్ర | కర్ణాటక | మరియు యూరప్‌లోని 12 దేశాలలో వైద్యసేవలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సమస్య, నిర్మూలన

ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం నాడు జరిగిన 'ఎన్‌కౌంటర్‌'లో ఒక అగ్ర నేతతో సహా తొమ్మిదిమంది మావోయిస్టులు చనిపోయారు. దీనితో ఆ రాష్ట్రంలో ఈ సంవత్సరారంభం నుంచి జరుగుతున్న భద్రతా దళాల చర్యల్లో మరణించినవారి సంఖ్య 150 దాటింది. చాలా కాలం పాటు సాపేక్షంగా ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ మధ్య 'ఎన్‌కౌంటర్లు' తిరిగి ప్రారంభమయ్యాయి. గురువారం నాడు ఖమ్మం జిల్లాలో ఆరుగురు మావోయిస్టులు పోలీసు, భద్రతాదళాల కాల్పుల్లో చనిపోయారు. ఇవి రెండూ ఒక క్రమంలో జరిగిపోయిన సంఘటనలు మాత్రమే. ఈ సందర్భం నుంచి మొత్తం దృశ్యాన్ని చూడగలిగితే, సంక్షోభ తీవ్రత అర్థమవుతుంది. ఈ తొమ్మిదినెలల కాలంలో జరిగిన సంఘటనల్లో చనిపోతున్నవారిలో సాయుధులెందరో, నిరాయుధులెందరో, అమాయకులెందరో అన్న ప్రశ్నలు వినిపిస్తూనే ఉన్నాయి. అవకాశం దక్కినప్పుడు మావోయిస్టులు కూడా ప్రతిఘటన పేరుతో ఏదో హత్యాకాండకు పాల్పడతారు. హతులు ఎవరైనా, మరణ వార్తలు, ఛిద్రమైన మృతదేహాల ముఖచిత్రాలు ఎవరికీ ఆహ్లాదకరంగా, ఆహ్వానించదగినవిగా ఉండవు.

మావోయిస్టు 'సమస్య'ను 2026 నాటికి పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ మధ్య కూడా వాగ్దానమో, ఉద్ఘాటనో చేశారు. దేశంలో అశాంతి కలిగిస్తుందనుకుంటున్న ఒక అంశాన్ని చక్కబరచాలన్నది అమాత్యుడిగా ఆయన బాధ్యత కావచ్చు. కానీ, సమస్య అని చెబుతున్నదాన్ని సరిగా అర్థంచేసుకున్నారా లేదా అన్నది ప్రజలకు, సమాజానికి ముఖ్యం. ప్రభుత్వం, దాని ప్రతినిధులు ఒక క్లిష్ట పరిస్థితి కారణాలను సరిగా గుర్తించలేకపోతే, దానికి అనుసరించే పరిష్కార మార్గాలు కూడా పొరపాటువే అవుతాయి. ఒక్కోసారి, 'సమస్య' కంటె మించినవి అవుతాయి. రెండేళ్లు, మూడేళ్లు అని వ్యవధి విధించుకోవడం దాదాపు అరవై ఏళ్ల నుంచి భారతదేశపు హోంమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు చేస్తూనే వచ్చారు. ఏ పరిస్థితీ అకారణంగా, అకస్మాత్తుగా జనించదు. కారణాలను వదిలివేసి, వాటి ప్రతిస్పందనలను నిర్మూలిస్తే, సమస్య కొనసాగుతూనే ఉంటుంది. నక్సలిజానికి కానీ, మావోయిజానికి కానీ, వ్యవస్థల వైఫల్యంలో, పాలనలలోని అప్రజాస్వామికతలలో, కొరతలలో సానుకూలతలు ఏర్పడ్డాయి. రాజ్యం, దాని రాజకీయ నాయకత్వం తమ స్వయంకృతాల వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని చక్కదిద్దే పనిని భద్రతా యంత్రాంగానికి అప్పజెబుతున్నవి. ఫలితంగా హింస, ప్రతిహింస, మరింత హింస అనే చక్రం నిరంతరంగా కొనసాగుతూ వస్తున్నది.

ఘర్షణాత్మక వాతావరణం నిరంతరంగా కొనసాగడం, అందులో ప్రాణనష్టం జరగడం ప్రజాస్వామ్యాన్ని కోరుకునేవారిని తీవ్రంగా బాధిస్తుంది. బాధించాలి. కానీ, దేశవ్యాప్తంగా ప్రధాన రాజకీయ స్రవంతిలో ఈ పరిస్థితిపై ఒక మౌనం, నిశ్శబ్ద అంగీకారం నెలకొనడం బాధాకరం. ఆయుధధారులై, ప్రభుత్వంతో తలపడుతున్నవారు నిర్బంధచర్యలు ఎదుర్కొనడం అనివార్యమనుకున్నా, పెద్ద సంఖ్యలో అమాయక ఆదివాసులు సానుభూతిపరులుగా, ఆశ్రయదాతలుగా అనుమానితులై హతులవుతున్నారన్న వార్తలు కూడా భారతీయ పౌరసమాజాన్ని పెద్దగా కదలించలేకపోతున్నాయి. మావోయిస్టులను 'ఏరివేయడానికి' భద్రతా దళాలు అనుసరిస్తున్న పద్ధతుల గురించి కూడా ఆందోళనకరమైన వార్తలు వింటున్నాము. ప్రభుత్వాలకున్న కర్తవ్యాలేమైనా, వాటిని చట్టబద్ధంగా మాత్రమే నెరవేర్చాలి. నక్సల్ ప్రభావం ఉధృతమైన సమయాల్లో, అది శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదంటూ అవసరార్థం సూక్తులు వల్లించే రాజకీయవాదులు, ఈ సమయంలో మాత్రం మౌనం వహించడం న్యాయం కాదు. కల్పించుకోవాలి. పారదర్శకత కోసం ప్రయత్నించాలి. ఉద్రిక్తతను ఉపశమింపజేసి సంప్రదింపుల అవకాశాలను అన్వేషించాలి. దేశంలో అనేకచోట్ల నిషిద్ధ బృందాలతో కేంద్రం చర్చలు జరుపుతున్నది. మావోయిస్టులతో కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి చర్చల ప్రయత్నం జరిగింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో జాతీయస్థాయిలో కూడా స్వామి అగ్నివేశ్ ఆధ్వర్యంలో కొంత ఆలోచన సాగింది. ఎక్కడో జరుగుతున్న గాజా విధ్వంసం విషయంలో అయినా కలవరం వ్యక్తం చేయగలుగుతున్న పక్షాలు, మన దేశంలోనే, మన మధ్యనే ఒక ఆదివాసీ రాష్ట్రంలో జరుగుతున్న అవాంఛనీయ పరిణామాలను ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాదు. మావోయిస్టులు కూడా భారతదేశంలోని సకలపక్షాలనూ ఉద్దేశించి, సంభాషించాలి. పరిస్థితిని మెరుగుపరచడానికి మార్గాలను అన్వేషించవలసిందిగా పౌరసమాజాన్ని గట్టిగా అభ్యర్థించాలి. కాల్పుల విరమణకు తమవైపు నుంచి చేయగలిగిన ప్రతిపాదనలను ప్రజల ముందు బహిరంగపరచాలి.

ఆదివాసీల గురించి గొప్పగా చెబుతారు. వారికి నాగరిక ఫలితాలు ముట్టజెప్పి, జనజీవన స్రవంతిలోను, ప్రధాన మతాలలోనూ కలుపుకోవాలని చూస్తారు. కానీ, వారికి ఉన్న సామాజిక, రాజకీయ పలుకుబడి అతి స్వల్పం. వారి ప్రాణాలకు పెద్ద విలువలేదు. వారికి అండగా తక్కిన సమాజం అంతా నిలబడితే గనుక, వారు మాత్రం నక్సలైట్ల వెనుక ఎందుకు సమీకృతులవుతారు? అన్ని రకాలుగా అణగారిపోయి, అప్రధానులైపోయిన ఆదివాసులను గుట్టుచప్పుడు కాకుండా బాధించడం సాధ్యపడితే, నాగరికత, సభ్యత, ప్రజాస్వామికత అంటూ గొప్పలు చెప్పుకోవడం ఎందుకు?

'అమరావతి' ముంపు ఓ అభూతకల్పన

ఒకవైపు బుడమేరు వరదలతో విజయవాడ నగర ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ఇదే అదనుగా కొంతమంది అమరావతి మునిగిపోయిందని ప్రచారం చేయడం చూస్తుంటే శవాలపై చిల్లర ఏరుకొనే ప్రయత్నం చేస్తున్నట్టుగా ఉంది. ప్రజల కష్టాలతో మాకు పనేంటి.. ఎవరు ఏమైతే ఏంటి.. తమ నాయకునికి అమరావతి ఇష్టం లేదు కాబట్టి, అమరావతిపై బురదజల్లే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు ఉన్న ప్రాంతంలో 48 గంటల పాటు అతి భారీ వర్షం కురిసినా చుక్క నీరు నిలవలేదు. కానీ ఉద్దేశ్యపూర్వకంగా అమరావతి మునిగిపోయింది అంటూ కొన్ని మీడియా సంస్థలు, కొన్ని సోషల్ మీడియాలలో కొందరు చిలవలు పలవలుగా ప్రచారం చేస్తున్నారు.

విజయవాడ నగరంలో 48 గంటలపాటు అతిభారీ వర్షం కురవడమే కాకుండా బుడమేరు కట్టలు తెగిపోవడం, కృష్ణానదికి దాదాపు 40 వేల క్యూసెక్కుల వరద నీరు రావడం వల్ల నగరం వరదనీటితో అతలాకుతలమైంది. గత రికార్డులను బట్టి ఎన్టీఆర్ జిల్లా సాధారణ వర్షపాతం 17.1 మిల్లీ మీటర్లు కాగా, ఆగస్టు 31న 329.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదే సమయంలో విజయవాడ సాధారణ వర్షపాతం 14.9 మిల్లీమీటర్లు కాగా, ఒక్క రోజులోనే 327.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎన్టీఆర్ జిల్లాతోపాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా మున్నేరు, వైరా, కట్లేరు వంటి ఉప నదులు పొంగి ప్రవహించాయి. ఇదే సమయంలో విజయవాడ నగరం లోపలి నుంచి ప్రవహించే బుడమేరు మళ్లింపు కాల్వకు ఆరు ప్రాంతాల్లో గండ్లు పడటంతో మున్నెన్నడూ లేని విధంగా విజయవాడ జలదిగ్బంధమైంది. కానీ విజయవాడ నగరంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని ఆసరా చేసుకొని అమరావతిపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు.

2005లో భారీ వర్షాల కారణంగా ముంబాయి నగరం 48 గంటల పాటు జలదిగ్బంధంలో ఉంది. ఆ సందర్భంగా 1094 మంది చనిపోయినట్టు మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 24 గంటల వ్యవధిలో ఆ నగర పరిధిలో 944 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఆ తర్వాత కొనసాగిన వర్షం మొత్తం వారం రోజుల వ్యవధిలో 1168 మిల్లీమీటర్లు కురిసినట్టు నమోదైయింది. ఆ సమయంలో అక్కడ ఎటువంటి నదులు, చెరువులు పొంగి పొర్లలేదు, కట్టలు తెగలేదు. కానీ భారీ వర్షాలకు ముంబాయి నగరం గజగజ వణికిపోయింది. అయినా ఎవరూ రాజధాని నగరమైన ముంబాయిని మార్చమని కోరలేదు. అటువంటి ఆలోచన ఎవరూ చేయలేదు. ఇంకా చెప్పాలంటే నిన్న మొన్నటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని, నేడు తెలంగాణ రాజధాని నగరమైన హైదరాబాద్ పట్టుమని 20 మిల్లీమీటర్ల వర్షం పడితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విజయవాడ నగర పరిధిలో ఆకస్మికంగా వరద వచ్చినప్పటికీ అదృష్టం కొద్దీ ప్రాణనష్టం పెద్దగా జరగలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కేంప్ కార్యాలయాన్ని విజయవాడ కలెక్టరేట్‌కు మార్చడంతోపాటు స్వయంగా ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి ప్రజలకు అండగా నిలిచారు.



> ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ఎంపిక చేసిన అమరావతి ప్రాంతం చాలా ఎత్తైనది కావడమే కాకుండా, కృష్ణానదికి 10 కి.మీ. దూరంలో ఉంటుంది. అమరావతి కోర్ ఏరియాలో వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయపాలెం వంటి మొత్తం 29 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు ఎప్పుడూ వరద ముంపునకు గురికాలేదు.

బుడమేరు– మైలవరం ప్రాంతంలోని కొండల నుంచి ప్రారంభమై అనేక వాగులు, వంకలతో కలసి విజయవాడ నగరంలో ప్రవేశిస్తుంది. మూడు దశాబ్దాల క్రితం వరకు అధిక వర్షాలు కురిసిన ప్రతిసారి పంట పొలాలను ముంచెత్తి, రైతులకు తీవ్ర నష్టం కలిగించేది. ఆ సమయంలో బుడమేరు పరివాహక ప్రాంతంలో జనావాసాలు లేవు. బుడమేరు కారణంగా రైతులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని అది విజయవాడ నగరంలో ప్రవేశించకుండా దారిమళ్లించే పథకాన్ని రూపొందించారు. దీని ప్రకారం బుడమేరు వరద దారి మళ్లే విధంగా పెద్దకాల్వ (బుడమేరు డైవర్షన్ ఛానల్) తవ్వడంతో పాటు నీరు ఆ కాల్వ ద్వారా విజయవాడకు ఎగువున ఇబ్రహీంపట్నం ప్రాంతంలో విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్‌కు సంబంధించిన కాల్వకు అనుసంధానం చేశారు. అప్పటి నుంచి విజయవాడకు బుడమేరు తాకిడి తగ్గిపోయింది. ఇదే సమయంలో నగరం విస్తరించడంతో బుడమేరు పరివాహక ప్రాంతంలోని పంట పొలాలన్నీ జనావాసాలుగా మారిపోయాయి. ఇప్పుడు విజయవాడలో ముంపునకు గురైన జనావాసాలన్నీ బుడమేరు పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. భారీ వర్షాలు కురవడంతో పాటు బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండ్లు పడటం వల్లనే విజయవాడ నగరానికి ఈ పరిస్థితి దాపురించింది. ప్రస్తుత పరిస్థితి మరల పునరావృతం కాకుండా ఉండాలంటే బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండ్లు పడకుండా పటిష్ఠమైన రివిట్‌మెంట్ చేయడంతోపాటు ఎప్పటికప్పుడు ఛానల్ కట్టలను పర్యవేక్షించాలి.

నూతన ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ఎంపిక చేసిన అమరావతి ప్రాంతం చాలా ఎత్తైనది కావడమే కాకుండా, కృష్ణానదికి 10 కి.మీ. దూరంలో ఉంటుంది. అమరావతి కోర్ ఏరియాలో వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయపాలెం వంటి మొత్తం 29 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు ఎప్పుడూ వరద ముంపునకు గురికాలేదు. అమరావతి ముంపు అనేది అభూతకల్పన మాత్రమే. ప్రకృతి వైపరీత్యాన్ని ప్రకృతి వైపరీత్యంగానే చూడాలి. చేతనైతే కష్టాలలో, ఇబ్బందులలో ఉన్న ప్రజలకు చేయూతనివ్వాలి. అంతేకానీ ప్రజల కష్టాలను ఆసరా చేసుకొని రాజకీయం చేయాలని, ప్రజా రాజధాని అమరావతిపై లేనిపోని ప్రచారం చేస్తే ప్రజలు మరోసారి బుద్ధిచెబుతారని గుర్తుంచుకోవడం మంచిది.

● అన్నవరపు బ్రహ్మయ్య

చిత్తశుద్ధి లేని 'శివ' పూజలేల?



> మహారాష్ట్రలో ఈ ఏడాది ప్రథమార్ధంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గత పాతికేళ్లుగా ఆ రాష్ట్రంలో ఈ రైతు విషాదం పునరావృతమవుతూనే ఉంది. ఆ అభాగ్యుల పూర్వీకులే ఒకనాడు మహావీరుడు ఛత్రపతి శివాజీ సైనికులుగా ఆయన ఘన విజయాలకు బాసటగా నిలిచారు. మరి శివాజీ బృహత్ శిలా ప్రతిమలు ప్రతిష్ఠించడంకంటే నేటి రైతుల తలసరి ఆదాయాన్ని పెంచడమే ఆ మహోదాత్త నాయకుడి స్మృతిని సమున్నతంగా గౌరవించుకోవడం కాదూ? మహారాష్ట్ర పాలకవర్గాలు, నాయక గణాలు ఈ వాస్తవాన్ని ఎందుకు విస్మరిస్తున్నాయి?



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

దైవీకరణ రాజకీయాల (నాయకులను దైవసమానంగా ఆరాధించడం)లో దైవాంశ సంభూతులు ఉంటారు. మన మధ్య ఉన్నా లేదా కీర్తిశేషులు అయినా వారిని పల్లెత్తు మాట అనడానికి వీలులేదు. మరి ఆ నేతల స్మృతికి అపచారం జరిగితే సహించడమనే ప్రసక్తే లేదు. మన సువిశాల భారతదేశంలో ప్రతి రాష్ట్రంలోను ఆ బాల గోపాలం ఆరాధనకు పాత్రులవుతున్న మహాపురుషులు ఉన్నారు. ఎన్నటికీ వారి కీర్తికాంతులు మసకబారవు; యశోతేజస్సు వెలవెలబోదు. మహారాష్ట్ర అంటే మనకు గుర్తుకువచ్చేదెవరు? ఛత్రపతి శివాజీ. అవును, ఆయన మహారాష్ట్రీయుల మహోన్నత ఆరాధ్యవీరుడు. పరిపాలకుడుగా సైతం ఆయన వారికి ప్రాతఃస్మరణీయుడు.

సరే, నేనూ నా సొంత శివాజీ మహరాజ్ పాఠం నేర్చుకున్నాను. అది 1990ల నాటి మాట. ముంబై విమానాశ్రయానికి పునఃనామకరణం విషయమై ప్రజల్లో తర్జన భర్జనలు జరుగుతున్న సందర్భమది. భారత పౌర విమానయాన చరిత్ర పథనిర్దేశకుడు అయిన జెఆర్‌డి టాటాకు ఆ గౌరవం దక్కాలని నేను నా కాలమ్‌లో నొక్కి చెప్పాను. వెన్వెంటనే శివసేన నాపై విరుచుకుపడింది. ఆ పార్టీ అధికార పత్రిక నా ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఒక ఆగ్రహపూరిత సంపాదకీయం రాసింది. ముంబై విమానాశ్రయానికి మరాఠా విప్లవవీరుడి పేరిటే పునఃనామకరణం చేయాలని, ఆ గౌరవానికి మరెవ్వరి పేరునైనా పరిశీలించడం సైతం శివాజీ స్మృతికి అపచారం చేయడమే అవుతుందని తెగేసి చెప్పింది. నేను రాసిన వ్యాసాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవలసివస్తుందని బెదిరిస్తూ మా కార్యాలయానికి ఫోన్ కాల్స్ వచ్చాయి.

మూడు దశాబ్దాల నాడు నేను నేర్చుకున్న పాఠం నేడు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని వెన్నాడుతోంది, ఇబ్బంది పెడుతోంది, చికాకుపరుస్తోంది. సింధు దుర్గ్‌లో కొత్తగా ప్రతిష్ఠించిన శివాజీ మహరాజ్ విగ్రహం ఇటీవల కూలిపోయింది. ప్రజలు కలతచెందారు. భావోద్రేకం బద్దలయింది. రాజకీయులు, ఊహించిన విధంగానే ప్రతిస్పందించారు. పాలక, ప్రతిపక్ష నేతలు పరస్పరం నిందించుకున్నారు. వాగ్యుద్ధాలకు దిగారు. శివాజీ విగ్రహం ఎందుకు కూలింది? మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఆ పాపాన్ని భారత నావికాదళానికి అంటగట్టడానికి ప్రయత్నించింది. అయితే మరింత నష్టం జరగకముందే నేవీపై తన అభియోగాన్ని ఉపసంహరించుకున్నది. శివాజీ ప్రతిమ కూలిన చోటే మరో బృహత్ శివాజీ విగ్రహాన్ని నెలకొల్పుతామని ప్రజలకు వాగ్దానం చేసింది. విపక్షాలు సంయమనం పాటిస్తాయా? నిరసన ప్రదర్శనలను కొనసాగించాయి. విగ్రహ నిర్మాణంలో ప్రభుత్వం అవినీతికి పాల్పడడం వల్లే ఆ ప్రతిమా భంగం సంభవించిందని ఆరోపించాయి. మరి అసెంబ్లీ ఎన్నికలు ఆసన్నమైన తరుణమిది. కనుక విగ్రహ పతనం రాజకీయాకరణ కావడం అనివార్యం. ఈ భావోద్వేగ అంశం కాకపోతే మరేది రాజకీయ ప్రయోజనాలకు తోడ్పడుతుంది కనుక?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2002 గుజరాత్ ఊచకోతల నాటి నుంచి నేటి దాకా ఎప్పుడైనా బహిరంగంగా క్షమాపణలు చెప్పడం మీరు విన్నారా? కన్నారా? సింధ్ దుర్గ్‌లో శివాజీ విగ్రహం కూలిపోయిన వైనంతో ఆయనకు మరో గత్యంతరం లేకపోయింది. ఆ సంఘటనపై ఆయన బహిరంగంగా విచారం వ్యక్తం చేశారు. అవును మరి, పోయిన డిసెంబర్‌లోనే కదా మహా ఆర్భాటాల మధ్య ఆయన ఆ బృహత్ విగ్రహాన్ని ఆవిష్కరించింది! అసలు ఆ శిలా శివాజీని తొలుత 6 అడుగుల నిడివిలో ఉంచాలని ఉద్దేశించారు. అయితే ఆకస్మికంగా అది 35 అడుగుల విగ్రహంగా రూపుదాల్చింది. ఆ బృహత్ విగ్రహ నిర్మాణానికి సరైన సామగ్రి ఉపయోగించారా? దర్యాప్తు జరిగితీరవలసిన విషయమిది. విగ్రహ నిర్మాణం వేగంగా జరిగింది. ఎందుకు? జాతీయ నాయకత్వాన్ని ఆకట్టుకోవాలనే ఆరాటమే సుమా! ఈ హడావుడిలో నిర్మాణ కార్యక్రమంపై సరైన పర్యవేక్షణను ఉపేక్షించారు. అవినీతి జరిగిందా? ప్రశ్న అనవసరం. సరైన దర్యాప్తే అసలు బాగోతాన్ని వెల్లడించగలదు.

పరస్పర ఆరోపణలు, అభిశంసనల ఆవలకు దృష్టి సారించండి. మహా శక్తిమంతుడు అయిన మొగల్ చక్రవర్తిని ఎదిరించి నిలిచిన ఆ మహానాయకుడి శిలావిగ్రహం మట్టి బొమ్మలా కూలిపోయిన వైనంపై నిశితంగా ఆలోచించండి. మన పరిపాలనా పద్ధతి, మరీ ముఖ్యంగా రాజకీయ వ్యవస్థ ప్రాధాన్యతల గురించి ఆ కూలిన ప్రతిమ చెపుతున్నదేమిటి? మహారాష్ట్ర వ్యాప్తంగా, సువిశాల భారతావనిలో మరెన్నో చోట్ల చిన్న, పెద్ద శివాజీ విగ్రహాలు వేల సంఖ్యలో ఉన్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ప్రతి పల్లె, పట్టణంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఒక సాధారణ దృశ్యం. అలాగే మహారాష్ట్రలోని ప్రతి పట్టణంలోని ముఖ్య కూడలిలో అంబేడ్కర్ విగ్రహం మీకు తప్పక కనిపిస్తుంది. ఒక ఆరాధ్య నాయకుడి వారసత్వాన్ని స్వాయత్తం చేసుకునేందుకు ఆ గౌరవనీయుడి విగ్రహాన్ని నెలకొల్పడం లేక ఒక స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడం పాలక పార్టీలకు ఒక సులభ మార్గమయిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి అధికారానికి వచ్చినప్పుడు అంబేడ్కర్ విగ్రహాల ప్రతిష్ఠాపన, స్మారక చిహ్నాల ఏర్పాటు ఆమె ప్రభుత్వ ప్రధాన వ్యాపకంగా వర్ధిల్లింది. భక్తిప్రపత్తులతో బాబా సాహెబ్‌ను కొలిచే అభిమాన గణాలతో మమేకమవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ అభిలషించింది. అయితే ఆ మహా దేశభక్తుడు, ప్రజాస్వామ్య దార్శనికుడు జాతి జీవనంలో సుస్థిరపరిచిన రాజ్యాంగ విలువలు, సంప్రదాయాలను పాటించడాన్ని మాయావతి పార్టీ మరచిపోయింది.

మహారాష్ట్రలో సైతం శివాజీ మహరాజ్ బృహత్ విగ్రహాలను (పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో) నిర్మించేందుకు నాయకులు ఒకరిని మించి మరొకరు పోటీ పడుతుండడం కద్దు. మరి అంతే జరూరుగా నాణ్యమైన పాఠశాలల ఏర్పాటు, సకల సదుపాయాలు ఉన్న ఆస్పత్రుల నిర్మాణ ఆవశ్యకత గురించి కనీస మాత్రంగానైనా ఆలోచించే నేతలు ఎంత మంది? ఉదాహరణకు ముంబై తీరరేఖకు దూరంగా అరేబియా సముద్రంలో శివాజీ మహరాజ్ స్మారక చిహ్నాన్ని నెలకొల్పాలని 2004లో నాటి కాంగ్రెస్- ఎన్‌సిపి సంకీర్ణ ప్రభుత్వం ప్రతిపాదించింది. తదాది ఎన్నో ప్రభుత్వాల ఉత్థానపతనాలు జరిగాయి. ప్రతి ప్రభుత్వమూ, న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీకి దీటుగా ముంబైకి అభిముఖంగా అరేబియా సముద్రంలో శివాజీ స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని చెబుతూ వస్తోంది.

మహారాష్ట్ర ఆర్థిక సర్వే 2023–24 ప్రకారం రాష్ట్ర రుణ భారం రూ.7 లక్షల కోట్లకు మించిపోయింది. ఆ అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ రూ. 48,000 కోట్లకు పైగా ఉన్నది. మహారాష్ట్ర ఇప్పటికీ మన దేశంలో పారిశ్రామికాభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా ఉన్నది. జాతీయ దేశీయోత్పత్తికి అత్యధికంగా తోడ్పడుతున్నది కూడా మహారాష్ట్రే. అయితే వ్యవసాయ రంగంలో పురోగతి బాగా మందగించిపోయింది. గత ఏడాది రుతుపవనాలు దోబూచులాడడంతో పంటల దిగుబడులు పూర్తిగా దిగనిల్లిపోయాయి. గ్రామీణ ప్రాంతాల ఆర్థికత పూర్తిగా కుదేలయిపోయింది. గ్రామీణుల దురవస్థలు మిక్కుటమయ్యాయి. ఫలితంగానే గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని వెయ్యికి పైగా గ్రామాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించవలసిన అగత్య మేర్పడింది. రాష్ట్రంలో పలు భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో వాటి అంచనా నిర్మాణ వ్యయాలు బాగా పెరిగిపోయాయని డిసెంబర్ 2022లో కాగ్ నివేదిక ఒకటి వెల్లడించింది. 2024లో మొదటి ఆరు నెలల కాలంలో 500 మందికి పైగా రైతులు ఆత్మహత్యచేసుకున్నారు. గత పావు శతాబ్ది కాలంగా మహారాష్ట్రలో ఈ బలవన్మరణాల కథ పదే పదే పునరావృతమవుతూనే ఉంది.

చాలా కాలంగా ఉన్న వ్యవసాయక సంక్షోభానికి ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి ఏ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది? ఇది సమాధానం లేని ప్రశ్నే. అన్నదాతల 'వ్యథలు చించడం'పై దృష్టిని కేంద్రీకరించడం కంటే అరేబియా సముద్రంలో శివాజీ బృహత్ విగ్రహాన్ని నెలకొల్పుతామనే హామీ ఇవ్వడమే తేలిక కదా. తద్వారా పతాక శీర్షికలలో ఉంటూ ప్రజల మద్దతునూ పొందవచ్చు అనేది పాలక వర్గాల మనోగతంగా ఉన్నది. మరి పరిపాలనను చక్కదిద్ది దురవస్థల నుంచి రైతులను గట్టెక్కించేదెప్పుడు? ఈ అభాగ్య రైతుల ముత్తాతల ముత్తాతలే కాదూ మహాశక్తిమంతమైన మొగల్ చక్రవర్తి సేనలను ఛత్రపతి శివాజీ నేతృత్వంలో అరివీరభయంకరంగా ఎదుర్కొని విజయాలు సాధించి మరాఠా సామ్రాజ్యానికి పునాదులు వేసింది, శివాజీ మహరాజ్ శౌర్య సాహసాల ఘనతకు, పరిపాలనా దక్షతకు వెన్నుదన్నుగా నిలబడింది ఆ మట్టి మనుషులే కదా. మరి ఆ వీరుల వర్తమాన వారసుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడానికి నేటి ప్రభుత్వాలు అంకితమవ్వడమే శివాజీ స్మృతిని సమున్నతంగా గౌరవించడమవుతుంది. అంతేగానీ ఆ మహా నాయకుడి పేరిట మరో స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడమనేది ప్రజా శ్రేయస్సుకు దోహదం చేసే పని ఎంతమాత్రం కాదు, కాబోదు.

శివాజీ విగ్రహం కూలిపోయినందుకు గుండెలు బాదుకుంటున్న రాజకీయవేత్తలను నేను ఒక ప్రశ్న అడగదలిచాను: రాజకీయ నైతికత, ప్రజా జీవితంలో విలువల పతనమవడం పట్ల కూడా మీరు పరితాపం చెందుతున్నారా? చెందనిపక్షంలో మన జాతి ఇతిహాసంలో ఒకే ఒక్కడు అయిన శివాజీ మహరాజ్‌కు నిజమైన వారసులమని చెప్పుకునే నైతిక అధికారం మీకు లేదుగాక లేదు.

తాజా కలం: శివాజీ మహరాజ్ విగ్రహ పతనం పట్ల ప్రధానమంత్రి సత్వరమే ప్రతి స్పందించి క్షమాపణలు చెప్పారు. అయితే ఆయనగానీ, మరే ఇతర సీనియర్ నాయకుడుగానీ ఇన్నాళ్లుగా అన్నదాతల ఆవేదనలో పాలుపంచుకున్నారా? అనేక సంవత్సరాలుగా పదే పదే సంభవిస్తున్న రైతన్నల ఆత్మహత్యలకు అనుతాపం చెందారా?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆటంకం కలిగించవద్దు

రాష్ట్రంలో వరదలు సృష్టించిన బీభత్సం ఊహకు అందనిది. ప్రకృతి ప్రకోపానికి ప్రజలు విలవిలలాడిపోయారు. ఇలాంటి ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు శరణార్థులను ఆదుకొని, వారికి తగిన సహాయం చేయాలి. అంతేకాని ఈ సమయంలో రాజకీయం చేయడం తగదు. నేడు కొందరు ప్రకృతి విపత్తును కూడా రాజకీయానికి వాడుకుంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు. కోట్లాది రూపాయలను వెనకేసుకున్న వీరు, బాధితులకు సహాయం చేయడానికి ముందుకురారు. వీరి పని ఎంతసేపూ ఎదుటివారిని విమర్శించడమే! చేతనైతే సహాయం చేయండి.. మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడండి. అంతేకాని, నోటికొచ్చింది మాట్లాడుతూ వరద సహాయ చర్యలకు ఆటంకం కలిగించవద్దని ప్రజలు వేడుకుంటున్నారు.

– కాయల నాగేంద్ర

కుల గణన: పది పాక్షిక సత్యాలు

> ఒక సమాజపు నిజమైన స్వభావాన్ని దాచిపెట్టే మిథ్యా విశ్వాసాలను 'భావజాలం' సూచిస్తుందన్న సామాజిక శాస్త్రవేత్త కార్ల్ మ్యాన్‌హీమ్ అభిప్రాయానికి, కుల గణన విషయమై ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న చర్చే ఒక దృష్టాంతం. కులాల ప్రాతిపదికన జనాభా గణన పట్ల ఈ తరహా 'సైద్ధాంతిక' వ్యతిరేకత అనేక పాక్షిక విశ్వాసాలుగా పరిణమించింది. ప్రతి పాక్షిక అభిప్రాయంలోను రవంత సత్యం ఉన్నా సమాజ స్వతస్సిద్ధ స్వభావాన్ని మాటుపరిచే విధంగా ఆ మిథ్యా విశ్వాసాలు లోకంలో ప్రచలితమవుతున్నాయి.





■ యోగేంద్ర యాదవ్

హంగేరియన్ సామాజిక శాస్త్రవేత్త, జ్ఞాన సామాజిక శాస్త్రానికి ఆద్యుడు అయిన కార్ల్ మ్యాన్‌హీమ్ (1893–1947) 'భావజాలం' అనే పదాన్ని ఒక ప్రత్యేకమైన అర్థంలో వాడుతుండేవారు. ఒక సమాజపు నిజమైన స్వభావాన్ని దాచిపెట్టే మిథ్యా విశ్వాసాలను 'భావజాలం' సూచిస్తుందని మ్యాన్‌హీమ్ అనేవారు. ఆయన ఆ పదానికి ఆపాదించిన అర్థం విస్తృత ప్రాచుర్యం పొందలేదు. అలాగే భావాలను వాటి సామాజిక ప్రాతిపదికలకు కుదించివేసేందుకు మ్యాన్‌హీమ్ సాగించిన కృషికి సైతం సహ సామాజిక శాస్త్రవేత్తలలో మినహా విశాల మేధో ప్రపంచంలో ఆమోదం, ఆదరణ లభించనేలేదు. భావజాలం గురించిన మాన్‌హ్యీమ్ వ్యాఖ్యానానికి దృష్టాంతం కావాలా? కుల గణన (కులాల ప్రాతిపదికన జనాభా లెక్కలు) విషయమై ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న చర్చే అందుకు సరైన ఉదాహరణ. ఉదారవాదులు, ప్రగతిశీల విద్యావంతులు అయిన భారతీయులతో కుల గణన విషయమై ఎప్పుడైనా చర్చించారా? నేను చాలాసార్లు చర్చించాను. ప్రతిసారీ దిగ్భ్రాంతిచెందాను, కలవరపడ్డాను. ప్రజల విశ్వాసాలను వారి యాదృచ్ఛిక సామాజిక మూలాలతో ముడిపెట్టే వైఖరులను నేను సుతరామూ ఇష్టపడను. వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తాను. అయితే కుల గణన అంశంపై సదరు గౌరవనీయులు తత్తరపాటుతో తమ అజ్ఞానాన్ని, అపోహలను బయటపెట్టుకోవడం, అహంకారాన్ని ప్రదర్శించడం నన్ను వ్యాకులపరిచింది. మన దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలిచేవారు ఇప్పటికీ చాలవరకు అగ్రవర్ణాలవారే కదా అన్న వాస్తవాన్ని నేను జ్ఞాపకం చేసుకోవడాన్ని అనివార్యం చేసింది. కుల గణన పట్ల ఈ తరహా 'సైద్ధాంతిక' వ్యతిరేకత స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చే అనేక పాక్షిక విశ్వాసాలుగా పరిణమించింది. పాక్షికత! అవును, ప్రతి పాక్షిక అభిప్రాయంలోను రవంత సత్యం ఉన్నా సమాజ స్వతస్సిద్ధ స్వభావాన్ని మాటుపరిచే విధంగా ఆ మిథ్యా విశ్వాసాలు లోకంలో ప్రచలితమవుతున్నాయి. అవి అనేకమున్నాయని అన్నాను కదూ. అయితే వాటిలో పది మామూలు పాక్షిక సత్యాలను రేఖామాత్రంగా విశదీకరిస్తాను.

(1) 1931 అనంతరం భారత్ ఎన్నడూ కుల ప్రాతిపదికన జనగణన నిర్వహించలేదు. నిజమే. 1931 తరువాత జరిగిన జనాభా గణన ప్రక్రియలో గణకులు ప్రతీ వ్యక్తిని కులం గురించి ప్రశ్నించలేదు. అయితే ఈ అపవాదు అనుచితమైనది. స్వతంత్ర భారత దేశంలో ప్రతి పదేళ్లకొకసారి నిర్వహిస్తున్న జనాభా గణనలో ప్రతిసారీ కులం ఏమిటని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రతిస్పందించిన పౌరుడు షెడ్యూల్డు కులాలకు చెందినవాడా లేక షెడ్యూల్డు తెగలకు చెందినవాడా అనే విషయాన్ని విధిగా నమోదు చేయడమూ జరుగుతోంది. అంతేకాదు ఎస్సీలలో ఏ నిర్దిష్ట ఉప కులం లేదా షెడ్యూల్డు తెగలలో ఏ నిర్దిష్ట ఉప తెగకు చెందినవారో కూడా స్పష్టంగా నమోదు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల విద్యార్హతలు, ఆర్థిక స్థితిగతులపై ఆ ఉపకులాల/ తెగల నిర్దిష్ట వివరాల సమాచారం ఆధారంగానే అంచనాకు వస్తున్నారు.

(2) కుల గణన అనేది రాహుల్‌గాంధీ కొత్తగా చేస్తున్న (ఆమోదయోగ్యంకాని) డిమాండ్. వాస్తవమే. కుల గణన నిర్వహించి తీరాల్సిందేనని ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న రాజకీయ సంకల్పం చాల వరకు రాహుల్‌గాంధీ దృఢ విశ్వాసజనితమే. అయితే ఈ డిమాండ్‌లో కొత్త విషయం కానీ స్వార్థ ప్రయోజనాలు కానీ లేనేలేవు. కుల గణన నిర్వహించాలన్న సిఫారసు వాజపేయి ప్రభుత్వ కాలం నాటిది. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సెన్సస్ కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆ సిఫారసు చేశారు. మే 2010లో లోక్‌సభ ఈ సిఫారసును సమగ్రంగా చర్చించి బీజేపీ సంపూర్ణ ఆమోదంతో దేశవ్యాప్తంగా జన గణనను నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. 2018లో తదుపరి జనాభా గణనలో ఓబీసీ జనాభా లెక్కల సేకరణను కూడా చేర్చుతామని నాటి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. బిహార్‌లోని ఎన్డీఏ ప్రభుత్వంతో సహా సామాజిక న్యాయంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, ఇంకా నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ మొదలైన చట్టబద్ధ సంఘాలు కూడా అందుకు మద్దతు తెలిపాయి.

3) కుల గణన అనేది ఒక బృహత్తర కార్యం. దానివల్ల జనాభా లెక్కల సేకరణ జాప్యమవుతుంది. యథార్థమే. కులం ఏమిటి అన్న ప్రశ్నను సకల కులాలవారికి విధిగా వేయాలంటే ప్రస్తుతం జనాభా లెక్కల సేకరణకు అనుసరిస్తున్న అధికారిక నమూనాలో మార్పులు చేయవలసి వుంటుంది. అయితే ఇదేమీ పెద్ద పని కాదు.

(4) సిద్ధపరిచిన సమగ్ర కులాల జాబితా లేదు. అటువంటి జాబితాను రూపొందించడం అసాధ్యం. నిజమే. జనరల్ కేటగిరీకి చెందిన అన్ని కులాల, ఉప కులాల అధికారిక జాబితా లేదు. అయితే మన దేశ జనాభాలోని నాలుగింట మూడు వంతుల జనాభా– ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ– కు సంబంధించిన అటువంటి జాబితా సిద్ధంగా ఉన్నది. జనరల్ కేటగిరి విషయానికి వస్తే సంబంధిత పౌరుడు చెప్పిన కులం పేరును కచ్చితంగా నమోదు చేయాలి. భాష, మతం విషయంలో వలే అలా నమోదు చేసిన పేర్లను ఆయా కులాల వారీగా వర్గీకరించవచ్చు.

(5) ప్రతి కుల జనాభాలో ఎంత మంది వ్యక్తులు ఉన్నారో లెక్కించడమే కులగణన. సత్యం. కుల గణనలో వెల్లడైన వివరాలను ప్రచురించినప్పుడు అందరూ తొట్టతొలుత ఆసక్తి చూపేది ఆ విషయంపైనే అనడంలో సందేహం లేదు. అయితే కుల గణన నుంచి లభించేది అతి ముఖ్యమైన సమాచారం సంబంధిత కుల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, విద్యార్హతలు. కులాల వారీగా స్త్రీ పురుషుల నిష్పత్తి, విద్యాస్థాయి, వృత్తి, ఎలాంటి గృహంలో నివసిస్తున్నారు, కుటుంబ ఆస్తులు, మంచినీరు, విద్యుత్, వంటగ్యాస్ సదుపాయాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం అందుబాటులోకి వస్తుంది. కచ్చితమైన ఆధారాల ప్రాతిపదికన ప్రామాణిక సామాజిక విధానం రూపకల్పనకు అటువంటి సమాచారం తప్పనిసరి అని సుప్రీంకోర్టు నిర్దేశించింది.

(6) కుల గణనలో హిందూమతేతరులను మినహాయిస్తారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కులాన్ని అనుసరించేలా కుల గణన నిర్బంధం చేస్తుంది. ఇదొక శుద్ధ అబద్ధం. ప్రతి మత సమూహంలోను కులాలు ఉన్నాయి. హిందూ, మతంలోనే కాకుండా ముస్లిం, క్రైస్తవ, సిక్కు మతాలలోనూ కులాలు ఉన్నాయి. బిహార్‌లో జరిగిన 'కుల గణన'లో ముస్లిం మతస్థులలో డజన్‌కు పైగా కులాలు ఉన్నట్టు వెల్లడయింది.


(7) ప్రస్తుత రిజర్వేషన్ కోటాలను మరింతగా పెంపొందించుకునేందుకే కుల గణనను డిమాండ్ చేస్తున్నారు. నిజం. కుల గణనను కోరుతున్నవారిలో అత్యధికుల ఉద్దేశం కూడా అదే. అందులో న్యాయవిరుద్ధమైనది ఏదీ లేదు. ఒక నిర్దిష్ట కుల జనాభా సంఖ్యకు అనుగుణంగా వనరులు, అవకాశాలలో ఆ కులస్థులకు తగు వాటా ఉందా, కొరవడిందా అనే విషయాన్ని కుల గణన ధ్రువీకరిస్తుంది. ఇతర విధానపరమైన విషయాలకు కూడా కుల గణన చాలా ముఖ్యం. ఎస్సీ ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను సంబంధిత వర్గంలోని అన్ని కులాల వారికి సమానంగా విభజించాలా? ఓబీసీ కోటా నుంచి కొన్ని కులాలను మినహాయించాలా? ఎస్సీ ఎస్టీలలో సంపన్నశ్రేణిని పరిగణనలోకి తీసుకోవాలా? ఓబీసీలలో సంపన్న శ్రేణిని నిర్వచించడమెలా? 'అగ్ర కులాల'లో పేదరికం ఏ మేరకు ఉన్నది? సామాజిక అసమానతలను అర్థం చేసుకునేందుకు కులం అనేది ఒక కాలంచెల్లిన ప్రమాణమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్న రిజర్వేషన్ల వ్యతిరేకులు, అనుకూలురు అందరూ కులగణనను డిమాండ్ చేస్తున్నారు.

(8) ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కులగణన అవసరం కానీ జనరల్ కేటగిరీ కులాల వారికి అవసరం లేదు. వాస్తవమే. కుల వ్యవస్థ కాఠిన్యం, ప్రతికూలతలకు నష్టపోయిన కులాల వారికి వనరుల, ఆస్తుల, అవకాశాల అసమ పంపిణీ తీరుతెన్నులు, అది ఏ మేరకు జరుగుతోందో అర్థం చేసుకోవడమే కుల గణనకు ముఖ్యమైన ప్రేరణ. ఒక ప్రామాణికత (బెంచ్ మార్క్) లేకుండా ఈ ప్రతికూలతలు, నష్టాలను అంచనావేయలేము. అందుకు 'జనరల్' కేటగిరీ కులాల వారు పొందుతున్న సదుపాయాలను సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. పౌరులు అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని అమలుపరిచేందుకు సకల జీవన రంగాలలోని హిందూ అగ్రకులాల వారి ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిర్గతపరచడం అత్యవసరం.

(9) కులతత్వ రాజకీయాలు పెచ్చరిల్లేందుకు, సామాజిక సంఘర్షణలు తీవ్రమయ్యేందుకు కులగణన దారితీస్తుంది. సత్యమే. అధికారిక రికార్డులలో కుల అస్తిత్వాన్ని నమోదు చేయడమంటే దాన్ని మరింత దృఢపరచడమే. అయితే దేశ జనాభాలో నాలుగింట మూడోవంతు మంది కుల అస్తిత్వాలు ఇప్పటికే అధికారిక రికార్డుల్లో నమోదయి ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు.

(10) ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే జనాభా లెక్కల సేకరణలో కులాన్ని చేర్చడానికే కుల గణన పరిమితమవుతుంది. నిజమే. కుల గణన గురించి సామాన్య అవగాహన అది. అయితే కులాలవారీగా ఆస్తుల, సదుపాయాల, వనరుల, అవకాశాల, ప్రాతినిధ్యాల సమగ్ర జాబితాకు కులం ప్రశ్నను ఇతర సమాచార సేకరణ సంబంధిత సర్వేలలో కూడా చేర్చవలసి ఉంటుంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)







కేసరపల్లిలో బుడమేరు బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



బుడమేరు వరద ప్రభావం నుంచి కోలుకుంటున్న బాధితులకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ సాయం వెల్లువెత్తుతోంది. తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి ఆహారం, తాగునీరు వస్తోంది. స్వచ్ఛంద సంస్థల నుంచి కూడా అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలు ఊపందుకున్నాయి. సింగ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు వెళ్లే బాధితుల కోసం గురువారం 179 ఆర్టీసీ బస్సులను ఉచితంగా తిప్పేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో వాటర్ ట్యాంకర్లు తెప్పించింది. ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసేందుకు వాహనాలు సిద్ధం చేసింది. వరద తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో వీఎంసీ నీటి సరఫరాను పునరుద్ధరిస్తోంది. వీటిని వాడుక అవసరాలకే ఉపయోగించాలని మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు. రహదారుల్లో బ్లీచింగ్ చల్లేందుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- విజయవాడ/సత్యనారాయణపురం



మిల్క్‌ఫ్యాక్టరీ వద్ద నిత్యావసరాల పంపిణీ

మిల్క్‌ఫ్యాక్టరీ రోడ్డులో సబ్సిడీ రేట్లకు కూరగాయల అమ్మకం (ఇన్‌సెట్లో) వైఎస్సార్ కాలనీలో టాంకర్లతో తాగునీరు

కొండంత అండగా..

- బాధితులకు పెద్దఎత్తున తాగునీరు, ఆహారం సరఫరా
- వందల సంఖ్యలో వాటర్ ట్యాంకర్లు
- కాలనీల ముందు పంచి వెళుతున్న సిబ్బంది
- శివారు ప్రాంతాల్లో సాయం కోసం ఎదురుచూపులు

వరద ప్రాంతాలకు తరలివస్తున్న సాయం



వైఎస్సార్ కాలనీ నుంచి వస్తున్న బాధితులు

(విజయవాడ, ఆంధ్రజ్యోతి) నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతమయ్యాయి. సీఎం చంద్రబాబు, మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, ఆహారం, మందులు ప్రతీ బాధితుడికి అందించాలని ఆదేశించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, రెవెన్యూ, ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని రంగంలోకి దించారు. కేంద్రంతో మాట్లాడి హెలికాప్టర్లను సైతం రప్పించారు. ఐదు రోజులుగా ముంపులో చిక్కుకుపోయిన బాధితులకు అన్నపానియాలను అందించడానికి బోట్లు హెలికాప్టర్‌లు, డ్రోన్‌లు, ట్రాక్టర్లు, లారీలు, సాయంతో సేవలందించేలా దిశానిర్దేశం చేశారు. ఖర్చుకు వెనకాడకుండా ఆహార పొట్లాలు, నీరు, పాలు, బ్రెడ్‌లు, బిస్కెట్లు, సమకూరుస్తున్నారు. ఈ సహాయాలు ముంపు ప్రాంతాల్లోని అందరికీ చేరడం లేదు. కాలనీ ముందు భాగంలో ఉన్నవారికి పంచి వెళుతున్నారు. శివారుల్లో ఉన్నవాళ్లను అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇంకా వరదలోనే కాలనీలు..

రెండు రోజులుగా వరద ఉధృతి తగ్గుముఖం పట్టినా శివారు కాలనీల్లోని బాధితుల పరిస్థితి ఇప్పటికీ దుర్భరంగానే ఉంది. సింగ్‌నగర్, రామలింగేశ్వరనగర్, రాజరాజేశ్వరి పేట, ఆంధ్రప్రభ కాలనీ, ఉడాకాలనీ, పాయకాపురం, కండ్రిక, అంబాపురం, ఇందిరానాయక్ నగర్, జక్కంపూడి కాలనీ తదితర ప్రాంతాల్లో ఇప్పటికి మోకాలు నుంచి నడుం లోతు వరద నీరు నిలిచే ఉంది. ఐదు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో ఇంకా కరెంటు లేక పోవడంతో చిమ్మచీకట్లలో బిక్కుబిక్కుమంటూనే రోజులు గడుపుతునారు. కర్రల సాయంతో, స్వచ్ఛంద సంస్థలు, యువకుల సాయంతో సురక్షత ప్రాంతాలకు కట్టుబట్టలతో వెళ్లి పోతున్నారు. కొంతమంది సొంతంగా డబ్బులు చెల్లించి ట్రాక్టర్లు ఆశ్రయించి కట్టుబట్టలతో బయట పడుతున్నారు. అక్కడ నుంచి రోగులు, వృద్ధులు, చిన్నపిల్లలు, బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నవారు తప్పనిసరి పరిస్థితులలో ఇళ్లలో, అపార్టుమెంట్‌లలో పై అంతస్తుల్లోకి చేరి తలదాచుకుంటున్నారు.

అధికారులూ.. ఇటు చూడండి!



పాయకాపురంలో ఆహారం బాక్సులు తీసుకెళుతున్న వరద బాధితులు

ఇన్‌చార్జులు ఏం చేస్తున్నట్టు..?

ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిరోజు నుంచే రంగంలో దిగి కష్టపడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం, అధికారులలో మాత్రం చలనం లేదు. సహాయక చర్యలకు సంబంధించి సీనియర్ ఐఏఎస్‌లు వివిధ విభాగాల వారిగా బాధ్యతలు అప్పగించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం మెరుగుపడలేదు. మరోవైపు మంత్రులు ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులందరినీ ఇన్‌చార్జులుగా వేసినా వరద బాధితులకు అందుబాటులో ఉండటంలేదని, కేవలం ఫొటోలకే పరిమితం అవుతున్నారని బాధితులు వాపోతున్నారు.

వృథా అవుతున్న ఆహార పదార్థాలు

వివిధ ప్రాంతాల నుంచి ఆహారం, బ్రెడ్, బిస్కెట్‌లు, దుప్పట్లు, వాటర్‌బాటిల్స్ తీసుకువచ్చిన వారు ఎక్కడ పంచాలో తెలిక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వారికి అధికారులు ఎవరూ తోడ్పాటు అందించడం లేదు. దీంతో వారు శివారు ప్రాంతాలకు వెళ్లలేక దారిలోనే పంచివెళ్లి పోతున్నారు. దీంతో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి వివిధ జిల్లాల నుంచి దాతలకు తీసుకువస్తున్న సాయం కూడా వృథా అవుతోంది.

మళ్లీ పెరుగుతున్న వరద

రెండు రోజులుగా వరద తగ్గడంతో ముంపు ప్రాంతాలవారు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం మధ్యాహ్నం నుంచి మళ్లీ కాలనీల్లో వరద పెరుగుతుంది. దీంతో బాధితులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.



ముంపు ప్రాంతాల్లో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, నారా లోకేష్‌తో పాటు ఎంపీలు కేశినేని చిన్ని, పురంధేశ్వరి



పాయకాపురంలో ఇంకా తగ్గని వరద



వైఎస్సార్ కాలనీలో నీటి అవస్థలు



చిట్టినగర్‌లో కొట్టుకొచ్చిన పరుపులు

లోపలిదాకా ఆహారం రావడం లేదు



ప్రభుత్వం పంపే సాయం ముందు ప్రాంతాలకే అందుతోంది. లోపల ఉన్న మాకు రావడం లేదు. నడుం లోతు నీళల్లో ఉంటున్నాం. ఇక్కడ వరకూ ఏ బోటూ రావడం లేదు. పాలు, నీరు, ఆహారం అందండం లేదు. కాలనీలో మొదటి రోడ్డు వరకూ మాత్రమే వచ్చి ఇచ్చి వెళుతున్నారు. ఇచ్చిన భోజనం సైతం పాడైపోయాయి. తినడానికి పనికి రావడం లేదు. **- శివకుమారి, తోటవారివీధి, 4వ లైన్**

దాతల సహకారంతో..



ఐదు రోజులుగా కరెంటు లేదు. ముసలివారు, చిన్ని పిల్లలతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం. కేవలం 250ఎంఎల్ వాటర్ ప్యాకెట్‌లు మాత్రం ఇచ్చారు. తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నాం. నడుం లోతు నీటిలో బయటకు వచ్చి దాతలు ఇచ్చే ఆహారాన్ని తీసుకొని వెళతున్నాం. ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదు. **తరుణ్‌కార్తిక్, ఆంధ్రప్రభ కాలనీ**



సైపుల రోడ్డులో..



నున్న పోలీస్‌స్టేషన్ రోడ్డులో వరద ఇలా..

వీడని వరద భయం

- పొంగి ప్రవహిస్తున్న బుడమేరు
- గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో తీవ్ర ప్రభావం
- మంత్రి కొల్లు, ఎమ్మెల్యే యార్లగడ్డ విస్తృత పర్యటన
- నందివాడ, ఉంగుటూరు మండలాలను చుట్టుముట్టిన వరద
- గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- పూర్తిగా దెబ్బతిన్న పంట పొలాలు



ఉంగుటూరు మండలం లంకపల్లిలో నీటమునిగిన వరిపొలాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణానదికి వరద ప్రవాహం తగ్గినా బుడమేరు వదర తీవ్రత తగ్గలేదు. బుడమేరు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీటితో గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లోని నందివాడ, ఉంగుటూరు, పెదపారుపూడి మండలాల్లోని పలుగ్రామాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి. నందివాడ మండలంలోని లింగాల, పెదలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక, రామాపురం, అరిపిరాల, వెన్ననపూడి, కుదరవల్లి, ఇలపర్రు, లక్ష్మీనరసింహపురం గ్రామాల్లోకి వరదనీరు మరింతగా పెరిగింది. ఈ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాల్లో ఉంచి అధికారులు భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

కృష్ణానదికి గణనీయంగా తగ్గిన వరద

కృష్ణానదికి గురువారం నాటికి వరద ఉధృతి పూర్తిగా తగ్గింది. గురువారం నాటికి ప్రకాశం బ్యారేజీ నుంచి 1.91 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదుతులున్నారు. మోపిదేవి, అవనిగడ్డ, చల్లపల్లి, నాగాయలంక మండలాల్లోని కొత్తపాలెం, ఎండ్లంక, బొబ్బర్లంక, పులిగడ్డ, దక్షిణచిరువోలులంక, వసుమట్ల, పులిగడ్డపల్లెపాలెం, ఆముదార్లంక గ్రామాలు వరదనీటి నుంచి బయటపడ్డాయి. లంకభూముల్లో, కరకట్టకు కృష్ణానదికి మధ్యన ఉన్న భూముల్లో సాగుచేసిన కంద, పసుపు, అరటి, మొక్కజొన్న, కూరగాయలు, నిమ్మ, పూలతోటలు వరదనీటి నుంచి బయటపడ్డాయి.

- పెదపారుపూడి మండలం మోపర్రు, వింజరంపాడు, దోసపాడు, నాగాపురం, సోమవరప్పాడు తదితర గ్రామాల్లోకి పెద్దఎత్తున వరదనీరు చేరింది.
- బాపులపాడు మండలం ఆరుగొలను, ఓగిరాల, రామన్నగూడెం, రంగయ్య అప్పారావుపేట తదితర గ్రామాల్లోకి వరదనీరు చేరింది. ఇక్కడ ఐదు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజలను తరలించారు.

భయపెడుతున్న బుడమేరు

బుడమేరు, ఎట్టివాగులలో వరదనీరు ప్రవహిస్తుండటంతో ఓగిరాల, రామన్నగూడెం తదితర ఏడు గ్రామాల ప్రజలను ఖాళీచేసి పునరావాస కేంద్రాలకు తరలించారు.

- ఆరుగొలను జడ్పీహైస్కూల్‌లో పునరావాస కేంద్రంలో నీరు చేరటంతో వారిని కానుమోలు, బాపులపాడు పునరావాస కేంద్రాలకు తరలించారు.
- హనుమాన్‌జంక్షన్ నుంచి గుడివాడ వెళ్లే రహదారిపై ఆరుగొలను వద్ద బుడమేరు ఐదడుగుల మేర ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేశారు. గన్నవరం మండలంలో సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పర్యటించారు.
- బుడమేరు ఉధృతికి ఉంగుటూరు మండలంలోని గ్రామాలు నీట మునిగాయి. తరిగొప్పల వద్ద బుడమేరు, మానికొండ వద్ద వన్నేరువాగు పొంగి పొర్లుతుండటంతో గన్నవరం-మానికొండ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.
- తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిపై ఉంగుటూరు వద్ద బుడమేరు కాజ్‌వేపై రాకపోకలు స్తంభించాయి. ఉంగుటూరు-పుట్టగుంట మధ్య కొయ్యగూరపాడు వద్ద బుడమేరు వంతెనపై నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. బుడమేరు నీటిప్రవాహాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ బాలాజీ పరిశీలించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డ మండలం దక్షిణ చిరువోల్లంక, ఎడ్లంక, మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

ఒక్కొక్కరిది ఒక్కో కథ..!

కోలుకుంటున్న సింగ్‌నగర్.. బయటికొస్తున్న బాధితులు

8లో..


పడవ మీద జక్కులనెక్కలం వెళుతున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ


జగ్గయ్యపేటలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య


తోట్లవల్లూరు శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న రవీంద్ర


పాత ఎడ్లంకలో బాధితులను పరామర్శిస్తున్న బుద్ధప్రసాద్

కొండంత అండగా మేమున్నాం..

గన్నవరం, సెప్టెంబరు 5 : ముంపు బాధిత ప్రజలకు అండగా ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జక్కులనెక్కలం గ్రామానికి పడవపై వెళ్లి బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను ఆయన పరామర్శించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, ఏ ఒక్కరు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. జాస్తి వెంకటేశ్వరరావు, చిగురుపాటి కుమారస్వామి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. పురుషోత్తపట్నం, ముస్తాబాద, సావరగూడెం గ్రామాలను కూడా పరిశీలించారు. శానిటేషన్ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. **అవనిగడ్డ** : వరదల కారణంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ భరోసా ఇచ్చారు. అమెరికా పర్యటనను మధ్యలోనే నిలిపి వేసి బుధవారం రాత్రి తిరిగి వచ్చిన బుద్ధప్రసాద్ గురువారం ఉదయం నుంచే అవనిగడ్డ నియోజకవర్గంలోని పాత ఎడ్లంక, దక్షిణ చిరువోలులంక గ్రామాల్లో పర్యటించిన వరద నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. అవనిగడ్డ రూరల్ : రామచంద్రపురం పాలిటెక్నిక్ కళాశాలలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి దక్షిణ చిరువోలులంక గ్రామ వరద బాధితులను పరామర్శించారు. దక్షిణ చిరువోలులంక గ్రామాన్ని పరిశీలించారు. ఎస్టీ, ఎస్సీ కాలనీలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ పరిశీలించారు. ఎడ్లంక దీవిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరిశీలించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు, ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు. మోపిదేవి : ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో వాటిని ఎదుర్కొని ప్రజలను ఏలా కాపాడుకోవాలో తెలిసిన ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతమైన కె.కొత్తపాలెంలో గురువారం ఆయన పర్యటించి ముంపుకు గురైన గృహాలను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. పడిపోయిన గృహాల స్థానంలో ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీ విద్య తదితరులు పాల్గొన్నారు.

ఈదుల చెరువుకు గండి

తిరువూరు : ఈదుల చెరువుకు,గుర్రపువాగు సప్లయి చానల్‌కు గురువారం భారీ గండ్లు పడ్డాయి. వందలాది ఎకరాల్లో వరి ముంపునకు గురైయ్యింది. చెరువుకట్టకు గండిపడే ప్రమాదం నెలకొందని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా మొక్కుబడిగా పనులు చేయించారని, ప్రస్తుతం పెరిగిన వరదకుగండ్లు పడటంతో ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో వరి ముంపునకు గురైయ్యిందని రైతులు ఆరోపిస్తున్నారు.

పెద్ద కాలువకు గండి

గుడివాడ : రామచంద్రాపురం వద్ద పెద్ద కాలువకు గండి పడింది. రైతులు అప్రమత్తమై మట్టి సంచులతో గండిని తాత్కాలికంగా పూడ్చారు. పెద్ద కాలువ కట్ట బలహీనంగా ఉందని రైతులు పలుమార్లు ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన వారి నుంచి ఎటువంటి స్పందన లేదని, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి దుర్ఘటనలు సంభవిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

సుబ్రహ్మణ్య చెరువుకు గండి

మచిలీపట్నం టౌన్ : భారీ వర్షాలకు మచిలీపట్నం శివారు ప్రాంతంలోని సుబ్రహ్మణ్య చెరువుకు గండి పడింది. దీంతో టీడీపీ నాయకులు స్పందించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ నేతృత్వంలో టీడీపీ నాయకులు టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, కిలారి అచ్చన్నాయుడు, పిన్నింటి అయ్యప్ప, రమణ తదితరులు గండిపూడ్చివేశారు. హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాధితులకు ప్రభుత్వసాయంతో పాటు నాయకులు సహకారమందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఓగిరాల, రామన్నగూడెం, ఆరుగొలను, రంగయ్యప్పారావుపేట, తదితర ముంపు ప్రాంతాలను, ఐదు పునరావాస కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో వాహనరాకపోకలను ఆపివేశారు. సీఐ సత్యన్నారాయణ, ఎస్సై జనార్దన్ పోలీసు సిబ్బందితో పహారా కాస్తున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ గీతాబాయి ఆదేశాలు జారీ చేశారు. కానుమోలు, ఆరుగొలను, ఓగిరాల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. పునరావాస కేంద్రాల చుట్టూ పంచాయితీ సిబ్బంది సహకారంతో బ్లీచింగ్ చల్లించాలని, పరిసరాల పరిశుభ్రత విషయంలో అలసత్వం వద్దన్నారు. డాక్టర్ కిరణ్మయి, దివ్య, చింత అప్పారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు. **తెన్నేరు (కంకిపాడు)** : వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గొడవర్రు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, టీడీపీ, జనసేన సమన్వయ కర్త ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

గండ్లతో పొంచివున్న ముప్పు

మైలవరంరూరల్ : మండలంలోని పలు చెరువులకు గండ్లు పడటంతో పలు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పొందుగల-మైలవరం గ్రామాల మధ్యలో తుమ్మలబీడు చెరువుకు గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీరు పోటెత్తడంతో గండ్లు పడ్డాయి. మైలవరం ఏసీపీ మురళీమోహన్, సీఐ చంద్రశేఖర్ చెరువు కట్టను పరిశీలించారు. టీడీపీ నాయకులు బొందలపాటి సుధాకర్, లంకా లితీష్, చారుగుండ్ల ప్రసాద్, తదితరులు ఎక్స్‌కవేటర్ ద్వారా కళంగిని పగులగొట్టి వరద నీరును మళ్ళించారు. చెరువుకు పడిన గండ్లను పూడ్చివేశారు. చంద్రగూడెంలోని మల్లయ్య కుంట చెరువు తెగిపోయే ప్రమాదం ఏర్పడటంతో టీడీపీ నాయకుడు మోర్ల రోశాలు గ్రామస్థులతో కలిసి కళంగిని వెడల్పు చేసి వరదనీరును దిగువకు వెళ్ళేలా చేశారు. గణపవరం చెరువు కలంగి ఉధృతంగా ప్రవహిం చడంతో పాటు గండి పడింది. ఆ వరద ధాటికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల గోడ కూలింది. తాత్కాలిక ఇసుక బస్తాలు అడ్డుపెట్టారు.

శ్రీరాం తాతయ్య, నెట్టెం పరామర్శ



జగ్గయ్యపేట : మిట్టగూడెంలో యనాదుల కాలనీ, కర్లబజార్‌లలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం పర్యటించి వరద బాధితులకు భరోసా ఇచ్చారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి, సామాన్లు కోల్పోయిన వారిని ఆదుకుంటామని, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వేకు వస్తారని చెప్పారు. గొట్టి నాగరాజు, గుంజా ఏడుకొండలు, తిమ్మసత్తి రామారావు, ముక్లపుడి అప్పారావు, మదా ర్, కావేటి కృష్ణ, గాలం శ్రీను, మొగిలి సైదులు తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట రూరల్ :** అన్నవరం, బలుసుపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో ఎమ్మెల్యే తాతయ్య పర్యటించారు. రహదారులు, వ్యవసాయ భూములతో పాటు గృహాలను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులు నివేదికలు అందించగానే సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రసాద్, కస్తుర్తి శ్రీనివాసరావు, కట్టా వెంకట నరసింహారావు, యానాల గోపీచంద్, కిషోర్, విష్ణు, సీతారాములు, తదితరులు పాల్గొన్నారు. వరద నష్టం వల్ల దెబ్బతిన్న ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం పేర్కొన్నారు. బూదవాడ గ్రామంలో ఆయన పర్యటించి వరదకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నదిలో కలిసిపోయిన ఇల్లు

జగ్గయ్యపేట రూరల్:రావిరాల గ్రామంలో నది ఒడ్డున నిర్మించిన రెండు రేకుల షెడ్డు ఇళ్లు కూలి నదిలో కలిసిన ఘటన గురువారం వెలుగు చూసింది. పాలేటి నది ఒడ్డున గ్రామానికి చెందిన రాణి, నాగేశ్వరరావు గృహం, చర్చిని నిర్మించారు. ఇల్లు కూలి నదిలో కలిసి పోయింది. ముందు జాగ్రత్త చర్యగా సామాగ్రిని బయటకు తరలించటంతో ప్రాణ, ఆస్తి నష్టం తప్పింది.

ఆదుకునేందుకు సర్వం ఒడ్డుతున్నాం : మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్ : రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నామని, వరద బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయంగా బియ్యం, పంచదార, పామాయిల్ అందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం 50వ డివిజన్ సుందరయ్యనగర్‌లో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ , మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ , మచిలీపట్నం టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు తదితరులు పర్యటించారు. టీడీపీ నాయకులు గోకుల శివ, పాలపర్తి పద్మ, పడమట నాగరాజు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు** : వరద బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అభయమిచ్చారు. తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రంలోని వరద బాధితులను గురువారం రాత్రి మంత్రి పరామర్శించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, వీరంకి వెంకట గురుమూర్తి పలువురు టీడీపీ నాయకులు మంత్రి వెంట ఉన్నారు. రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ తోట్లవల్లూరు, వల్లూరుపాలెం పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులకు రొట్టెలు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్ళను పంపిణీ చేశారు.

నీటి ముంపులోనే పెదపూడి జగనన్న కాలనీ

కూచిపూడి : వరదలు వచ్చి ఐదు రోజులు కావొస్తున్నా మొవ్వ మండలంలోని పెదపూడి జగనన్న కాలనీ నేటికీ నీటి ముంపులోనే ఉంది. కాలనీ వాసులు బయటకు వెళ్లి పాలు, తాగునీరు, ఇతర నిత్యావసరాలు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



మచిలీపట్నం టౌన్ , సెప్టెంబరు 5 : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే సామర్థ్యం టీచర్లకు మాత్రమే ఉందని కలెక్టర్ డికె బాలాజీ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం జడ్పీ కన్వెన్షన్ హాలులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, ఎంఎల్‌సీ కెఎస్‌లక్ష్మణరావు పూలమాలలు వేసి నమస్సుమాంజలి సమర్పించారు. 45 మంది టీచర్లకు కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, డీఈవో తాహెరా సుల్తానా ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ, పలు ఉపాధ్యాయుల సమస్యను మంత్రి నారా లోకేష్ ముందు ఉంచామని, పరిష్కరిస్తామని వాగ్దానం చేసారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, బందరు డీవైఈవో సింగ్ , జిల్లా సైన్స్ ఆఫీసరు జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు,

వృద్ధుడి అనుమానాస్పద మృతి



మోపిదేవి, సెప్టెంబరు 5: అనుమానాస్పద స్థితిలో బడే సత్యనారాయణ (75) అనే వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కోసూరు వారిపాలెంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు నిద్రిస్తున్న సత్యనారాయణ గదిలోకి ప్రవేశించి మెడ నులిమి ముఖంపై పిడిగుద్దులు గుద్దటంతో సత్యనారాయణ కేకలు వేశాడు. పక్కగదిలో నిద్రిస్తున్న భార్య కాంతమ్మ, కుమార్తె రేణుకమ్మ ఇంటి నుంచి బయటకు వచ్చి దొంగలు, దొంగలు అంటూ కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఇంటి వద్దకు రావటంతో రెండు ద్విచక్ర వాహనాలపై కరకట్ట వెంబడి వారు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను బంధువులు హుటాహుటిన చల్లపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా, చికిత్సకు నిరాకరించటంతో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణరావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీసీఎస్ డీఎస్పీ సుభాష్ తెలిపారు. కుటుంబసభ్యులు బంధువులకు ఆస్తి వివాదం జరిగిందని, ప్రస్తుతం దాడి చేసి హత్య చేసినట్టు పుకార్లు వినిపిస్తున్నాయి.

అంత్యక్రియలకు వెళ్లి గుండెపోటుతో ఒకరి మృతి

బడే సత్యనారాయణ అంత్యక్రియలకు వెళ్లి గుండెపోటుకు గురై ముక్కొల్లు పోతురాజు (68) మృతి చెందాడు.

బాధితులకు ఆపన్న హస్తం

ఎమ్మెల్యే తాతయ్య పిలుపు మేరకు

జగ్గయ్యపేట : పట్టణంలో కాకాని నగర్‌లో 100వరద బాధిత కుటుంబాలకు కర్లపాటి చారిటబుల్ ట్రస్టు అధినేత కర్లపాటి శ్రీనివాస రావు నిత్యావ సరాలు, దుప్పట్లను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇద్దరు ఒంటరి మహిళలకు రూ.5వేలు చొప్పున రూ.10వేలు అందచేశారు. మైనేని రాధాకృష్ణ, నూకల బాలకృష్ణ, కౌన్సిలర్ సామినేని మనోహ ర్ తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన్ హైస్కూల్స్ సిబ్బంది యాజమాన్యం ప్రతి ఇంటికి నిత్యవసర సరుకులు అదజేశారు. డోగుపర్తి హనుమంతురావు, సందీప్ 00 ప్యాకెట్లు గుడ్ డే బిస్కెట్లను గురువారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు అందజేశారు. సతీష్, తూములూరి అశోక్, పితాని శ్రీనాథ్, డి.ఎస్.ఆర్ పాల్గొన్నారు. వరద బాధితుల సహాయం కోసం 35 ట్రాక్టర్లను విజయవాడ పంపుతున్నట్టు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. మానవత్వంలో తమ ట్రాక్టర్లను, డ్రైవర్లను పంపేందుకు యజమానులు అంగీకరించారని చెప్పారు. నందిగామ ఆర్టీఓ కార్యాలయం వద్ద నుంచి ఆయన ట్రాక్టర్లను పంపారు. కొఠారు సత్యనారాయణ ప్ర సాద్, ముల్లంగి రామకృష్ణారెడ్డి, కట్టా నరసింహరావు, యానాల గోపి, మాదినేని వెంకట్రావు, పల్లెబోయిన నాగరాజులు ఉన్నారు.

మచిలీపట్నం టౌన్ : వరద బాధితులకు మాజీ ఎమ్మెల్సీ అర్జునుడు కుమారుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బచ్చుల బోసు ఆహార పొట్లాలు, తాగునీరు అందజేశారు. హెల్పింగ్ స్పాట్ ఆధ్వర్యంలో విజయవాడలో ముంపునకు గురైన ప్రాంతాల్లోని వృద్ధాశ్రమాల్లో చిక్కుకున్న వృద్ధులకు ఆహారం అందించేందుకు మచిలీపట్నం నుంచి విజయవాడ తరలివెళ్ళారు. హెల్పింగ్ స్పాట్ అధినేత భార్గవ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎ.కొండూరు : ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి రెండు వేల మందికి వెజిటబుల్ బిర్యానీ, వాటర్ బాటిల్స్ సిద్ధం చేయగా, ఎస్సై కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. పిన్నమనేని శ్రీనివాసరావు, ప్రసాద్‌రెడ్డి, జనసేన నేత శ్రీనివాసరావు, చంద్రు, పీక్లా నాయక్, భీమ్లా నాయక్, బుజ్జీ, చెన్నారావు, చైతన్య, శంకర్, గోపి పాల్గొన్నారు.**తిరువూరు :** చింతలకాలనీలో బాధితులకు స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులు వితరణగా అందించారు. సుమారు 30 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

నిత్యావసర సరుకుల కిట్లు సిద్ధం

వన్‌టౌన్ : బుడమేరు వరద ముంపు కారణంగా గత అయిదురోజులపాటు ఇబ్బందులకు గురైన వరద బాధితులకు ఊరటగా ఉండేందుకు ప్రభుత్వం నిత్యావసర వస్తువులు, బియ్యం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రత్యేకించి 500 మంది సిబ్బందితో గత మూడు రోజుల నుంచి ప్యాకింగ్ చేస్తున్నారు. బాధితులకు 10 కేజీల బియ్యం, ఉల్లిపాయలు 2 కేజిలు, బంగాళదుంపలు 2 కేజీలు, కంది పప్పు కేజీ, పంచదార కేజీ, లీటర్ నూనె ప్యాకెట్ కిట్లలో ఉంచారు. దాదాపుగా ఎన్టీఆర్ జిల్లాలో వరద ముంపు బాధితులకు కిట్లను పంపిణీ చేయనున్నారు. తొలివిడతగా 50 వేల కిట్లను సిద్ధం చేసినట్లు ఇన్‌చార్జి ప్రసాద్ తెలిపారు. సంచార రైతు బజార్‌లో గురువారం భవానీపురం, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో కూరగాయల విక్రయాలను ప్రారంభించారు. టమాట కిలో రూ10, మిర్చి కేజి రూ.5, వంకాయ కేజి రూ.10, బెండకాయ రూ.10, దొండకాయ రూ.5, దోసకాయ రూ.5, సొరకాయ రూ.5, అరటికాయ ఒకటికి రూ.2, క్యారట్ కేజి రూ.10, ఆకుకూరలు ఒక కట్ట రూ.2లకు సంచార రైతు బజార్ అమ్ముతున్నారు. దీంతో కొనుగోలుదారులు సంచార రైతుబజార్ వాహనాల వద్ద బారులు తీరారు.

రెండు టన్నుల కూరగాయలు

కంచికచర్ల: గనిఆత్కూరు, మున్నలూరు గ్రామాలకు చెందిన బాధితులకు మంత్రి కేపీ సారథి ప్రధాన అనుచరుడు, గొట్టుముక్కలకు చెందిన గుదే వెంకటేశ్వరరావు (బుజ్జి) రెండు టన్నుల కూరగాయలు అందజేశారు.



పారిశ్రామికవేత్త విక్కుర్తి

కోడూరు : కోడూరు మండలం హరిపురం వద్ద లింగన్నకోడు లాకుల సమీపంలో నివశిస్తున్న ఎస్టీలకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ భోజనాలను ఏర్పాటు చేశారు. బొంతు ప్రకాష్, పులిగడ్డ చంద్ర, పున్నయ్య చౌదరి, బస్వారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** దక్షిణ చిరువోలులంకలో ఎస్టీ కుటుంబాలకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ వారికి వెంటనే బియ్యం, కందిపప్పును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన సోదరులు విక్కుర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : కనిగిరిలంక, రావిచెట్టులంక గ్రామాల వరదబాధిత కుటుంబాలకు పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో మట్టాఅనిల్, స్వర్ణం శివనాగేశ్వర రావు,తాడిశెట్టి కుటుంబారావు వితరణతో రూ 50వేల విలువ గల నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు.



టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో..

వన్‌టౌన్ : కండ్రిక వరద ముంపు ప్రాంతాల్లో స్థానిక టీడీపీ నాయకులు వరద బాధితులకు భోజనం, వాటర్ పంపిణి చేస్తున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు 64వ డివిజన్ టీడీపీ నాయకులు కె.రవికుమార్, వరలక్ష్మి ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం భోజనం, బస్తాలు వాటర్ ప్యాకెట్లు, నాలుగు ట్యాంకర్ల మంచినీరు అందిస్తున్నారు. టీడీపీ నాయకులు గిరి, కె.రెడ్డి, కె.సాయి, రాజేష్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

పశ్చిమలో సుజనా ఫౌండేషన్ సిబ్బంది



విద్యాధరపురం : పశ్చిమ నియోజకవర్గం వరద ముంపు బాధితులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. బాధితులకు ఆహార పదార్థాలు, మంచినీటి ప్యాకెట్లు అందజేస్తున్నారు.



డాక్టర్ కాగిత కృష్ణ, వడ్డే ఆధ్వర్యంలో

ఉయ్యూరు : అజిత్‌సింగ్ నగర్, పరిసర ప్రాంతాల వరదబాధితులకు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కాగిత కృష్ణచంద్, కాగిత లక్ష్మీనరేంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఆహారం అందజేశారు. 500 మందికి పైగా భోజన ప్యాకెట్లు, బిస్కట్లు, బ్రెడ్ అందజేశామన్నారు. డాక్టర్ మాధురీక్రాంతి, అనరాగ్, లక్ష్మీఐశ్వర్య తదితరులు సేవలందించారు. తోట్లవల్లూరు మండలం లంకగ్రామాల వరదబాధితులకు వడ్డే బసవరాజ్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ం, త్రాగునీరు,నిత్యావసర సరుకులు, దోమల నుంచి ర క్షణకు మస్కిటో కాయిల్స్ మాజీమంత్రి వడ్డేశోభనాద్రీశ్వరరావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో కలిసి అందజేశారు. వడ్డే మాట్లాడుతూ మూడు రోజులుగా భోజనం, నిత్యావసరాలు, త్రాగునీరు అందజేస్తున్నామన్నారు. టీడీ పీ నాయకుడు గురుమూర్తి తదితరులు పాల్గొని సేవలందించారు. ఎంకె ఇంగ్లీషుమీడియం స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో వరదబాధితులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.

విస్సన్నపేట : మాదిగ పేద విద్యార్థుల సహాయ సంఘం, ఉద్యోగుల సహకారంలో విజయవాడ వరద బాధితులకు పులిహోరా, పాలు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, కొవ్వొత్తులు గురువారం తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణికి అందించారు. అప్పికట్ల కుమార్, ధనరాజ్, కె.రంగా, ఎమ్.ఆదాం, ఎల్.చార్లెస్, సుధాకర్, రవీంద్రలు పాల్గొన్నారు


హనుమాన్‌జంక్షన్ : ఆరుగొలను హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం కూడా ముంపునకు గురైంది. దీంతో అక్కడి బాధితులను బాపులపాడు జడ్పీ హైస్కూల్ పునరావాస కేంద్రానికి తరలించారు.

ఉప్పలూరు (కంకిపాడు) : ఉప్పలూరు గ్రామ పరిధిలోని వరద బాధితులు 500 మందికి టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, ఆయన సోదరుడు అన్నే కేశవరావు వితరణతో గురువారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఉప్పలూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డలోని శ్రీషిర్డి దివ్య సాయి మందిరంలో ఆలయ ధర్మకర్త మండలి సత్యప్రసాద్, కమిటీ సభ్యులు వరద బాధితులకు వెజిటబుల్ బిర్యాని, బంగాళా దుంప కుర్మా చేయించి 800 ప్యాకెట్లు పులిగడ్డ, వసుమట్లపాలెం, రేగుళ్లంక, పల్లెపాలెంలోని వరద బాధితులకు అందజేశారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు : భారీ వర్షాల వల్ల ఇబ్బందులకు గురుఐన పేదలకు ప్రభుత్వం తక్షణమే నిత్యావసర వస్తువులను ఉచితంగా అందజేయాలని మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కోరారు. ముచ్చింతాల, అనిగండ్లపాడు గ్రామాల్లో ఉదయభాను స్థానిక వైసీపీ నేతలతో కలసి గురువారం పరిశీలించారు. ముచ్చింతాల గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఏవో రామసుబ్బారెడ్డితో కలసి గురువారం సంద ర్శించారు. టీడీపీ నాయకులు కొమ్మినేని సత్యనారాయణ, నల్లజాల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ హాస్పిటల్స్ రూ. 25 లక్షల విరాళం



సత్యనారాయణపురం : వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి క్యాపిటల్ హాస్పటల్స్‌మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నే హరికృష్ణ, డాక్టర్ వి ఎస్‌ఆర్.భూపాల్ సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. క్యాపిటల్ హాస్పటల్స్ ఎండీని ఆయన అభినందించారు.



గోసాలైట్స్ మెడికల్ అకాడమీ రూ.35 లక్షల విరాళం

వరద బాధితులకు తమ వంతు సాయంగా సీఎం సహాయనిధికి గోసాలైట్స్ మెడికల్ అకాడమి ఛైర్మన్ నరేంద్రబాబు రూ. 25 లక్షలు, విద్యాసంస్థలలో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రూ.10 లక్షలు మొత్తం రూ. 35 లక్షల చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేశారు.

కృష్ణామిల్క్‌యూనియన్ రూ. 50 లక్షల విరాళం

సీఎం సహాయనిధికి కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో చంద్రబాబు నాయుడును కలిసి రూ. 50 లక్షల చెక్కును అందచేశారు.

కాండ్రేగుల రూ.5 లక్షల విరాళం

సీఎం సహాయనిధికి ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో పశ్చిమనియోజకవర్గం టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర రూ.5 లక్షల విరాళం ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. శ్రీనివాస్‌ను నారా లోకేష్ అభినందించారు. హెచ్ ఆర్‌టీ ప్లాజా వరద బాధితులకు అండగా నిలిచింది. హెచ్‌ఆర్‌టీ ప్లాజాకు చెందిన కె.వి.రమణరావు, డాక్టర్ కృష్ణమూర్తి, బోయపాటి జగన్మోహనరావు, కోగంటి రవికుమార్ ఆహారం నీరు అందజేశారు. వరదల్లో చిక్కుకున్న బాధితులకు తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాజు ఆధ్వర్యంలో ఆహారం మంచినీరు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

కేడీసీసీబీ రూ.25 లక్షల సాయం

మచిలీపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరదబాధితులకు కృష్ణాజిల్లా కేంద్ర సహకారబ్యాంక్ (కేడీసీసీబీ) ఉద్యోగులు, బ్యాంకు ద్వారా రూ.25 లక్షలను విరాళంగా ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. బ్యాంకులో పనిచేసే ఉద్యోగుల ఒక రోజు వేతనం రూ.10,82,737, బ్యాంకు రూ.14,17,263లను కలిపి మొత్తం రూ. 25 లక్షలను కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ గీతాంజలిశర్మ ద్వారా సీఎం కార్యాలయానికి చెక్కు పంపారు.



బుద్దా వెంకన్న రూ.5 లక్షల విరాళం

వన్‌టౌన్ : వరద బాధితుల సహాయనిధికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, తన అల్లుడు కాండ్రేగుల రవీంద్రతో కలిసి గురువారం మంత్రి నారా లోకేష్‌కు రూ.5లక్షల విరాళం అందజేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో విరాళాన్ని అందజేశారు.

ఏపీయూడబ్ల్యూజే రూ.50 వేల విరాళం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయుడబ్ల్యూజే) తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం సహాయ నిధికి అందజేశారు. యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఉపాధ్యక్షుడు జైరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, యూనియన్ నేతలు చావా రవి, నాగరాజు, మల్లి, రాజేంద్ర తదితరులు ముఖ్యమంత్రిని కలిసి చెక్కు అందజేశారు

గొరిజాల రూ.లక్షన్నర ఆర్థిక సాయం

గొల్లపూడి : వరద బాధితుల సహాయార్థం మూలపాడు గ్రామానికి చెందిన గొరిజాల సాంబశివరావు (చిన్ని) రూ.1.5 లక్షలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు గురువారం అందించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలున్న పాఠశాలలకు సెలవు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 5 : జిల్లాలో పునరావాస కేంద్రాలున్న పాఠశాలలకు శుక్రవారం సెలవుదినంగా ప్రకటిస్తున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. మిగిలిన పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయన్నారు. పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని డీఈవో సూచించారు.

పలు రైళ్లు రద్దు

రైల్వే స్టేషన్, సెప్టెంబర్ 5 : రైల్వే ట్రాక్‌ల నిర్వహణ కారణాలుగా ఈనెల 8వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం. మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ - కాకినాడ పోర్టు, నరసాపూర్ - గుంటూరు, గుంటూరు - విజయవాడ, విజయవాడ - నరసాపూర్, రాజమండ్రి - విజయవాడ, విజయవాడ - భీమవరం, విజయవాడ - రాజమండ్రి రైళ్లను రద్దు చేశారు. రద్దు చేసిన అప్ అండ్ డౌన్ రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ - బిట్రగుంట, విజయవాడ - తెనాలి, విజయవాడ - గూడూరు, గుడివాడ - మచిలీపట్నం, భీమవరం - నిడదవోలు, గుంటూరు - రేపల్లె, వి జయవాడ - మచిలీపట్నం, విజయవాడ - ఒంగోలు, నరసాపూర్ - నిడదవోలు రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	117, 126, 137
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.95


WELCOME HOME VINAYAKA
VIJETHA Fresh Healthy Living
WITH VIJETHA
* GOLD DROP SUNFLOWER OIL 5LT JAR
* AASHIRVAAD ATTA 5KG
* VIJETHA PREMIUM SUGAR 1KG
COMBO OFFER
MRP: ₹1110
COMBO PRICE ₹888
SAVE ₹222
OFFERS VALID FROM 6th TO 8th SEPTEMBER 2024 ONLY.
Eco-Friendly Clay Ganesh Idol Available
SWEET CORN ₹9 Vijetha Price PER PC
TOMATO LOCAL ₹32 Vijetha Price PER KG
ONION RED ₹59 Vijetha Price PER KG
BANANA FRUIT / MOSAMBI ₹45 Vijetha Price PER KG
WOOD APPLE ₹54 Vijetha Price PER KG
CUSTARD APPLE GOLDEN / APPLE SHIMLA ₹189 Vijetha Price PER KG
APPLE ROYAL GALA / POMEGRANATE ₹299 Vijetha Price PER KG
AASHIRVAAD ORGANIC WHOLE WHEAT ATTA 5KG ₹229 ONLY on purchase of ₹499 MRP ₹ 380
HERITAGE GHEE COW 1000ML POUCH ₹599 ONLY Vijetha Price MRP ₹ 685
RAAGA SUNFLOWER OIL 1LTR POUCH ₹109 ONLY Vijetha Price MRP ₹ 145
MAGGI NOODLES MASALA 560G ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 112
BAMBINO VERMICELLI 850G ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 87
ORIGINAL KIMIA DATES / ELEPHANT DATES KIMJO 400G BOX BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 310/320
TATA CHAKRA GOLD CARE TEA PWD 250G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 240
PARLE RUSK BREAD TOAST 1KG BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 220
UNIBIC SWAADESI SWEETS / LAL SWEETS (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer
BINGO NO RULZ MASALA CURLZ 80G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 50
SUNFEAST DARK FANTASY CHOCO FILLS 600G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 350
THREE MANGO PICKLE 300G BOTTLE (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 110
HERITAGE DOODH PEDA 200G ₹99 ONLY Vijetha Price MRP ₹ 125
HERITAGE PANEER 200G ₹99 ONLY Vijetha Price MRP ₹ 120
MAGGI NOODLES VEG ATTA 435G ₹20 OFF ON MRP Vijetha Offer MRP ₹ 168
MINUTE MAID PET PULPY ORANGE 1LT ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 90
MCCAIN FRENCH FRIES 420G ₹80 ONLY Vijetha Price MRP ₹ 120
BOOST REGUALR 750G POUCH ₹100 OFF ON MRP Vijetha Offer MRP ₹ 469
PARACHUTE COCONUT OIL 600ML ₹45 OFF ON MRP Vijetha Offer MRP ₹ 273
FOGG 150ML / BRUT 200ML DEO (SELECTED RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 299/399
NIVEA BODY LOTION COCOA NOURISH 400ML /NOURISHING BODY MILK 600ML/ SOFT CREME LIGHT MOISTURIZER 300ML BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 399-625
ODONIL ROOM SPRAY 240ML (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 169
MANGALDEEP AGARBATI SANDAL 160 STICKS BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 120
NIVEDANA POOJA OIL 1LT BOT ₹160 ONLY Vijetha Price MRP ₹ 260
GOOD KNIGHT FLASH REFIL 45ML*4PC SET ₹66 OFF ON MRP Vijetha Offer MRP ₹ 305
WHISPER BINDAZZZ NIGHTS XXXL 10 PADS ₹80 OFF ON MRP Vijetha Offer MRP ₹ 350
MAMYPOKO PANTS DIAPERS (XL 40, L-48, M-58, S-68) ₹250 OFF ON MRP Vijetha Offer MRP ₹ 999
SURF EXCEL MATIC LIQUID 3.2LTR POUCH (FRONT / TOP LOAD) ₹120 OFF ON MRP Vijetha Offer MRP ₹ 715/635
VIM SOAP ANTI SMELL 200G*5PC SET (PUDINA / NEEM) ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 130
OFFERS VALID FROM 6th TO 8th SEPTEMBER 2024 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS
Download the App & get groceries delivered in 60 mins
SINCE 1999 In Customer Service
Vijetha Supermarkets Pvt. Ltd.
Telangana & Andhra Pradesh
vijethasupermarkets
VijethaSuperMarketsPvtLtd
Scan to download app
*T&C Apply.

కష్టార్జితం వరద పాలు: తమ్మిన రమేష్



మా ఇల్లు ఫ్లై ఓవర్ దిగువున ఉన్న రైతు బజార్ వెనుక ఉంది. అకస్మాత్తుగా వచ్చిన వరద దెబ్బకు కట్టుబట్టలతో భార్య, పిల్లలతో బయట పడాల్సి వచ్చింది. ఇంట్లో సామగ్రి ఏదీ పనికి రాదు. పిల్లలు ఇంజనీరింగ్ పుస్తకాలు తడిచి పనికి రాకుండా పోయాయి. లోపల లాప్‌టాప్, బీరువాలోని నగదు, ఎలక్ట్రానిక్ సామగ్రి, డబుల్ కాట్ మంచం, బీరువాలు మొత్తం ధ్వంసమయ్యాయి. ఏవీ పనికిరావు. ఏళ్ల తరబడి కష్టార్జితం మొత్తం వరదపాలైంది. మళ్లీ కోలుకోవాలంటే ఎంత కాలం పడుతుందో భగవంతుడికే తెలియాలి.

లక్షల్లో నష్టం.. ప్రభుత్వం అదుకోవాలి
అద్దంకి అప్పారావు, రాజీవ్‌నగర్



నేను డీలర్‌గా పని చేస్తాను. నాకు, నా భార్య ఇద్దరికీ అంగ వైకల్యం ఉంది. కంటి ముందే ఇల్లు, ఇంట్లో సామగ్రి మునిగిపోయింది. రేషన్ షాపులో టన్నుల కొద్దీ బియ్యం, 5 క్వింటాలకు పైగా పంచదార ఉంది. వరద నీరు వచ్చి మొత్తం తడిచిపోయాయి. నష్టం లక్షల్లో ఉంటుంది. ప్రభుత్వం ఆదుకుంటుందని నమ్మకం ఉంది.

ఒక్కొక్కరిది ఒక్కోకథ..!

కోలుకుంటున్న సింగ్‌నగర్.. బయటికొస్తున్న బాధితులు

మధురానగర్, సెప్టెంబర్ 5: బుడమేరు వరద ముంపు నుంచి సింగ్‌నగర్ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. పదడుగులకు పైగా వచ్చిన వరద నీరు రోడ్డు మట్టానికి రావడంతో జన సంచారం మొదలైంది. 4 రోజులుగా ఇళ్లల్లో ఇరుక్కుపోయిన వారు బయటకొచ్చి కట్టుబట్టలతో, చేతికందిన కొద్దిపాటి సామగ్రితో బంధువుల ఇళ్లకు తరలి వెళుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పడవల్లో బయటకొచ్చినవారు తమ ఇళ్లు, బళ్లు ఎలా ఉన్నాయో చూసుకోవడానికి లోపలకు వెళుతున్నారు. డాబా కొట్లు సెంటర్, ఇందిరానాయక్ నగర్, అయ్యప్ప గుడి, వాంబేకాలనీ పరిసరాల్లో చిన్న చిన్న షాపుల వారు,



మొబైల్ రైతుబజార్ వద్ద కూరగాయలు కోసం ఎగబడుతున్న ప్రజలు,

దుకాణాల వారు, షట్టర్లు తెరిచి లోపల జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో పడ్డారు. వరద ప్రవాహం తగ్గడంతో ఇళ్లలో ఉన్న జనాన్ని బయటకు తీసుకురావడానికి వస్తున్న ట్రాక్టర్ల హడావుడి ఎక్కువగా ఉంది. కొన్నిచోట్ల జనం ఎక్కీ ఎక్కకుండానే వచ్చేస్తున్నారు. చాలా మంది నీళ్లలోనే నడుచుకుంటూ వచ్చేస్తున్నారు.

మొదటి, రెండో అంతస్తులోని వారికి ప్రభుత్వం ఆహారం, మంచినీరు పంపిస్తూనే ఉంది. గురువారం ఆహారాన్ని తీసుకొస్తున్న వాహనాల డ్రైవర్లు పోలీసులు చెప్పిన వైపు రావడానికి నిరాకరించే పరిస్థితి నెలకొంది. డాబా కొట్ల సెంటర్‌లో ఒక లారీ డ్రైవర్‌తో పోలీసులతో వాగ్వాదానికి దిగి బలవంతంగా లారీని స్టేడియం వైపు నుంచి వాంబే కాలనీకి పంపారు. మరో పక్క అంబులెన్స్‌లు లోపలికి వెళ్లి నీళ్లలోనే ఆరోగ్యసేవలందిస్తున్నారు. ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ ఆగకుండా పోలీసులు మధ్యలో నిలబడి నియంత్రిస్తున్నారు. చంద్రబాబు ప్రకటించినట్టు ప్రజలకు అతి తక్కువ ధరలకు అందించడానికి మార్కెటింగ్ శాఖ వారు మొబైల్ రైతు బజార్ ఆటోలో కూరగాయలు తీసుకొచ్చారు. కిలో రూ.2, 5, 10కే విక్రయించడంతో జనం ఎగబడ్డారు.



రోడ్డు పక్కన నీటిలో అంబులెన్స్‌ను ఆపి వైద్యసేవలు అందజేస్తున్న సిబ్బంది

బతుకు జీవుడా అని ప్రాణాలలో బయటపడ్డాం: తులిమెల్లి శేషుకుమారి



మధ్య కట్టలో నివాసం ఉంటాం. మాది చిన్న రేకుల షేడ్. బుడమేరు కాల్వకు గండి పడి అకస్మాత్తుగా ఏలూరు కాల్వలోకి నీరు రావడంతో నిమిషాల వ్యవధిలోనే కాల్వ నీటి మట్టం పెరిగి ఇల్లు మునిగిపోయింది. ఇద్దరు పిల్లలను తీసుకుని బయటకు రాగానే గోడ పడిపోయింది. ఇంట్లో సామాను ఏదీ పనికి రాదు. ఇల్లు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇంటి మరమ్మతులకైనా ప్రభుత్వం వారు సాయం చేయాలి.

నీటి మునిగిన ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ

రూ. కోటి పైగా ఆస్తి నష్టం

గొల్లపూడి, సెప్టెంబరు 5: స్థానిక అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా ఉన్న ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ మొత్తం వరద నీటిలో నానుతోంది. ఐస్ క్రీమ్ తయారీకి వాడే వస్తువులు, ఇతర సామగ్రి మొత్తం నాని ఎందుకూ పనికి రాకుండా పోయిందని, సుమారు రూ.కోటి ఆస్తి నష్టం వాటిల్లిందని నిర్వాహకుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



నీటిలో నానుతున్న ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ

గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం

వన్‌టౌన్, సెప్టెంబర్ 5: బుడమేరు మధ్యకట్టపై విజయదుర్గానగర్ ప్రాంతంలోని రైలు బ్రిడ్జి కింద ఉన్న రోడ్డుకు గండి పడిన ప్రాంతాన్ని గురువారం సీఎం చంద్రబాబు పరిశీలించారు. బుడమేరుకు వరద ఉధృతి రావటంతో 4 రోజుల క్రితం విజయదుర్గానగర్ రోడ్డుకు కూడా గండిపడి బుడమేరు వరద ఏలూరు కాలువలోకి మళ్లింది. రైలు బ్రిడ్జి కింద ఉన్న రోడ్డు బలహీనంగా ఉండటంతో వరద ప్రభావానికి భారీగా గండిపడింది. ఈ ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఆయన తన పర్యటనలో భాగంగా మధురానగర్ వైపు నుంచి రైలు కట్టమీదుగా గండిపడిన ప్రాంతానికి కాలినడకన చేరుకుని నిశితంగా పరిశీలించారు. అక్కడి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గండిని సత్వరమే పూడ్చి రాకపోకలకు అనుకూలంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మధురానగర్‌లో బాధితులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

జగన్ రాయించేవన్నీ అవాస్తవాలే..!

● బీడీసీ గండ్ల మరమ్మతులను పరిశీలించిన మంత్రులు అనిత, నిమ్మల

జి.కొండూరు, సెప్టెంబరు 5: బుడమేరంటే ఏంటో తెలియని జగన్ వరదల విషయంలో చెప్పేవి, సొంత పత్రికల్లో రాయించేవన్నీ అవాస్తవాలేనని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం ఆమె బీడీసీకి పడిన గండ్లకు చేస్తున్న మరమ్మతు పనుల్ని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అసలు జగన్ని మరమ్మతు పనుల వద్దకు తీసుకువస్తే గండ్లు ఏస్థాయిలో పడ్డాయో, వరద నివారణకు యుద్ధ ప్రాతిపదికన ఎలా పనులు జరుగుతున్నాయో తెలుస్తుందన్నారు. వరద బాధితులకు ఏ కష్టం రాకుండా సీఎం చంద్రబాబు దగ్గరుండి చూసుకుంటుంటే జగన్ ఓర్వలేక మాట్లాడుతున్నాడన్నారు. బుడమేరు మళ్లీ పొంగిందంటూ విజయవాడ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఇలా అవాస్తవాలు మాట్లాడి లండన్ ఎగిరిపోదమనుకుంటే కుదరదన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గండ్లను పూడ్చి విజయవాడను ముంచేస్తున్న వరదను అరికట్టడంతో పాటు నగరంలోని వరద నీటిని బయటకు పంపేందుకు చంద్రబాబు ఎప్పటికప్పుడు క్లోజ్‌గా మోనటరింగ్ చేస్తున్నారన్నారు. లోకేష్ కూడా పర్యటించి యుద్ధ ప్రాతిపదికన గండ్లు పూడ్చాలని ఆదేశించారన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నా, లారీల రాకతో కట్ట కుంగుతున్నా మొదటి గండిని పూడ్చి వేశామన్నారు. రెండో గండిని రాత్రిలోపు పూర్తిచేసి మూడో గండిని రేపటికల్లా పూర్తి చేస్తామన్నారు. జగన్ ఐదేళ్ల పాపం వల్లే ఈరోజు ఈ విపత్తు అని అన్నారు. ప్రజాస్వామ్యంలో జగన్ లాంటి వ్యక్తి ఉండటానికి అర్హుడు కాదన్నారు.



బీడీసీ లెఫ్ట్ బ్యాంక్ గండ్ల మరమ్మతు పనుల్ని మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

అవరోధాలను అధిగమిస్తూ చక చక గండ్ల పూడిక

బుడమేరుకు వచ్చే వరద తగ్గినట్టే తగ్గి బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మరోమారు పులివాగుతో పాటు ఎగువ నుంచి వరద రావడంతో బుడమేరుకు వరద కాస్త పెరిగింది. గురువారం సాయంత్రానికి 9 వేల క్యూసెక్కుల వరద రెగ్యులేటర్ వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో బీడీసీ లెఫ్ట్ బ్యాంక్‌కు పడిన మూడు భారీ గండ్ల పూడిక పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొదటి గండి పూడిక పనుల్ని బుధవారం రాత్రికి పూర్తి చేశారు. రెండో గండి పూడ్చేందుకు ఒక పక్క వర్షం, మరో పక్క వరద ఆటంకంగా మారాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సాధ్యమైనంత త్వరగా గండ్లను పూడ్చించాలని మంత్రి నిమ్మలకు ఆదేశాలివ్వడంతో మంత్రి నిమ్మల రామానాయుడు రాత్రి పగలు గండ్ల వద్దే ఉంటూ రెండో గండిని కూడా దాదాపు పూడ్చించారు. ఇక అసలైన పెద్ద గండి మూడోది ఉంది. దాని పూడ్చే పనులు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

వారంలో సాధారణ స్థితి

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, సెప్టెంబర్ 5: బుడమేరు వరద ముంపునకు గురైన ప్రాంతాలను వారం రోజుల్లో సాధారణ స్థితికి తీసుకొస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం ముంపునకు గురైన జక్కంపూడి కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రులు బాధితులను పరామర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ జక్కంపూడి కాలనీలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో బాధితులు ఇబ్బందులు పడకుండా సోలార్ లైట్లు పంపిణీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వరద నీరు తగ్గిన మరుక్షణం పారిశుద్ధ్య పనులు ప్రారంభించటంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రి లోకేష్ సహా మరో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.



మంత్రి లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న బుద్ధరాజు శివాజీ

సీఎం సహాయ నిధికి రూ. 5 లక్షల విరాళం

వరద ముంపు బాధితులకు సీఎం చంద్రబాబు పిలుపు మేరకు గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి జాయింట్ కన్వీనర్ బుద్ధరాజు శివాజీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 లక్షల చెక్కును మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఎంపీ శివనాథ్, బుద్ధరాజు శివాజీని అభినందించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, వ్యవసాయ, పశుసంవర్ధక మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు.

చిన్న కాలనీ... పెద్ద సాయం

● ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల విరాళం రూ. 25 లక్షలు

భారతీనగర్, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయర్థం ముఖ్యమంత్రి సహాయనిధికి విజయవాడ 4వ డివిజన్‌లోని ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు గురువారం ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రూ. 25లక్షలు విరాళంగా అందజేశారు. వైశాల్యం పరంగా రెండు కాలనీలు కలిపినా ఒక పెద్ద కాలనీ అంత ఉండదు. అయినా కాలనీ ముఖ్యులంతా పూనుకొని 25 లక్షల విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మలినేని రంగప్రసాద్, సెక్రటరీ దాసరి హరికృష్ణ, ట్రెజరర్ చిగురుపాటి యుగంధర్, జి.రాజశేఖర్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీ అసోసియేషన్ సభ్యులు

బాలుడు, ఆరేళ్ల చిన్నారి మృతి

● కేఎల్‌రావు నగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

చిట్టినగర్, సెప్టెంబరు 5: వరద ముంపుతో కె.ఎల్.రావునగర్‌లో ఓ బాలుడు, ఆరేళ్ల చిన్నారి మృతిచెందిన విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కె.ఎల్.రావునగర్ ఏడో లైన్‌కు చెందిన పీ కిషోర్ పాలఫ్యాక్టరీ డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఇతడికి కుమార్తె, కుమారుడు. 1వ తేదీన వరద ముంపును చూసేందుకు మధ్నాహ్నం కిషోర్ కుమారుడు వరుణ్‌సందేశ్ (14) బయటకు వచ్చాడు. డ్రెయిన్ పక్కనే నిలబడి చూస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి డ్రెయిన్‌లో పడ్డాడు. వెంటనే పక్కనున్నవాళ్లు డ్రెయిన్‌లో వెతికినా ఆచూకీ దొరకలేదు. అదేరోజు సాయంత్రం వరద ఉధృతి పెరగడంతో బాలుడు విగతజీవిగా కోస్టల్ స్కూల్ వద్ద నీటిపై తేలియాడటం స్థానికులు గమనించి బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అయితే ఈ విషయం బయటకు రాలేదు. అయితే బాలుడి మృతదేహాన్ని ఓ తోపుడు బండిపై తీసుకెళుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అప్పటి వరకు బాలుడు మృతి గోప్యంగానే ఉంది. అలాగే కె.ఎల్.రావునగర్ 7వ లైన్ అప్‌యార్డు సమీపంలో ఓ ఆరేళ్ల చిన్నారి ఆడుకుంటూ డ్రెయిన్‌లో పడింది. ఈ విషయం గమనించని తల్లిదండ్రులు కొద్దిసేపటి వెతుక్కుంటూ నీటిలో వెతకగా చిన్నారి మృతదేహం కనిపించింది. దీంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

మంత్రుల కనుసన్నల్లో పారిశుద్ధ్య పనులు

వన్‌టౌన్, సెప్టెంబర్ 5: పశ్చిమలోని వరద ముంపు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం మంత్రులు పొంగూరు నారాయణ, సవిత పరిశీలించారు. 54వ డివిజన్‌లో చెత్త తొలగింపును ఫైర్ ఇంజన్లతో నేలను శుభ్రం చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించి సూచనలు చేశారు. బాధితుల ఇళ్లకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. వించిపేటలో ఫైర్ ఇంజన్ ద్వారా ఓ పాఠశాలను మంత్రి నారాయణ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడ ప్రజలు వరదతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మొదటిరోజు ప్రజలను రక్షించేందుకు వెళ్లిన బోట్లు, ట్రాక్టర్లు బోల్తా పడ్డాయన్నారు. సీఎం చంద్రబాబు వరద బాధితులందరికీ సరిపడా ఆహారం, తాగునీరు, పాలు, బిస్కెట్లు, పండ్లు అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పటివరకు 85శాతం వరద తగ్గిందని, శుక్రవారం నుంచి నిత్యావసరాల పంపిణీకి సీఎం ఆదేశించారన్నారు. దాదాపు 10వేల మంది పారిశుద్ధ్య కార్మికులు చెత్త తొలగింపు, బ్లీచింగ్ చల్లే పనిలో ఉన్నారన్నారు. అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి చెత్తను వేగంగా తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. బుధవారం ఒక్కరోజే బాధితులకు 26 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 8 లక్షల పాల ప్యాకెట్లు సరఫరా చేసినట్టు తెలిపారు.

ఇంకా ముంపులోనే విజయ డెయిరీ

● నీటమునిగిన చిట్టినగర్ పాల ఫ్యాక్టరీ ● పాడైన పాలు, పాల పదార్థాలు, మిషనరీ ● ఐదు రోజులు గడుస్తున్నా తగ్గని నీరు

చిట్టినగర్, సెప్టెంబరు 5: విజయ డెయిరీ (పాలఫ్యాక్టరీ)ని బుడమేరు ముంపు వీడలేదు. ఐదు రోజులు గడుస్తున్నా ఫ్యాక్టరీలోని వరద నీరు కదలకుండా నిలిచిపోయింది. వరదనీరు భారీగా చేరటంతో ఫ్యాక్టరీ పూర్తిగా నీట మునిగింది. రూ.70 కోట్ల విలువైన పాలు, పదార్థాలు పాడయ్యాయి. కనీసం వాహనాల్లో పాలు బయటకు తెచ్చే వీల్లేకుండా పోయింది. దీనికితోడు కూలింగ్ యంత్రాలు, జనరేటర్లు, పాలు ప్యాకింగ్ యంత్రాల్లో నీరు చేరి పూర్తిగా పాడయ్యాయి. నష్టం భారీగా జరిగిందని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి వరద నీరు కొంతమేరకు తగ్గినా గురువారం మధ్నాహ్నం నుంచి మళ్లీ నీటి ప్రవాహం ఒక్కసారిగా అడుగుమేర పెరిగింది. దీంతో ఫ్యాక్టరీలో అడుగుపెట్టలేని పరిస్థితి. బుధవారం రాత్రి నీట మునిగిన చిట్టినగర్ పాలఫ్యాక్టరీని పలువురు ఇంజనీర్లతో కలిసి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పరిశీలించారు. కూలింగ్, ప్యాకింగ్, జనరేటర్లు అన్నింటా మూడు వంతులు నీటమునిగాయి. ఇంజనీర్లు ఆ మిషనరీ పరిశీలించారు. నీరు పూర్తిగా పోతే తప్ప పరిస్థితి పూర్తిగా అంచనా వేయలేమని వారు చెబుతున్నారు. మిషనరీ నష్టం కోట్లలో ఉండవచ్చని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు.



నీట మునిగిన ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఛైర్మన్ చలసాని

7 నెలల క్రితం వీరవల్లిలో ఏర్పాటు చేసిన నూతన విజయ డెయిరీ (కామధేను) ఈ విపత్కర పరిస్థితులో రైతులతోపాటు, వినియోగదారులను ఎంతగానో ఆదుకుంది. ఈ ఆధునాతన యూనిట్ రోజుకు 6 లక్షల లీటర్ల పాలు శుద్ధి చేసే సామర్థ్యంతో పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసేలా నిర్మించారు. చిట్టినగర్ ఫ్యాక్టరీలో కార్యకలాపాలు స్థంభించడంతో కొత్త యూనిట్ నుంచి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు వీరవల్లి యూనిట్‌లో ఉండి పరిస్థితిని సమీక్షిస్తూ రైతుల నుంచి పాలసేకరణ, వినియోగదారులు పాలు చేరవేసే కార్యకలాపాలను సమీక్షిస్తున్నారు.

మూడు రోజుల తరువాత బయటికి..!

ఆంధ్రజ్యోతి చొరవతో బాధిత కుటుంబాన్ని బయటికి తీసుకొచ్చిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

లబ్బీపేట, సెప్టెంబరు 5: చూట్టూ ఎటుచూసిన నీరే. ఆహారం సంగతి దేవుడెరుగు. కనీసం మంచినీరిచ్చే నాథుడు లేడు. కళ్లెదుట విషసర్పాలు, మృతదేహాలు వెళ్తుంటే బిక్కుబిక్కుమంటూ బతికిన కుటుంబం 3 రోజుల తరువాత ఆంధ్రజ్యోతి చొరవతో బయటపడింది. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన శ్రీనివాసరావు కుటుంబం జీవనోపాధికి నగరానికి వచ్చి సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ పక్కనే ఇందిరా నాయక్ నగర్‌లోని పోస్టుమెన్ రామచంద్రరావు వీధి చివర బుడమేరులోని ఒక భవనంలో నివసిస్తున్నారు. వరద ప్రభావంతో పూర్తిగా మునిగిన ఇంటి నుంచి కట్టుబట్టలతో భవనంపైకి చేరిన వీరు ట్యాంక్‌లోని నీటిని తాగుతూ 3రోజులు గడిపారు. వీరింటి పక్కనుంచే బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా ధైర్యం చేయలేని పరిస్థితి. దీంతో ఆ కుటుంబం సోమవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధి దృష్టికి ఫోన్‌లో చెప్పడంతో సోమవారం వారిని తీసుకురావడానికి ఎన్డీఆర్ఎఫ్ బోటుతో ప్రయత్నించినా సాధ్యంకాలేదు. తిరిగి మంగళవారం సముద్ర పడవలో అతికష్టంపై వెళ్లి మరో పది మంది వరకు చిన్నారులు, వృద్ధులను బయటకు తీసుకువచ్చారు. 3 రోజులుగా వాటర్‌ట్యాంక్‌లో నీరు తాగి బతికామని, ఆంధ్రజ్యోతి చొరవతో బతికి బయటపడ్డామని వారు ఆనందం వ్యక్తం చేశారు.



బాధిత కుటుంబాన్ని వెలుపలికి తీసుకొస్తున్న సిబ్బంది

పాపం పండుతోంది

సూత్రధారి సజ్జల... నందిగం పాత్రధారి మాత్రమే

- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి: డొక్కా

గుంటూరు, సెప్టెంబరు 5: 'టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌లాంటి వారు కేవలం పాత్రధారులు మాత్రమే. అసలు సూత్రధారి రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి' అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ వ్యాఖ్యానించారు. గుంటూరులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పార్టీ పదవులు, ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఆశ చూపించి సజ్జల అలాంటి దాడులు చేయించారు. విజయవాడలో వరదలకు ప్రకృతి ఒక వైపు, వైసీపీ నేతలు మరో వైపు కారణం.

నిన్న దాడులు, దందాలు.. నేడు అర దండాలు

- నాడు చెలరేగిన వైసీపీ నేతలకు సంకెళ్లు
- అమరావతిలో నందిగం సురేశ్ అరాచక పర్వం
- నదిలో ఇసుక దందా..రాజధాని రైతులకు వేధింపులు
- గ్యాంగులతో దాడులు..ఐదేళ్లూ భీతావహ పరిస్థితులు
- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో ఎట్టకేలకు సురేశ్ అరెస్టు
- అప్పిరెడ్డి, తలశిల, అవినాశ్ కోసమూ వేట!

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

అధికారం ఉందని నాడు విర్రవీగిన వైసీపీ నేతల పాపం పండుతోంది. జగన్ నియంత పాలనలో విధ్వంసాలకు పాల్పడిన వారికి సంకెళ్లు పడుతున్నాయి. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు పారిపోయే అవకాశం ఇవ్వకుండా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తలశిల రఘురాం, దేవినేని అవినాశ్ కోసం వేట కొనసాగుతోంది. ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.

ఐదేళ్లూ అరాచకమే...

అవినీతి, అరాచకం, విధ్వంసకర పాలనతో నియంతను తలపించింది గడిచిన ఐదేళ్ల జగన్ పాలన. ప్రజల తరపున బాధ్యతగల ప్రతిపక్షంగా టీడీపీ.. నాడు ప్రభుత్వ తప్పులపై ప్రశ్నించడంతో వైసీపీ తన నైజాన్ని చూపించింది. మమ్మల్నే ప్రశ్నిస్తారా..? అంటూ టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి దిగింది. గుంటూరు నుంచి లేళ్ల అప్పిరెడ్డి, అమరావతి నుంచి నందిగం సురేశ్, విజయవాడ నుంచి దేవినేని అవినాశ్ అల్లరి మూకల్ని వెంటబెట్టుకెళ్లి ఇనుప రాడ్లు, కర్రలు, ఇతర మారణాయుధాలతో బీభత్సం సృష్టించారు. దొరికిన వారిని దొరికినట్లు చితక బాదుతూ పార్టీ నేతల కోసం వెతుకులాడారు. ఇంతటి దారుణంపై అప్పట్లో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసేందుకు చుక్కలు చూపించారు. ఆ తర్వాత కేసు గురించి నాటి డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను ప్రశ్నిస్తే ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందంటూ సెలవిచ్చారు. ఇదే అవకాశంగా నాడు ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపైకి అప్పటి వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్, ఒకరోజు ముందుగా ప్రకటించి మరీ 60 కార్లతో దాడికి వెళ్లారు. నానా బీభత్సం సృష్టిస్తున్న జోగి అనుచరులను నిలువరించడం పోలీసులకు సాధ్యపడలేదు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని అడ్డునిలబడ్డారు. టీడీపీ నాయకులు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేసిన పోలీసులు, తెలుగు తమ్ముళ్లపై మాత్రం హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆ తర్వాత జోగి రమేశ్‌కు జగన్ ఏకంగా మంత్రి పదవి ఇచ్చి తాను దేన్ని ప్రోత్సహిస్తున్నదీ.. కేడర్‌కు, నేతలకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఇదే అవకాశంగా వైసీపీ గూండాలు విరుచుకుపడ్డారు.

రాజధానిలో రౌడీ రాజ్

ఒక సాధారణవ్యక్తిగా మొదలై వందల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టడం వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మాత్రమే సాధ్యం. ప్రకృతి వనరులు యథేచ్ఛగా దోపిడీ చేయడం.. పైరవీలతో పలువురికి టోపీ పెట్టడం.. వంటి వ్యవహారాలతో అందలం ఎక్కేశారు. తాడేపల్లి ప్యాలెస్‌కు ఒక ఆయుధంగా ఉపయోగపడ్డారు. దళిత కార్డు అడ్డు పెట్టుకుని రాజధాని రైతులపై దాడులతో వెలుగులోకి వచ్చిన ఆయన జగన్ మనసు గెలిచి ఎంపీ టికెట్ సాధించారు. 'నదిలో ఇసుక ఇష్టారాజ్యంగా తోలుకో.. మేం చెప్పిన వారిపై దాడులు చేస్తూ ఉండు' అంటూ తాడేపల్లి ప్యాలెస్ ఇచ్చిన ఆదేశాల మేరకు పని చేశాడు. అక్కడి పెద్దల ఆదేశాలతోనే టీడీపీ కార్యాలయంపై దాడి చేశారని చెబుతున్నారు. ఇక.. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు వస్తున్న వార్తలను పోలీసులు ధ్రువీకరించలేదు.

'సకల శాఖల మంత్రి'కి ఉచ్చు బిగుస్తోందా?

వైసీపీ ప్రభుత్వంలో 'సకల శాఖల మంత్రి'గా పేరుగాంచిన పులివెందుల రెడ్డిగారికి ఉచ్చు బిగుస్తోందా? దళిత, బీసీ, మహిళా మంత్రులపై పెత్తనాన్ని చెలాయించిన సలహాదారు పాపం పండబోతోందా? అంటే.. అవుననే అంటున్నాయి పరిస్థితులు. టీడీపీ కార్యాలయంపై దాడికి దళిత ఎంపీ.. చంద్రబాబు ఇంటిపై దాడికి బీసీ ఎమ్మెల్యేని రెచ్చగొట్టి పంపిన సూత్రధారి ఆయనేనని తెలుస్తోంది. నందిగం సురేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించే క్రమంలో, ఎందుకు దాడి చేశావని అడగ్గా... "నాకేంటి అవసరం? తాడేపల్లిలో పెద్దాయన(సకల శాఖల రెడ్డి) చెబితేనే చేశా.. రమ్మని పిలిపించారు. 'జగన్‌ను విమర్శిస్తుంటే ఎలా ఊరికే ఉంటారు మీరు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.. అప్పటికే గుంటూరు, విజయవాడ నుంచి 'మేం బయలుదేరాం.. మీరు సిద్ధంగా ఉన్నారా..?' అంటూ ఫోన్లు వస్తున్నాయి.. అందరం కలవగానే కుర్రాళ్లు చొరబడ్డారు' అంటూ టీడీపీ ఆఫీసుపై వైసీపీ మూకలు చేసిన దాడి గురించి సురేశ్ వివరించినట్లు తెలిసింది. 'చేయించిన ఆయనేమో హాయిగా ఉన్నారు.. ఆనందం పొందిన మా నాయకుడు లండన్‌కు వెళ్లిపోతున్నారు.. ఇంకో ఐదేళ్లపాటు మేం ఇక్కడ జైలు, ఇబ్బందులు ఎదుర్కోవాలి.. ఏంటో ఖర్మ' అంటూ ఆయన నిర్వేదం వ్యక్తపరిచినట్లు తెలిపింది.

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో నలుగురి అరెస్ట్

తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై జరిగిన దాడి కేసు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ఆధ్వర్యంలో నాడు విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఇంటిపై దాడి జరిగింది. ఈ కేసులో నిందితులకు హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడంతో ప్రధాన నిందితుడు, మాజీ మంత్రి జోగి రమేశ్ అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయనతో పాటు ఈ దాడిలో పాల్గొన్న నిందితులు కూడా పరారీలో ఉన్నారు. వీరిలో గురువారం పోలీసులు...రాము, చిన్ని, గోవిందరాజులు, ఆనందరావు అనే నలుగురిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. వారంతా కృష్ణా జిల్లాకు చెందిన వారే. మిగిలిన వారి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు.

నందిగం సురేశ్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. ఆయన పారిపోయేందుకు యత్నిస్తున్నారనే పక్కా సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సురేశ్‌ను పట్టుకునేందుకు గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో 12 బృందాలు రంగంలోకి దిగాయి. సురేశ్ వాహనాన్ని వెంబడించి హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు శివారులో బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య సురేశ్‌ను గురువారం ఉదయం మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. స్టేషన్‌లో పోలీసులు సురేశ్‌ను కొద్దిసేపు విచారించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన రోజు తాను కూడా వెళ్లానని, అయితే అది సరైన విధానంకాదని భావించి వెనక్కి వచ్చేశానని సురేశ్ తెలిపినట్టుగా పోలీసులు వెల్లడించారు. అంతకు మించి ఏ ప్రశ్నకూ సరైన సమాధానం ఇవ్వలేదని, విచారణకు సహకరించలేదని, సంబంధిత పత్రాలపై సంతకాలు చేసేందుకు కూడా నిరాకరించారని పోలీసులు తెలిపారు. కాగా, నందిగం సురేశ్ అరెస్టు విషయం తెలుసుకున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని హడావుడి చేశారు. దీంతో అక్కడి మంగళగిరి తాలూకా ప్రాంగణ ప్రధానద్వారాన్ని పోలీసులు మూసివేశారు. మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పలువురు నేతలు సురేశ్‌ను పరామర్శించేందుకు వచ్చారు. గురువారం సాయంత్రం సురేశ్‌ను మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 2వారాల పాటు రిమాండు విధించారు. అనంతరం ఆయనను గుంటూరు జిల్లా కేసుకు తరలించారు. ఈ కేసులో విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డిను ఇప్పటికే అరెస్టు చేశారు.

ఆ 14 మంది వీరే....

1)లేళ్ల అప్పిరెడ్డి 2)నందిగం సురేశ్ 3) తలశిల రఘురాం 4) దేవినేని అవినాశ్ 5)కార్పొరేటర్ గేదెల రమేశ్ 6)ఒగ్గు గవాస్కర్ 7)చింతాబత్తిని వినోద్ 8)రబ్బాని 9)చింతాబత్తిని వినోద్ 10) ఎన్ జగదీశ్ 11) అవుతు శ్రీనివాసరెడ్డి 12) బండారు ఆంజనేయులు 13) శనగశెట్టి హరిబాబు 14) షేక్ అమితాబ్.

మరో 68 మంది బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో 68 మంది గుంటూరు జిల్లా కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ ఇప్పటికే పూర్తయింది. శుక్రవారం జిల్లా కోర్టులో వారి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కోర్టు తీర్పు వెల్లడించనుంది.

ప్రభుత్వ కౌంటర్‌కు జవాబివ్వడానికి టైమివ్వండి

- 'సీఎం హోదా భద్రత'పై హైకోర్టుకు జగన్ అభ్యర్థన
- ఆయన వ్యాజ్యాన్ని కొట్టివేయండి
- రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్.. విచారణ 13వ తేదీకి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తన భద్రతకు సంబంధించి ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ బుధవారం తమకు అందిందని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తరఫు న్యాయవాది సి.సుమన్ హైకోర్టుకు నివేదించారు. దానిని పరిశీలించి రిప్లయ్ వేసేందుకు సమయం ఇవ్వాలని, విచారణను వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయస్థానం. విచారణను ఈనెల 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో తనకు ఉన్న భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ జగన్ పిటిషన్ వేయడం, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్ డబ్ల్యూ), ఎస్పీ, స్టేట్ లెవల్ సెక్యూరిటీ రివ్యూ కమిటీ సభ్యుడు ఐపీఎస్ అధికారి షెల్కే నచికేత్ విశ్వనాథ్ బుధవారం హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. "మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నాం. ఈ కేటగిరీ కింద మొత్తం 58 మంది భద్రతా సిబ్బంది రక్షణగా ఉంటారు. తాజా భద్రత ముప్పు విశ్లేషణ నివేదిక ఆధారంగా ఆయనకు జడ్ ప్లస్ కొనసాగించాలని సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సు చేసింది. పిటిషనర్ 2014-19 మధ్య ప్రతిపక్షనేతగా ఉండగా జడ్ కేటగిరీ భద్రత ఉండేది. 2019లో ముఖ్యమంత్రి అయ్యాక జడ్ ప్లస్ ఇచ్చారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయించారు. ఆన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన, ఆయన కుటుంబ సభ్యులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక సెక్యూరిటీ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తూ 2023లో చట్టం తీసుకొచ్చారు. దీని ఆధారంగా ఆయనకు అదనపు సిబ్బందితో భద్రత కల్పించారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందింది. ఈ నేపథ్యంలో అదనపు భద్రతకు జగన్, ఆయన కుటుంబ సభ్యులు అనర్హులు. చట్ట నిబంధనలు అనుసరించి ముఖ్యమంత్రి హోదాలో తనకు అదనపు భద్రత కల్పించారని పిటిషనర్‌కు తెలిసినప్పటికీ, ఆ విషయాన్ని దాచిపెట్టి ప్రస్తుత పిటిషన్ వేశారు. ప్రస్తుతం జగన్ ఓ ఎమ్మెల్యే మాత్రమే. ఎమ్మెల్యే హోదాలో ఆయనకు 1+1సెక్యూరిటీకి మాత్రమే అర్హులు. ఆయనకు ముప్పు ఉందని భావించినప్పటికీ 2+2 సెక్యూరిటీ మాత్రమే పొందగలరు. అయినప్పటికీ ప్రభుత్వం జగన్‌కు బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా సేవలు అందించిన కిరణ్‌కుమార్ రెడ్డికి మాజీ సీఎం హోదాలో వై కేటగిరీ సెక్యూరిటీ మాత్రమే కల్పిస్తున్నాం. ఆయనకు ఓ అదనపు పీఎస్ఓతో పాటు 13 మంది సిబ్బందితో ఎస్కార్ట్ మాత్రమే ఉంటుంది. భద్రతకు ముప్పు ఉందని ఆధారాలు జత చేస్తూ పిటిషనర్ ఉన్నతాధికారులకు ఎలాంటి వినతీ సమర్పించలేదు. కోర్టు ముందు ఎలాంటి వివరాలూ ఉంచలేదు. ఈ ఏడాది జూన్ 7 తర్వాత ఆయన భద్రతకు ముప్పుందని చెప్పేలా ఎలాంటి ఘటనలూ జరుగలేదు. ఈ వివరాలు ఏమీ లేకుండా పిటిషన్ దాఖలు చేయడం వెనుక ఇతర కారణాలు ఉన్నట్లు కనిపిస్తోంది. భద్రతపై ఆందోళన ఉంటే ఇతర ప్రత్యామ్నాయాలను అనుసరించాలి తప్ప నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని పిటిషన్‌ను కొట్టివేయండి' అని అందులో కోరారు.

భద్రాద్రి జిల్లాలో మళ్లీ పేలిన తూటా

- ఆరుగురు మావోయిస్టుల మృతి

కరకగూడెం/మణుగూరు/కొత్తగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మరోమారు ఎరుపెక్కింది. కరకగూడెం మండల పరిధిలో రఘునాథపాలెం పంచాయతీ మోతె గ్రామ సమీపంలో బోనాల కుంట అడవిలో తుపాకీ తూటా పేలింది. గురువారం తెల్లవారుజామున కూంబింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ పోలీసు బలగాలకు, మావోయిస్టులకు హోరాహోరీగా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామ రాజు జిల్లాల డివిజన్ కమిటీ చెందిన ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు– వంశీ, సందీప్ సైతం ఎదురుకాల్పుల్లో గాయపడ్డారు. వీరిద్దరినీ భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ కాల్పుల నుంచి మాసయ్య అనే మావోయిస్టు దళ సభ్యుడు తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతన్ని పట్టుకునేందుకు గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. మృతుల్లో మావోయిస్టు పార్టీ మణుగూరు డివిజన్ ఏరియా కార్యదర్శి, చత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా రాయగూడెంకు చెందిన లచ్చన్న అలియాస్ కుంజా వీరయ్య, చత్తీస్‌గఢ్‌లోని కంబాడుకు చెందిన ఆయన భార్య పూనెం తులసి, ఏపీలోని జగ్గారం గ్రామానికి చెందిన మణుగూరు ఏరియా దళ కమాండర్ రాము, చత్తీస్‌గఢ్‌కు చెందిన గంగాల్, దుర్గేశ్, కోసీ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆరుగురిపై భారీగా రివార్డు ఉన్నట్లు చెప్పారు. ఘటనాస్థలి నుంచి రెండు ఏకే 47, ఒక ఎస్ఎల్ఆర్, ఒక 303 రైఫిల్, ఒక పిస్టల్, వీటి మేగజీన్లు, లైవ్ రౌండ్లు, కిట్‌బ్యాగులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం పేర్కొంది. కాగా.. రఘునాథ పాలెం ఎన్‌కౌంటర్ విప్లవ ద్రోహులు అందించిన సమాచారంతో జరిగిందని మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ ఆరోపించింది. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించింది.

మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి


మంచు విష్ణు

తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాఖ్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం

డి.సురేశ్‌బాబు



తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరపున రూ.25 లక్షలు.. నిర్మాతల తరపున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరపున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరపున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరపున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు



రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాస్, సురేశ్

ఐదుగురికి జాతీయ ఉపాధ్యాయ అవార్డులు

» అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అవార్డులు అందుకున్నవారిలో ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడ ఎస్‌పీఎస్ మునిసిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు, ఉరందూర్ జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు సురేశ్ కునాటి, తెలంగాణలోని తిరుమలాయపాలెం జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయుడు పీసర ప్రభాకర్ రెడ్డి, దమ్మన్నపేట జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదుల ఉన్నారు.

ఉపాధ్యాయులు దైవ స్వరూపులు

» ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేం: చంద్రబాబు, పవన్

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తును నిర్దేశించే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని, అందుకే వారిని దైవ స్వరూపులుగా భావిస్తుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సీఎంతోపాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ టీచర్లకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏమిచ్చినా టీచర్ల రుణం తీర్చుకోలేమని చంద్రబాబు పేర్కొన్నారు.

సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ పిల్లలకూ సీఏపీ కోటా

» వైద్యవిద్య ప్రవేశాల విషయంలో హై కోర్టుకు వెల్లడించి రాష్ట్రం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య సీట్ల భర్తీలో సాయుధ దళాల సిబ్బంది పిల్లల (సీఏపీ)కు ఇచ్చే రిజర్వేషన్ కోటాను సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) ఉద్యోగుల పిల్లలకు కూడా వర్తింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి హైకోర్టుకు నివేదించారు. ఈ వ్యవహారంపై త్వరలోనే జీవో జారీ అవుతుందని చెప్పారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్‌లో పనిచేసిన వారి పిల్లలకు సీఏపీ కోటా కింద రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అధికారులను ఆదేశించింది. వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

కుల చిచ్చుకు వైసీపీ కుట్ర!

» ద్వేషాన్ని పెంచే వదంతులు నమ్మొద్దని ప్రజలకు పోలీస్ శాఖ సూచన

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వరద ముంపు నుంచి తేరుకొంటున్న బెజవాడపై వైసీపీ విషం కక్కుతోంది. ఇళ్లలో, వీధుల్లో పేరుకుపోయిన బురదను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుల కష్టంపై బురద రాజకీయం మొదలుపెట్టింది. 'విజయవాడలో నీట మునిగిన కాలనీలు శుభ్రం చేయడానికి వచ్చినవారు పేరు, కులం అడిగి చేయడం ఏంట్రా బాబూ?' అంటూ వైసీపీ సానుభూతిపరుడు వర్రా రవీందర్‌రెడ్డి గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై పోలీసు శాఖ సీరియస్ అయింది. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది.

సుప్రీంలో కేసు వివరాలతో మెమో వేయండి

» సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌కు హైకోర్టు ఆదేశం

» క్వాష్ పిటిషన్‌పై విచారణ 2 వారాలకు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ పోలీసు స్టేషన్ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలంటూ తనను బెదిరించారని గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు పెట్టారు. ఇదే తరహా వ్యాజ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రామ్‌సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారని చెబుతున్న నేపథ్యంలో.. ఆ కేసు వివరాలతో మెమో దాఖలు చేయాలని ఆయన్ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. వివేకా హత్య కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలని రామ్‌సింగ్ తనను బెదిరించారని ఉదయ్‌కుమార్‌రెడ్డి కడప ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. కోర్టు ఈ ఫిర్యాదు పై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కడప రిమ్స్ పోలీసులను ఆదేశించింది. దీంతో పోలీసులు రామ్‌సింగ్‌పై ఐపీసీ సెక్షన్లు 195ఏ, 323, 506 రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రామ్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం..ఈ కేసులో తదుపరి చర్యలు అన్నింటినీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు రాగా సీబీఐ తరపున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపించారు. ఇదే తరహా కేసులో హైకోర్టులోని మరో న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారని.. తమ పిటిషన్‌కు సుప్రీంకోర్టు డైరీ నంబర్ కూడా కేటాయించిందని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. సుప్రీంకోర్టు నిర్ణయం వెల్లడించేవరకు వేచిచూద్దామని పేర్కొన్నారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి తరపు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి స్పందిస్తూ..హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రామ్‌సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని.. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఆయన పేరుపై ఎలాంటి కేసూ లేదన్నారు. వ్యాజ్యంపై విచారణను కొనసాగించాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. వ్యాజ్యంపై అత్యవసరంగా విచారించాల్సిన అవసరంలేదని అభిప్రాయపడింది. ఈ కేసు పెండింగ్‌లో ఉన్నా.. ప్రధాన వ్యాజ్యంపై ఎలాంటి ప్రభావం ఉండదని గుర్తు చేసింది. ఇదే తరహా కేసులో హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని రామ్‌సింగ్ చెబుతున్న నేపథ్యంలో నిర్ణయం వచ్చేవరకు వేచిచూద్దామని పేర్కొంది. సుప్రీంకోర్టులో వేసిన కేసు వివరాలతో మెమో దాఖలు చేయాలని సీబీఐ ఎస్పీని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది.

పోలీసు ఉన్నతాధికారులపై జెత్వానీ ఫిర్యాదు

» ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీపై ఫిర్యాదు

విజయవాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానిపై నమోదైన కేసులో ఒక్కో డొంక నెమ్మదిగా కదులుతోంది. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో కాదంబరి జెత్వానీని విచారణాధికారి ఏసీపీ స్రవంతిరాయ్ విచారించారు. తాజాగా ఆమె ముంబై నుంచి తల్లి ఆశా జెత్వానితో కలిసి గురువారం విజయవాడకు వచ్చి అప్పటి పోలీసు ఉన్నతాధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 12 పేజీలతో కూడిన ఫిర్యాదును స్రవంతిరాయ్‌కు అందజేశారు. కొద్దిరోజుల క్రితం కాదంబరి ఆమె తండ్రి నరేంద్రకుమార్ జెత్వాని, తల్లి ఆశా జెత్వాని నుంచి స్రవంతిరాయ్ వాంగ్మూలం తీసుకున్న విషయం తెలిసిందే. కేసు ఫైలులో ఉన్న కొన్ని డాక్యుమెంట్లను చూపించి, అవన్నీ కాదంబరికి చెందినవా కాదా అని నిర్ధారించుకున్నారు. ఆ సమయంలో కేసు విచారణకు మరికొన్ని డాక్యుమెంట్లను అడిగారు. కాదంబరి వాటిని తీసుకొచ్చి అందజేశారు. అనంతరం సీపీ కార్యాలయం బయట కాదంబరి మీడియాతో మాట్లాడుతూ... కొంతమంది పోలీసు ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ కేసుకు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనకు సంబంధించిన పది ఎలక్ట్రానిక్ డివైజ్‌లను పోలీసులు సీజ్ చేశారని చెప్పారు. వాటిని తనకు అప్పగించాలని కూడా ఫిర్యాదులో కోరానన్నారు. ప్రభుత్వం, పోలీసులు తనకు న్యాయం చేస్తారన్న విశ్వాసం ఉందన్నారు.


పెగులా

స్వియటెక్‌కు షాక్

- పెగులా చేతిలో చిత్తు
- సెమీస్‌లో సినర్
- యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఈ ఏడాది యూఎస్ ఓపెన్ సంచలనరీతిలో సాగుతోంది. అదరగొడతారనుకున్న స్టార్లంతా ఆరంభం నుంచే అనూహ్య రీతిలో వెనుదిరుగుతున్నారు. తాజాగా వరల్డ్ నెంబర్‌వన్ ఇగా స్వియటెక్ (పోలెండ్) కూడా అదే జాబితాలో చేరింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఈ మాజీ చాంపియన్ 2-6, 4-6 తేడాతో ఆరో సీడ్ జెస్సికా పెగులా (యూఎస్ఏ) చేతిలో చిత్తుగా ఓడింది. గతంలో పెగులా ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్స్‌కు చేరినా ఒక్కసారి కూడా గెలువలేకపోయింది. ఈసారి మాత్రం సంపూర్ణ ఆధిపత్యంతో కెరీర్‌లో తొలిసారి సెమీస్‌లో అడుగుపెట్టింది. అటు స్వియటెక్ మాత్రం పేలవ సర్వీస్, ఫోర్‌హ్యాండ్ షాట్లతో మూల్యం చెల్లించుకుంది. ఏకంగా 41 అనవసర తప్పిదాలకు పాల్పడింది. దీంతో తీవ్ర అసహనానికి గురైన తను ఓ దశలో రాకెట్‌ను నెట్‌పైన కొట్టింది. కేవలం ఒక్కసారి మాత్రమే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేయగలిగింది. మరో క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ మచోవా 6-1, 6-4 తేడాతో బియాట్రిజ్ హడ్డడ్ (బ్రెజిల్)పై గెలిచి ఈ గ్రాండ్‌స్లామ్‌లో వరుసగా రెండోసారి సెమీస్‌కు చేరింది. శుక్రవారం నాటి సెమీస్‌లో మచోవ-పెగులా, సబలెంక (బెలారస్)-ఎమ్మా నవారో (యూఎస్ఏ) తలపడనున్నారు.


సినర్

సినర్ సెమీస్‌కు..: పురుషుల సింగిల్స్‌లో జానిక్ సినర్ 'టాప్' షో కొనసాగుతోంది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో మెద్వెదెవ్ (రష్యా)పై 6-2, 1-6, 6-1, 6-4 తేడాతో గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టాడు. తాజా గ్రాండ్‌స్లామ్‌లో సినర్ కేవలం రెండు సెట్లు మాత్రమే కోల్పోయాడు. శనివారం జరిగే సెమీస్‌లో సినర్-జాక్ డ్రేపర్ (బ్రిటన్), ఫ్రాన్స్ ద్వయం టేలర్ ఫ్రిట్జ్-ఫ్రాన్సెస్ టియాఫో తలపడనున్నారు.

అక్షర్ ఆల్‌రౌండ్ షో

'అనంత'లో దులీప్ ట్రోఫీ షురూ


అక్షర్

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ షో (86, 2/16)తో అదరగొట్టడంతో ఇండియా 'సి'తో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో తొలిరోజు ఇండియా 'డి' పైచేయి ప్రదర్శించింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన ఇండియా 'డి' 48/6తో దయనీయస్థితిలో నిలిచింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అక్షర్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో ఇండియా 'డి' మొదటి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా 'సి' ఆట ఆఖరికి 91/4తో కష్టాల్లో పడింది.

శతక్కొట్టిన ముషీర్

బెంగళూరు: ముషీర్ ఖాన్ అజేయ శతకం (105 బ్యాటింగ్)తో చెలరేగడంతో ఇండియా 'ఎ'తో ఇక్కడ మొదలైన మరో మ్యాచ్‌లో మొదటి రోజు ఆఖరికి ఇండియా 'బి' తొలి ఇన్నింగ్స్‌లో 202/7 స్కోరు చేసింది. రోడ్డు ప్రమాదం నుంచి కోలుకొన్నాక తొలిసారి రెడ్‌బాల్ క్రికెట్ బరిలో దిగిన కీపర్ పంత్ (7) నిరాశ పరిచాడు. ముషీర్‌తోపాటు నవ్‌దీప్ సైనీ (29 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఇప్పటికి.. 25 పాతిక పతకాలతో భారత్ అదుర్స్




కపిల్ కంచు పట్టు

జూడోలో కపిల్‌కు అనూహ్య కాంస్యం

పారాలింపిక్స్

పారిస్: గత మూడు రోజులుగా పతకాల పంట పండించిన భారత్ జోరు నెమ్మదించింది. గురువారం.. దృష్టిలోపం ఉన్న పారా జుడోకా కపిల్ పర్మార్ కాంస్యం మాత్రమే భారత్ ఖాతాలో చేరింది. దీంతో ఈ క్రీడల్లో లక్ష్యంగా పెట్టుకొన్న మొత్తం పతకాల సంఖ్య 25 (5 స్వర్ణ, 9 రజత, 11 కాంస్య)కు చేరింది. ఇంకా పలు పోటీలు మిగిలివున్న నేపథ్యంలో భారత్ ఇప్పటికే అనుకున్న టార్గెట్‌ను చేరడం అవి ఎంతానందాన్ని కలిగించేదే. 64 సంవత్సరాల పారాలింపిక్స్ చరిత్రలో భారత్ ఇన్ని పతకాలు ఎప్పుడూ సాధించలేదు. టోక్యో ఒలింపిక్స్‌లో 19 పతకాలు కైవసం చేసుకుంది.

పురుషుల జూడో జె-1 60 కిలోల విభాగం కాంస్య పోరులో పర్మార్ 10-0తో ఎలియల్‌టన్ డి ఒలివేరియా (బ్రెజిల్)ను మట్టికరిపించాడు. జూడోలో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. సెమీస్‌లో పర్మార్ 0-10తో బనితబ ఖుర్రమ్ అబాడి (ఇరాన్) చేతిలో ఓడాడు. 2022 ఆసియా క్రీడల్లో కపిల్ రజతం సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన పర్మార్ పొలంలో ఆడుకొంటూ మోటార్‌ను ముట్టుకోగా షాక్ తగిలింది. స్పృహతప్పి పడిపోయిన అతడిని గ్రామస్థులు గుర్తించి ఆసుపత్రిలో చేర్చారు. ఆరు నెలలపాటు కోమాలో ఉన్న కపిల్ ప్రాణాలతో బయటపడినా కంటిచూపు దెబ్బతింది. కపిల్ తండ్రి ఓ టాక్సీ డ్రైవర్ కాగా.. అతడి రెండో అన్న లలిత్ జూడో నేర్చుకొనేవాడు. అతడి సహకారంతోనే పర్మార్ కూడా బ్లైండ్ జూడోను నేర్చుకొన్నాడు. కాగా, బతుకు తెరువు కోసం కపిల్ అన్నతో కలసి టీస్టాల్ నడుపుతున్నాడు. మహిళల 48 కిలోల జె-2 కేటగిరీ రెపిచేజ్ రౌండ్‌లో కోకిల 0-10తో ఇవనిత్సిక (ఉక్రెయిన్) చేతిలో ఓడింది.

హర్విందర్‌కు 'డబుల్' మిస్..

స్వర్ణంతో అదరగొట్టిన రికర్వ్ ఆర్చర్ హర్విందర్ సింగ్ త్రుటిలో రెండో పతకాన్ని చేజార్చుకొన్నాడు. మిక్స్‌డ్ రికర్వ్‌లో షూటాఫ్‌లో తడబడిన హర్విందర్ జంట పాయింట్ తేడాతో కంచు పతకం చేజార్చుకొంది. కాంస్య పోరులో హర్విందర్-పూజ జోడీ 4-5తో స్లొవేనియాకు చెందిన డెజాన్ ఫాబ్‌కిక్-జివా లావ్రింక్ చేతిలో పోరాడి ఓడింది. 1, 3 సెట్లలో భారత్ జోడీ నెగ్గగా.. 2, 4 సెట్లలో స్లొవేనియా జంట గెలవడంతో స్కోరు 4-4తో సమమైంది. కానీ, షూటాఫ్‌లో హర్విందర్ (8 పాయింట్లు), పూజ (9 పాయింట్లు) మొత్తం 17 పాయింట్లు సాధించగా.. స్లొవేనియా జంట 19 పాయింట్లు స్కోరు చేసి గెలిచింది. సెమీస్‌లో హర్విందర్-పూజ జంట 2-6తో ఇటలీకి చెందిన ఎలిజబెటా-స్టెఫనో ట్రావిశాని చేతిలో పరాజయం పాలైంది.

షూటర్ల గురి తప్పింది..

మిక్స్‌డ్ 50 మీటర్ల ప్రోన్ ఎస్‌హెచ్1లో భారత షూటర్లు ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. మోనా అగర్వాల్ 610.5 పాయింట్లతో 30వ స్థానంలో, సిద్దార్థ బసు 615.5 పాయింట్లతో 22వ స్థానంలో నిలిచారు.



సిమ్రన్‌కు 4వ స్థానం

మహిళల 100 మీటర్ల టీ12 కేటగిరీలో భారత అథ్లెట్ సిమ్రన్ నాలుగో స్థానంలో నిలిచింది. ఫైనల్లో తలపడిన నలుగురిలో సిమ్రన్ 12.31 సెకన్ల టైమింగ్‌తో విఫలమైంది. ఒమారా డ్యూరాండ్ 11.81 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం సొంతం చేసుకోగా.. ఒక్సానా (ఉక్రెయిన్), కత్రీన్ మ్యూలర్ (క్యూబా) రజత, కాంస్యాలు దక్కించుకొన్నారు.

అశోక్ విఫలం..

పవర్ లిఫ్టింగ్ 65 కిలోల విభాగంలో భారత ఆటగాడు అశోక్ ఆరో స్థానంలో నిలిచాడు. మూడు ప్రయత్నాల్లో 196, 199 కిలోల బరువు ఎత్తిన అశోక్.. మూడో ప్రయత్నంలో 206 కిలోలు లిఫ్ట్ చేయలేక పోయాడు.

ధరమ్‌బీర్, ప్రణవ్‌కు స్వర్ణ, రజతాలు

క్లబ్ త్రోలో భారత ఆటగాళ్లు ధరమ్‌బీర్, ప్రణవ్ సూర్మ స్వర్ణ, రజతాలతో అదరగొట్టారు. బుధవారం రాత్రి జరిగిన పురుషుల ఎఫ్51 క్లబ్ త్రో ఫైనల్లో వరల్డ్ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత ధరమ్‌బీర్ (35) ఆసియా రికార్డు 34.92 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. నాలుగు ప్రయత్నాలు ఫౌల్ కాగా.. ఐదో ప్రయత్నంలో రికార్డు ఫీట్‌తో పసిడి పట్టేశాడు. కాగా, 29 ఏళ్ల ప్రణవ్ 34.59 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. పారాలింపిక్స్‌లో భారత ఆటగాళ్లు తొలి రెండు స్థానాల్లో నిలవడం ఇదే తొలిసారి. అయితే, 2017 వరల్డ్ చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అమిత్ కుమార్ సరోహ 23.96 మీటర్ల దూరమే విసిరి పదో, చివరి స్థానంలో నిలిచాడు. రజతం సాధించిన సూర్మది హరియాణాలోని ఫరీదాబాద్. అతడికి క్రికెట్, రోలర్ స్కేటింగ్ అంటే ఎంతో ఇష్టం. కానీ, 16 ఏళ్ల వయసులో ఓ సిమెంట్ పలక తలపై పడడంతో వెన్నెముక దెబ్బతింది. దీంతో వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ధైర్యంతో ఆటతోపాటు చదువులోనూ రాణించాడు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ నుంచి పీజీ చేసిన ప్రణవ్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు.


ధరమ్‌బీర్


ప్రణవ్

మహిత్, అభినవ్‌కు పతకాలు

హనోవర్ (జర్మనీ): ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు మహిత్ సంధు స్వర్ణం, అభినవ్ దేశ్వాల్ రజతం కొల్లగొట్టారు. గురువారం ముగిసిన ఐదో రోజు పోటీల్లోని మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఫైనల్లో మహిత్ 247.4 స్కోరుతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో మహిత్‌కు ఇది రెండో స్వర్ణం కాగా, మొత్తంగా మూడో పతకం. ఇంతకుముందు మహిత్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్‌లో ధనుష్ శ్రీకాంత్‌తో కలిసి స్వర్ణం, 10 మీ. ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించింది. పురుషుల 25 మీ. పిస్టల్ విభాగంలో అభినవ్ దేశ్వాల్ ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణం కోల్పోయి, రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇక, ఈ టోర్నీలో భారత్ ఇప్పటివరకు 4 స్వర్ణాలు సహా 15 పతకాలు సాధించింది.

క్వార్టర్‌ఫైనల్లో తనీషా జోడీ

తైపీ: భారత్‌కు చెందిన తనీషా క్రాస్టో/ధ్రువ్ కపిల జోడీ తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం రెండో రౌండ్‌కే పరిమితమైంది. గురువారం జరిగిన రౌండ్-16 పోరులో తనీష/కపిల ద్వయం 21-13, 22-20తో తైపీ జంట కో చి చాంగ్/యెన్ యు లిన్‌ను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో సతీష్ కుమార్ 19-21, 19-21తో కో క్వాన్ (తైపీ) చేతిలో, సుబ్రమణియన్ 22-24, 12-21తో లిన్ చున్ చేతిలో ఓటమిపాలయ్యారు.

మార్కెట్లోకి మెర్సిడెస్ బెంజ్ మేబాక్ ఈక్యూఎస్ 680



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ తొలి పూర్తి విద్యుత్ కారు మేబాక్ ఈక్యూఎస్ 680 ఎస్‌యూవీని మార్కెట్లోకి తెచ్చింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.25 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది. అల్ట్రా లగ్జరీ విభాగంలో డిజిటల్, ఎలక్ట్రిక్ కార్ల సెగ్మెంట్‌లో అగ్రస్థానం సాధించాలన్న తమ ఆశయానికి ఇది బలం చేకూరుస్తుందని మెర్సిడెస్-బెంజ్ ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ అయ్యర్ తెలిపారు. మేబాక్ అమ్మకాలపరంగా ప్రస్తుతం తాము ప్రపంచంలోని టాప్ 10 మార్కెట్లలో ఒకటిగా చేరామని, టాప్ 5 మార్కెట్లలోకి చేరడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన అన్నారు. తమ వృద్ధికి ఈ బ్రాండ్ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. దేశంలో తాము 1,500 పైగా మేబాక్ కార్లను విక్రయించామని అయ్యర్ తెలిపారు.

'మెకాన్'తో విశాఖ పోర్టు ఒప్పందం



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల అభివృద్ధిలో సాంకేతిక సహకారం కోసం ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సేవలు అందించే 'మెకాన్'తో విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ (వీపీటీ) గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. పోర్టులో బొగ్గు, ఇతర ఖనిజాలు, సరుకుల నిర్వహణ వ్యవస్థలను సమర్థంగా నడిపేందుకు అనువైన వాతావరణం 'మెకాన్' సమకూరుస్తుంది. ర్యాపిడ్ లోడింగ్ విధానం, రైల్వే సైడింగ్స్, మలిన జలాల శుద్ధి ప్లాంటు, ఆటోమేషన్, విద్యుత్ పంపిణీ వంటి ప్రాజెక్టులకు సాంకేతిక సహకారం అందిస్తుంది. ప్రాజెక్టు రిపోర్టులు, పర్యావరణ ప్రభావ అంచనాలు, ప్రొక్యూర్‌మెంట్ సాయం, తనిఖీ సేవలు, స్వతంత్ర ఇంజనీరింగ్ నైపుణ్యాలలో సాయపడుతుంది. పోర్టు చైర్మన్ అంగముత్తు సమక్షంలో ఇరు సంస్థల అధికారులు ఒప్పందం చేసుకున్నారు.

మహిళలు, ఎంఎస్ఎంఈలకు మద్దతు కీలకం

వీరి కోసం ప్రత్యేక పథకాలు తీసుకురండి

ఆర్థిక సంస్థలకు ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సూచన



ముంబై: దేశంలో సమ్మిళిత వృద్ధి సాధనకు మహిళలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)కు ఆర్థిక సంస్థలు గట్టి మద్దతు ఇవ్వాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పిలుపు ఇచ్చారు. అండర్ రైటింగ్ ప్రమాణాలు నీరుగార్చకుండానే మహిళల నిర్వహణలోని వ్యాపారాలు, ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వగల ఉత్పత్తులు, పథకాలు రూపొందించాలని ఆయన సూచించారు. ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ) సంయుక్తంగా నిర్వహించిన ఫిబాక్-2024 సదస్సులో దాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలతో పాటు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇవ్వగల విధంగా బ్యాంకులు కూడా సొంత పథకాలతో ముందుకు రావాలన్నారు. ప్రపంచ సగటుతో పోల్చితే కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం చాలా తక్కువ అన్నారు. అలాగే ఎంఎస్ఎంఈల్లో కూడా మహిళల యాజమాన్యంలోని యూనిట్లు ఐదింట ఒక వంతు మాత్రమే ఉన్నాయని అని చెప్పారు. మహిళల విద్య, నైపుణ్యాభివృద్ధి, పని ప్రదేశాల్లో రక్షణ, సామాజిక అవరోధాలు తొలగించడం ద్వారా మాత్రమే ఈ వ్యత్యాసాన్ని పూడ్చగలమని ఆయన పేర్కొన్నారు.

మూలధన సమీకరణలో సవాళ్లు

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యాపారాలకు అవసరమైన మూలధనం సమీకరించుకోవడంలో పలు సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వారికి సరసమైన రేట్లకు రుణాలు కూడా అందడంలేదని దాస్ తెలిపారు. అలాగే మహిళలకు ఉపాధి కల్పించడంపై ఆర్థిక సంస్థలు దృష్టి పెట్టాలని దాస్ సూచించారు. దేశంలో యువ జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో తగినన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేవాలంటే ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆర్థిక వనరుల పరంగా ఎంఎస్ఎంఈలు ఎదురీదుతున్న విషయం ఆయన గుర్తు చేస్తూ ఫిన్‌టెక్ ఇన్నోవేషన్లను ఉపయోగించుకుని ఎంఎస్ఎంఈలకు సౌకర్యవంతంగా ఉండే రుణ ఉత్పత్తులు రూపొందించడం, వర్కింగ్ క్యాపిటల్ అవకాశాలు మెరుగుపరచడం అవసరమని దాస్ నొక్కి చెప్పారు.

ఎంఎస్ఎంఈల నగదు ప్రవాహం అధికంగా ఉండి, వృద్ధి దశలో ఉన్న సమయంలో అండగా నిలిచే పాలసీలు రూపొందించాలని సూచించారు. ఇలాంటి చర్యల ద్వారా మాత్రమే ఎంఎస్ఎంఈలు విస్తరించి ఉత్పాదకతను పెంచగలుగుతాయని, తద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేగలుగుతాయని దాస్ చెప్పారు.

సంస్కరణల జోరు పెరగాలి

భారత ఆర్థిక వ్యవస్థలో వినియోగ, పెట్టుబడుల డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధి అవకాశాలు స్థిరంగా ఉన్నాయని, వీటిని మరింత ఉత్తేజితం చేసేందుకు సంస్కరణల జోరును పెంచాలని దాస్ అన్నారు. భూ, కార్మిక, వ్యవసాయ మార్కెట్ సంస్కరణలు చేపట్టడం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కీలకమైన కూడలిలో ఉన్నదని, విభిన్న రంగాల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థూల ఆర్థిక స్థిరత్వం, వృద్ధి-ద్రవ్యోల్బణం మధ్య సానుకూలమైన సమతూకం నెలకొన్నాయని దాస్ చెప్పారు. ప్రస్తుతం నెలకొన్న స్థూల స్థిరత్వం నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ ప్రకటించిన జీడీపీ వృద్ధి అంచనా 7.2 శాతం అసాధ్యం ఏమీ కాదని దాస్ అన్నారు.

బిజినెస్

జియో 8వ వార్షికోత్సవ ఆఫర్లు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద టెలికాం సంస్థ రిలయన్స్ జియో 8వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ఎంపిక చేసిన రీచార్జ్ ప్లాన్లపై ఆఫర్లు ప్రకటించింది. జియో వెబ్‌సైట్ డేటా ప్రకారం.. ఈ నెల 5 నుంచి 10 తేదీల మధ్యలో రూ.899, రూ.999 త్రైమాసిక ప్లాన్స్‌తో పాటు రూ.3,599 వార్షిక ప్లాన్‌తో రీచార్జ్ చేసుకునేవారికి రూ.700 విలువైన మూడు ప్రయోజనాలు లభించనున్నాయి. 10 ఓటీటీలు, 28 రోజుల వ్యాలిడిటీతో కూడిన రూ.175 విలువ చేసే 10జీబీ డేటా ప్యాక్, మూడు నెలల జొమాటో గోల్డ్ మెంబర్‌షిప్ లభించనున్నాయి. ప్రస్తుతం 90 రోజుల వ్యాలిడిటీతో కూడిన రూ.899, 98 రోజుల రూ.999 ప్లాన్స్‌పై రోజుకు 2జీబీ డేటా లభిస్తోంది. 365 రోజుల వ్యాలిడిటీతో కూడిన రూ.3,599 ప్లాన్‌పై రోజుకు 2.5 జీబీ డేటా లభిస్తోంది. 2016 సెప్టెంబరులో సేవలను ప్రారంభించిన రిలయన్స్ జియో గడిచిన 8 ఏళ్లలో డేటా ట్రాఫిక్ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీగా అవతరించింది.

తెలుగు రాష్ట్రాలకు అరబిందో రూ.10 కోట్ల విరాళం

హైదరాబాద్: వరదలతో అతలాకుతలవుతున్న తెలుగు రాష్ట్రాలకు అరబిందో ఫార్మా మొత్తం రూ.10 కోట్ల విరాళం ప్రకటించింది. అందులో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు రూ.5 కోట్లు, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 కోట్లు చొప్పున అందించనున్నట్లు తెలిపింది. అరబిందో ఫార్మా తన దాతృత్వ అనుబంధ విభాగమైన అరబిందో ఫార్మా ఫౌండేషన్ ద్వారా ఈ సాయాన్ని ప్రకటించింది.

మైక్రోసాఫ్ట్‌తో బైట్‌ఎక్స్‌ఎల్ భాగస్వామ్యం

హైదరాబాద్: ఎడ్యుటెక్ ప్లాట్‌ఫామ్ బైట్‌ఎక్స్‌ఎల్.. అంతర్జాతీయ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో జట్టుకట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలోని 10 యూనివర్సిటీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) స్పెషలైజేషన్‌తో కూడిన బీటెక్ కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు బైట్‌ఎక్స్‌ఎల్ వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,750 ▼	66,680 ▼	91,000 ▲
ముంబై	71,875 ▲	65,838 ▲	82,971 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ

హైదరాబాద్	470	విజయవాడ	505
వరంగల్	472	గోదావరి	500
చిత్తూరు	518	విశాఖపట్నం	505

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	97
కర్నూలు	99	నెల్లూరు	97
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

అల్ట్రా లగ్జరీ గృహాలకు గిరాకీ

- 8 నెలల్లో 25 ఇళ్ల అమ్మకం
- ఒక్కో ఇంటి సగటు ధర రూ.40 కోట్లు
- హైదరాబాద్‌లో రెండు ఇళ్ల అమ్మకం: అనరాక్



న్యూఢిల్లీ: దేశంలో అల్ట్రా లగ్జరీ (అత్యంత విలాసవంతమైన) గృహాలకు డిమాండ్ పెరిగిపోతోంది. గత ఎనిమిది నెల (జనవరి-ఆగస్టు)ల్లో ముంబై, హైదరాబాద్, ఎన్‌సీఆర్-గురుగ్రామ్, బెంగళూరు నగరాల్లో 25 విలాస గృహాలు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.2,443 కోట్ల వరకు ఉంటుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. ఈ లెక్కన ఒక్కో ఇంటి కనీస సగటు ధర రూ.40 కోట్లు ఉంటుందని అంచనా. గత ఏడాది మొత్తానికి చూస్తే రూ.4,456 కోట్ల విలువైన 61 విలాస గృహాలు అమ్ముడుపోయాయి. ఈ ఎనిమిది నెలల్లో అమ్ముడైన 25 విలాస గృహాల్లో 20 హైరైజ్ అపార్ట్‌మెంట్లని అనరాక్ తెలిపింది. వీటి విలువ రూ.1,694 కోట్లు. మిగతా ఐదు విలాస బంగ్లాలు. వీటి విలువ రూ.748.5 కోట్లని అనరాక్ తెలిపింది.

ముంబై టాప్: రూ.40 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన విలాస గృహాల అమ్మకాల్లో దేశ ఆర్థిక రాజధాని ముంబై అగ్రస్థానంలో ఉంది. గత ఎనిమిది నెలల్లో దేశంలో అమ్ముడైన 25 విలాస గృహాల్లో 20 గృహాలు ఒక్క ముంబైలోనే అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.2,200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. విలాస గృహాల అమ్మకాల్లో ముంబై తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. గత ఎనిమిది నెలల్లో నగరంలో రూ.80 కోట్ల విలువైన రెండు విలాస గృహాలు అమ్ముడయ్యాయి. ఈ రెండు అమ్మకాలు నగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో చోటు చేసుకున్నాయి. మిగతా రెండు లావాదేవీలు ఢిల్లీ ఎన్‌సీఆర్ గురుగ్రామ్, బెంగళూరుల్లో జరిగినట్టు అనరాక్ తెలిపింది.

హైదరాబాద్‌లో చౌకే: ఇక అందుబాటు ధరల ఇళ్ల విషయానికి వస్తే హైదరాబాద్‌లో చౌకగానే ఉన్నాయి. తమ నెలవారీ ఆదాయంలో గృహ రుణాల ఈఎంఐల కింద ముంబై, దాని పరిసర ప్రాంతాల ప్రజలు నగటున 116 శాతం, ఢిల్లీ వాసులు 82 శాతం చెల్లిస్తుంటే హైదరాబాద్ ప్రజలు 61 శాతం మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే అహ్మదాబాద్, చెన్నైలతో పోలిస్తే ఇది ఎక్కువే. ఈ రెండు నగరాల ప్రజలు తమ నెలవారీ ఆదాయంలో నగటున 41 శాతం మాత్రమే గృహ రుణాల ఈఎంఐల కింద చెల్లిస్తున్నట్టు రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ మాజిక్‌బ్రిక్స్ తెలిపింది.

రిలయన్స్, ఎయిర్‌టెల్ షేర్లు పడేశాయ్..

వరుసగా రెండో రోజూ నష్టాల్లో సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ బలహీన సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎయిర్‌టెల్, ఎల్ అండ్ టీ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. దీంతో గురువారం సెన్సెక్స్ 151.48 పాయింట్లు కోల్పోయి 82,201.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 53.60 పాయింట్ల నష్టంతో 25,145.10 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.41 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.56 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ 0.95 శాతం వరకు నష్టపోయాయి.

ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు పెరిగి 83.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.96 శాతం పెరుగుదలతో 73.40 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఆర్ఐఎల్ బోనస్ ఇష్యూకు బోర్డు ఓకే

దేశంలో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) బోనస్ షేర్ల జారీ ప్రతిపాదనకు కంపెనీ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఆర్ఐఎల్ తన వాటాదారులు కలిగి ఉన్న ప్రతి షేరుకు బోనస్‌గా మరో షేరు (1:1 నిష్పత్తిలో)ను జారీ చేయనుంది. గడిచిన ఏడేళ్లలో కంపెనీకిదే తొలి బోనస్ షేర్ల జారీ కానుంది. చివరిసారి 2017 సెప్టెంబరులోనూ సంస్థ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసింది. అంతక్రితం 2009లోనూ బోనస్ షేర్లను ఇష్యూ చేసింది. ఆర్ఐఎల్ ఐపీఓకు వచ్చినప్పటి నుంచి ఆరో బోనస్ ఇష్యూ ఇది. 1980-81లో 3:5 నిష్పత్తిలో, 1983-84లో 6:10 నిష్పత్తిలో, 1997-98లో ఒక షేరుకు మరో షేరు జారీ చేసింది.

పూడికలతోనే బుడమేరు ముంపు

- వరద ప్రభావం తగ్గగానే ప్రక్షాళన
- ఇంతకంటే భారీ వరదలు వచ్చినా ప్రమాదాలు జరగకుండా చేస్తా: చంద్రబాబు
- ఎనికేపాడులో ఆకస్మిక పర్యటన
- వరద కారణంపై క్షేత్రస్థాయి పరిశీలన
- రైతులతో నేరుగా మాట్లాడిన సీఎం

గుణదల, సెప్టెంబరు 5: బుడమేరు ముంపుతో తలెత్తిన భారీ వరదలకు ప్రధాన కారణం ఏంటనే విషయంపై సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇరిగేషన్ అధికారులను వెంటబెట్టుకుని విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడు గ్రామంలో ఆకస్మికంగా ఆయన పర్యటించారు. ఎనికేపాడు వద్ద ఏలూరు కాల్వ దాటేందుకు వంతెన లేకపోవడంతో అక్కడే ఉన్న బల్లకట్టపైకి ఎక్కి బుడమేరు కాల్వ వద్దకు చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. బుడమేరు నీరు సరిగా పారకపోవడంతోనే వరద ముప్పు వచ్చిందని గుర్తించారు. వరద తీవ్రత తగ్గగానే ఎక్కడికక్కడ బుడమేరు కాల్వ సజావుగా పారేందుకు ఉన్న అడ్డంకులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ దిగువన ఈ తరహాలో బుడమేరు పూడుకుపోయి ఉంటే పైనుంచి వచ్చే నీరు దిగువకు సజావుగా ఎలా పారుతుందని ప్రశ్నించారు. పూడికలు తీసి నీరు పారేలా చేస్తే మరోసారి ఇదే స్థాయిలో కానీ ఇంతకంటే భారీగా కానీ వరద వచ్చినా ఇబ్బందులు ఉండవని.. ముంపు ముప్పు భయం కూడా ఉండదని తేల్చి చెప్పారు. కాగా, సీఎం వచ్చారన్న



వరద నీటిలో పంటుపై సీఎం చంద్రబాబు పర్యటన

సమాచారం అందుకున్న ఎనికేపాడు మాజీ సర్పంచ్ కోనేరు శివరామకృష్ణ(పెదబాబు) క్షణాల్లో బల్లకట్ట వద్దకు చేరుకుని పరిస్థితిని చంద్రబాబుకు వివరించారు. అప్పటికే చంద్రబాబు స్థానిక రైతాంగాన్ని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటపొలాల్లోకి చేరిన నీరు దిగువకు వెళ్లాలంటే ఏంచేయాలని వారిని ప్రశ్నించారు. దీనికి రైతులు స్పందిస్తూ.. బుడమేరు ఉధృతి తగ్గితే పొలాల్లో నీరు తగ్గుతుందన్నారు. రైతులతో మాట్లాడిన అనంతరం చంద్రబాబు తిరిగి బల్లకట్టపై ఎక్కి ఏలూరు కాల్వపై ప్రయాణిస్తూ.. మాజీ సర్పంచ్ శివరామకృష్ణతో మాట్లాడారు. బ్రిటీష హయాంలో బుడమేరు కాల్వకు ఏర్పాటు చేసిన గేట్లను తొలగించి 30 ఏళ్ల క్రితం ఇరిగేషన్ అధికారులు గోడ కట్టేశారని శివరామకృష్ణ చెప్పారు. గత 15 ఏళ్లలో బుడమేరు పూడిక తీసిన దాఖలాలు లేవన్నారు. ఎప్పటికప్పుడు పూడిక తీస్తే విపత్కర పరిస్థితులు వచ్చేవి కావన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు తెలియజేశామని తెలిపారు. బల్లకట్ట స్థానంలో వంతెన నిర్మాణం చేపట్టేందుకు ఆయన హామీ ఇచ్చారన్నారు.



వరద పరిస్థితిని పరిశీలించేందుకు విజయవాడలో రైలు పట్టాల పక్కనున్న వంతెనపై నడుస్తున్న సీఎం చంద్రబాబు

రంగంలోకి ఆర్మీ బృందం

- బుడమేరు గండ్లు పూడ్చేందుకు వస్తోంది
- 15 లక్షల క్యూసెక్కులను తట్టుకొనేలా 'ప్రకాశం'ను పటిష్టపర్చడంపై దృష్టి:బాబు

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుడమేరు వాగుకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చడానికి ఆర్మీ బృందం వస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గురువారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తమ నైపుణ్యం జోడించడానికి ఆర్మీ నిపుణులు గురువారం రాత్రి వస్తున్నారని తెలిపారు. 'బుడమేరు వరదను మళ్లించడానికి మేం గతంలో చేపట్టిన పనులను జగన్ ప్రభుత్వం 2020లో రద్దు చేసింది. ఆ వాగుకు పడిన గండ్లను పూడ్చకుండా వదిలివేసింది. ఆ గండ్ల నుంచి వరద విజయవాడ నగరంపై పడింది. మామూలుగా బుడమేరుకు ఏడెనిమిది వేల క్యూసెక్కుల వరద వచ్చేది. కానీ రెండు రోజుల్లో అతి భారీగా నలభై సెంటీమీటర్ల వర్షం కురవడంతో ఏకంగా 30 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇంత వర్షం కురవడం మామూలు విషయం కాదు. ఇటువంటి పరిణామాల్ని ఎలా ఎదుర్కోవాలో సాంకేతిక నిపుణులతో మాట్లాడుతున్నాం. ప్రకాశం బ్యారేజీని వందేళ్ల కిందట పదకొండున్నర లక్షల క్యూసెక్కుల వరద తట్టుకొనేలా కట్టారు. ఇప్పుడు దాదాపు అంత వరద వచ్చింది.



గండ్లు పూడ్చటానికి వస్తున్న ఆర్మీ బృందం

ఇంకా పెరిగితే ఎలా అన్నదానికి సమాధానం చూడాలి. పదిహేను లక్షల క్యూసెక్కుల వరదను కూడా తట్టుకొనేలా ప్రకాశం బ్యారేజీని ఎలా పటిష్టపర్చాలన్నది చర్చిస్తున్నాం. కృష్ణా నది కట్టలను కూడా బలోపేతం చేయాలి. ఇవన్నీ కేంద్రం దృష్టికి తీసుకువెళ్తున్నాం' అని వివరించారు. వరద ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్..కేంద్రం నుంచి తగిన సాయం అందేలా చూడగలరని ఆశిస్తున్నామని చెప్పారు.

చలించిపోయిన చంద్రబాబు

వరద ప్రాంతాల్లో పర్యటించిన చంద్రబాబు..ప్రజల కష్టాలకు చలించిపోయారు. వారి బాధలు విని చంద్రబాబు కళ్లు సుడులు తిరిగాయి. గురువారం మధురానగర్, దేవీనగర్ తదితర ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సమయంలో బాధితుల వేదన విని.. బాబు కన్నీటి పర్యంతమయ్యారు. ఇళ్లన్నీ నీళ్లలో నానుతుండటం.. విలువైన వస్తువులు ఎందుకూ పనికిరాకుండా రోడ్డుపై కొట్టుకు వచ్చి పడి ఉండటం చూసి ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క కుటుంబాన్నీ తన కుటుంబంగా భావించి ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు

చంద్రబాబుకు తప్పిన పెనుముప్పు

- బుడమేరు ప్రవాహాన్ని పరిశీలించేందుకు మధురానగర్ వద్ద రైల్వే బ్రిడ్జి ఎక్కిన సీఎం
- అదే సమయంలో ట్రాక్‌పైకి వచ్చిన ఎక్స్‌ప్రెస్
- భద్రతా సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం
- ముఖ్యమంత్రికి 3 అడుగుల దూరంలో వెళ్లిన ట్రైన్

విజయవాడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పెను ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడ్డారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు గురువారం ఆయన విజయవాడలోని మధురానగర్, దేవీనగర్ ప్రాంతాలకు వెళ్లారు. దేవీనగర్ ప్రాంతంలో బుడమేరు ప్రవాహ ఉధృతిని పరిశీలించేందుకు అక్కడే ఉన్న రైల్వే బ్రిడ్జిపైకి ఎక్కారు. అయితే, సీఎం బ్రిడ్జిపై ఉన్న సమయంలోనే సింగిల్ ట్రాక్‌పైకి ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకువచ్చింది. ఈ విషయాన్ని ముందుగా గుర్తించలేకపోయిన అధికారులు.. రైలు శబ్దం విని పించగానే హడలెత్తిపోయారు. ఆ వెంటనే హుటాహుటిన అప్రమత్తమై.. సీఎం చంద్రబాబును బ్రిడ్జికి ఉన్న ర్యాంపు పైకి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న లైన్‌మెన్ ఎర్రజెండా చూపించడంతో రైలు డ్రైవర్ వేగాన్ని తగ్గించి ముందుకు సాగారు. అయితే, సీఎం నిలబడిన ప్రదేశానికి 3 అడుగుల దూరం నుంచి రైలు వెళ్లిపోయింది. ట్రైన్ వెళ్లిన అనంతరం సీఎం రైల్వే బ్రిడ్జి నుంచి వెలుపలికి రావడంతో అప్పటి వరకు టెన్షన్ పడిన భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



రైలు వస్తుండగా పట్టాలపై పక్కన నిలబడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు

మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం

- చంద్రబాబును కొనియాడిన పవన్ కల్యాణ్



అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వరదల సమయంలో సీఎం చంద్రబాబు యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. 'మీ మాటలతో మరింత ఉత్తేజాన్ని కలిగించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మరోవైపు ప్రకృతి వైపరీత్యం, వీటి నడుమ మీ పాలనా దక్షత, విధి నిర్వహణలో మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం, అభినందనీయం. ఇలాంటి సమయంలో ప్రజలను ఆదుకోవడం మన ప్రభుత్వంతో పాటు వ్యక్తిగత స్థాయిలో నా కనీస బాధ్యతగా భావిస్తున్నాను. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్, ఇతర శాఖలు యుద్ధప్రాతిపదికన పాల్గొంటున్నాయి. త్వరలోనే మనం ఈ సంక్షోభం నుంచి బయటపడతామని ఆశిస్తున్నాను' అంటూ పవన్ ఆకాంక్షించారు.

సూపర్ క్లోరినేషన్ చేపట్టాలి : పవన్

వరద నీరు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, సూపర్ క్లోరినేషన్ చేపట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఓవైపు వైరల్ జ్వరం, తీవ్రమైన దగ్గుతో బాధపడుతూనే గురువారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు.కాగా, పవన్ కుటుంబ సభ్యులు కూడా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నందున వైద్యుల సూచనలు తీసుకుంటున్నారు.

వరద నష్టం రూ.1,000 కోట్లు!

విజయవాడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కృష్ణానది, బుడమేరు వరద ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలో అపార నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ప్రాథమిక అంచనా ప్రకారం నష్టం రూ.1,000 కోట్ల వరకూ ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు, సేవలు అందించే ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు రూ.532.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వ్యవసాయం, ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్ వంటి శాఖల్లో భారీ నష్టం సంభవించింది. రవాణా రంగానికి రూ.34.50 కోట్లు, పర్యాటక రంగానికి రూ.20కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు 950 కిలోమీటర్ల మేర ధ్వంసమయ్యాయి. ఇంకా విద్యుత్తు, రెవెన్యూ, పంచాయత్ శాఖలకు సంబంధించి ప్రాథమిక నష్ట అంచనాలు రావాల్సి ఉంది. వీఎంసీకి భారీ నష్టం సంభవించే అవకాశం ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో అంతులేని పంట నష్టం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలో పొందుపరిచారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి రూ.200కోట్ల నష్టం సంభవించింది. జిల్లాకు తక్షణ సాయంగా రూ.125.12 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేసింది. అలాగే జిల్లావ్యాప్తంగా 800 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతినగా రూ.200 కోట్ల మేర నష్టం వాటిల్లింది. పూర్తిస్థాయి నష్ట అంచనాలను మరో రెండు రోజుల్లో ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధం చేయనున్నారు. కృష్ణానది వరదలతో భవానీ ద్వీపం మొదటిసారి పూర్తిగా మునిగిపోయింది. స్టార్ హోటల్‌ను తలపించేలా ఉండే నాలుగు కాటేజీలలోని ఖరీదైన ఫర్నిచర్, ఇతర ఉపకరణాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రోబోటిక్ పార్క్, మేజ్ గార్డెన్, మిర్రర్ మేజ్, వీడియో గేమ్ ఎరీనా, చైల్డ్ గేమ్ ఏరియా, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ ఎరీనా మునిగిపోయాయి. అలాగే హరిత బెర్మ్ పార్క్‌లో 30 కాటేజీలు నీట మునిగాయి. వీటిలోని ఖరీదైన సామగ్రి వరద నీటిలో నానిపోయింది. కాన్ఫరెన్స్ హాల్, బోటింగ్ యూనిట్ వంటివి పూర్తిగా మునిగిపోయాయి. పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కి రూ.20కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.

భారీగా ఆదాయం కోల్పోయిన రైల్వే

విజయవాడ రైల్వే డివిజన్ వరదల కారణంగా రూ.30కోట్ల మేర ఆదాయాన్ని నష్టపోయింది. డివిజన్ పరిధిలో 75శాతం రైళ్లను గత ఐదు రోజులుగా రద్దు చేశారు. ఈ కారణంగా రోజుకు సగటున రూ.3.79 కోట్ల చొప్పున రూ.19కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. గూడ్స్ పరంగా చూస్తే మరో 11 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. ఇక భారీవర్షాల కారణంగా రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) విజయవాడ రీజియన్ పరిధిలో రూ.2.50కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోవటంతో పాటు నష్టం వాటిల్లింది. నాలుగు రోజులుగా సగానికి పైగా బస్సులు తిరగకపోవటం వల్ల రూ.1.50 కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోయింది. విద్యాధరపురంలోని సీఎన్‌జీ ఐబీఎస్ ప్లాంట్, డీజిల్ బంక్ మునిగిపోవటంతో పాటు, 20కి పైగా బస్సులు 3 అడుగుల లోతు నీటిలోనే ఇంకా మునిగి ఉన్నాయి. డిపోల్లోకి వరద నీరు రావడంతో టూల్స్, స్పేర్ పార్టులు కొట్టుకుపోయాయి.

వరద బాధితుల ఇళ్ల వద్దకే సాయం

- ఉన్నతాధికారులతో మంత్రుల బృందం సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితుల ఇళ్ల వద్దకే సాయం అందించాలని మంత్రుల బృందం స్పష్టం చేసింది. బాధితులకు ఏ విధంగా సాయం అందించాలన్న దానిపై, ముఖ్యంగా నిత్యావసర సరుకుల పంపిణీపై చర్చించింది. మంత్రులు పి. నారాయణ, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్‌తో కూడిన బృందం అధికారులతో కలసి గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో దీనిపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

నేటినుంచి నిత్యావసరాల పంపిణీ: నాదెండ్ల

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద ముంపునకు గురైన బాధితులందరికీ శుక్రవారం వివిధ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సుమారు 2 లక్షల మంది లబ్ధిదారులకు సాయం అందించనున్నట్లు చెప్పారు. 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు వంటనూనె, కిలో పంచదార, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంపలను పంపిణీ చేస్తామని వివరించారు. వరదల బాధితులకు ఉచితంగా గ్యాస్ స్టవ్ మరమ్మతు సేవలు అందించేందుకు బీపీసీఎల్, హెచ్‌సీఎల్, ఐఓసీ కంపెనీలు 12 ప్రాంతాల్లో ఉచిత సర్వీసు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయని మంత్రి చెప్పారు.

అన్నివిధాలా ఆదుకుంటాం

నష్టం అంచనాలు అందగానే సాయం

- చంద్రబాబు, ఆయన బృందం 24 గంటలూ కష్టపడి పనిచేస్తున్నారు
- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద నష్టం అంచనాలు అందగానే కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం అందిస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలను అందిస్తారన్నారు. వరదలతో నష్టం భారీగా జరిగిందని, పంటలు కూడా బాగా దెబ్బతిన్నాయని, రైతులు చాలా నష్టపోయారని చెప్పారు. రాష్ట్రానికి పూర్తి మద్దతును కేంద్రం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి గురువారం రాత్రి ఆయన విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. 'నేను ఈ రోజు వరద నష్టం వాటిల్లిన ప్రాంతాలు తిరిగి చూశాను. ప్రకాశం బ్యారేజీకి వచ్చిన వరద గురించి తెలుసుకొన్నాను. మరింత వరద వచ్చినా తట్టుకొనేలా బ్యారేజీని పటిష్ఠపరుస్తాం. ఈ విషయం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకువెళ్తాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా జలప్రళయాన్ని విజయవాడ చవిచూసింది. విజయవాడ నగరంలో ఎవరూ ఊహించని రీతిలో కురిసిన 400 మి.మీ. వర్షపాతం వల్ల వరద విపత్తు సంభవించింది. కృష్ణా నది, బుడమేరు రెండూ ఒకేసారి పొంగడం సమస్యలు తెచ్చింది. చంద్రబాబు, ఆయన బృందం ఇరవై నాలుగు గంటలూ కష్టపడి పనిచేస్తున్నారు. కలెక్టరేట్‌నే రాష్ట్ర సచివాలయంగా మార్చుకొని ముఖ్యమంత్రి పనిచేయడం అభినందనీయం. డ్రోన్ల ద్వారా ఆహార ప్యాకెట్లు అందించడం దేశంలోనే మొదటిసారి. ఇంతటి జలప్రళయం సంభవించినా మృతుల సంఖ్యను తగ్గించడం గొప్ప విషయం.' అని చౌహాన్ వ్యాఖ్యానించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో వరద దృశ్యాలను ఆయన తిలకించారు. అంతకుముందు సీఎం, ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు.



మోకాలు లోతు నీళ్లలో వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రి లోకేశ్

వీలైనంత త్వరగా సాయం: కేంద్ర బృందం

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పరిస్థితులను, నష్టాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించి తక్షణ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర బృందం తెలిపింది. కేంద్రం హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్‌కుమార్ జిందాల్ నేతృత్వంలో ప్రత్యేక బృందం గురువారం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పర్యటించింది. వరద ప్రభావిత ప్రాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను పరిశీలించింది. ముంపు ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి వరద నష్టాన్ని అంచనా వేసింది. నష్టంపై నివేదికను కేంద్రానికి అందించి, వీలైనంత త్వరగా రాష్ట్రానికి తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని సంజీవ్‌కుమార్ జిందాల్ చెప్పారు. తొలుత తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. తర్వాత రాష్ట్ర అధికారులతో సమీక్ష నిర్వహించింది. భారీ వర్షాలు, వరదల వల్ల సంభవించిన పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయక, పునరావాస చర్యల గురించి అధికారులు వివరించారు. అనంతరం ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న గేట్లను బృందం పరిశీలించింది. బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం, ఇతర వివరాలను రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్, ఇంజనీర్ ఇన్-చీఫ్ వెంకటేశ్వరరావు వివరించారు. ఆ తర్వాత బుడమేరుకు పడిన గండ్లను, గండ్లను పూడ్చే పనులను కేంద్రబృందం పరిశీలించింది. ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న రెవెన్యూ, విపత్తుల శాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా... కేంద్ర బృందంతో పాటు ట్రాక్టర్‌పై వెళ్లి పరిస్థితి వివరించారు.

5.02 లక్షల ఎకరాల్లో పంట వరదార్పణం

- 341.29 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరం
- వ్యవసాయ, ఉద్యానశాఖల అంచనా

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో సంభవించిన వరదల వల్ల 5.02 లక్షల ఎకరాల్లో పంట నీటమునిగింది. ముంపుబారిన పడ్డ వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.341.29 కోట్లు అవసరమని ఆ శాఖలు లెక్కకట్టాయి. 16 జిల్లాల్లో 4,53,845 ఎకరాల వ్యవసాయ పంటలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.301.34 కోట్లు అవసరమని వ్యవసాయ శాఖ పేర్కొంది. 12 జిల్లాల్లో 48,632 ఎకరాల్లో ఉద్యాన పంటలు ముంపు బారిన పడ్డాయని, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.39.95 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అవసరమని ఆశాఖ అంచనా వేసిం ది. రాష్ట్రవ్యాప్తంగా 3,49,792.5 ఎకరాల వరికి రూ. 237.86 కోట్లు, 69,637.5 ఎకరాల పత్తికి రూ.47.35 కోట్లు, 14,347.5 ఎకరాల మొక్కజొన్నకు రూ.7.17 కో ట్లు, 7,587.5 ఎకరాల మినుముకు రూ.3.03 కోట్లు, 4,525 ఎకరాల కందికి రూ.1.80 కోట్లు, 3,390 ఎకరాల పెసరకు రూ.1.35 కోట్లు, 2,235 ఎకరాల వేరుశనగకు రూ.1.5 కోట్లు, 2,330ఎకరాల ఇతర పంటలకు రూ.1.73 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అవసరమని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అలాగే మిర్చి14,374, అరటి9,958, పసుపు 9,695, కూరగాయలు 5,642, కంద 3,305, నిమ్మ 2,987 ఎకరాల్లో ముంపు బారిన పడినట్లు ఉద్యానశాఖ అంచనా వేసింది.



గుంటూరు జిల్లా మున్నంగిలో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న పెమ్మసాని

కేంద్ర సాయం అందేలా కృషి

- బాబు రెప్ప వేయకుండా పనిచేస్తున్నారు: పెమ్మసాని

తెనాలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు కేంద్రం నుంచి వీలైనంత సాయం అందించేందుకు కృషి చేస్తానని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. వరదల నష్ట తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కృష్ణా నది వరదల కారణంగా గుంటూరు జిల్లాలో పంటలు నష్టపోయిన కొల్లిపర మండలంలోని లంక గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు.

"విపత్తును ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సఫలీకృతమైంది. సంబంధిత కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి, ప్రధానంగా రైతులకు అవసరమైన సాయం ఏ మేర ఉందనేది వివరిస్తా. పంట నష్టంతో పాటు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేందుకు కేంద్ర సాయాన్ని కోరుతా' అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా డ్యామ్‌లు, బ్యారేజీలను పట్టించుకున్న దిక్కేలేదని, వీటిపై శ్రద్ధ చూపి ఉంటే కచ్చితంగా ఇంత విపత్తు ఉండేది కాదని పెమ్మసాని విమర్శించారు. గత పాలకులు చేసిన పాపాన్ని రైతులు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం భరించాల్సి వస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కంటిపై రెప్ప వేయకుండా సహాయ చర్యలపై దృష్టి పెట్టారన్నారు. రికార్డు సమయంలో ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితిని తీసుకురాగలిగారన్నారు.



ప్రకాశం బ్యారేజీపై విరిగిన కౌంటర్ వెయిట్‌ను తొలగిస్తున్న దృశ్యం

ప్రకాశం బ్యారేజీలో దెబ్బతిన్న మరో కౌంటర్ వెయిట్

- మొత్తం నాలుగు మార్చాలని నిర్ణయం
- హైదరాబాద్‌లో సిద్ధమైన వెయిట్లు

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీలో మరో సిమెంటు దిమ్మె (కౌంటర్ వెయిట్) దెబ్బతిన్నట్లు గుర్తించారు. 67, 68, 69 నంబరు ఖానాలతో పాటు 66వ ఖానా వద్ద ఉన్న దిమ్మె కూడా దెబ్బతిందని.. పగుళ్లు ఉన్నాయని బెకెమ్ కంపెనీ బృందం గురువారం గుర్తించింది. ఈ సమాచారాన్ని హైదరాబాద్‌లో ఉన్న జాతీయ హైడ్రాలిక్ గేట్ల నిపుణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కన్నయ్యనాయుడికి తెలియజేసింది. దీనిని మరమ్మతు చేసే వీలున్నా.. భవిష్యత్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా 66వ ఖానా కౌంటర్ వెయిట్‌నూ మార్చేయాలని ఆయన సూచించారు. గురువారం దాని కొలతనూ తీసుకున్నారు. ఇక దెబ్బ తిన్న 67, 68, 69 ఖానాల వద్ద పాత కౌంటర్‌వెయిట్లను తొలగించారు. ఈ పనులను సీఈ కుమార్ పర్యవేక్షించారు. శుక్రవారం 66వ నంబరు వెయిట్‌ను కూడా తీసేస్తారు. ఇక 68, 69, 70 గేట్లను మూసేశారు. శుక్రారంనాడు 66, 67 గేట్లను కూడా మూసేస్తారు. 67, 68, 69 కౌంటర్ వెయిట్లు హైదరాబాద్‌లో సిద్ధమయ్యాయి. కన్నయ్యనాయుడు శనివారం వచ్చి.. ఆదివారం కొత్త కౌంటర్ వెయిట్‌లను అమర్చుతారు. అనంతరం ఆ గేట్లు మామూలుగా పనిచేస్తాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈలోపు బ్యారేజీలో చిక్కుకున్న బోట్లను తొలగిస్తారు. ఇందు కోసం ఒక భారీ మరపడవను సిద్ధం చేస్తున్నారు. ప్రవాహ దిశకు ఎదురెళ్లి ఆ బోట్లను మరపడవకు కట్టి లాగాలని నిర్ణయించారు.


కండ్రికలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వాహనం వద్ద జనం


వరద నీటిలోనే ఉన్న పాయకాపురం ప్రధాన రోడ్డు


వరద నీటిలో పేరుకుపోయిన చెత్త, ఇతర వస్తువులు

సాయం... ముమ్మరం!

సాధారణ పరిస్థితులు నెలకొల్పే చర్యలు

బెజవాడకు మళ్లీ వర్షం టెన్షన్

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్ప పీడనం ప్రభావంతో మళ్లీ వర్షాలు ఉంటాయని వాతావరణ నిపుణుల నుంచి వస్తున్న హెచ్చరికలు విజయవాడను భయపెడుతున్నాయి. విజయవాడ నగరంలో వరద నీరు వేగంగా తగ్గిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇంకా మూడు, నాలుగు అడుగుల ఎత్తున నిలబడి ఉంది. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఈ ప్రాంతాల్లో నీటి నిల్వ ఒక అడుగు పెరిగినట్లు గుర్తించారు. ఎగువన ఖమ్మం జిల్లాలో కూడా ఈ వర్షం భారీగా ఉంది. దీంతో మళ్లీ వరద వచ్చి విజయవాడను ఇబ్బంది పెడుతుందేమోనన్న ఆందోళన అధికార యంత్రాంగంలో కనిపిస్తోంది. అదే జరిగితే నిలువరించడానికి వీలుగా అప్రమత్తమై పనిచేస్తోంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో రాబోయే మూడు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం రాత్రి విజయవాడ చుట్టుపక్కల కుంభవృష్టి కురిసింది. ఖమ్మం జిల్లాలో వర్షం భారీగా ఉండటంతో బుడమేరుకు మళ్లీ వరద ప్రవాహం మొదలైంది.

కొంత దిగువన.. కొంత నదిలోకి..!

బుడమేరులోకి వచ్చిన వరద మళ్లీ విజయవాడ నగరంపై పడకుండా ఏం చేయాలన్నదానిపై అధికారులు దృష్టి సారించారు. కొంత నీటిని దిగువకు పంపిస్తూ మరికొంత నీటిని కృష్ణా నదిలోకి పంపాలన్నది ప్రభుత్వ వ్యూహం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌తో గురువారం కొందరు సీనియర్ అధికారులు సమావేశమై చర్చించారు. బుడమేరు వాగుకు గండ్లు పడినందునే వరద విజయవాడలోకి వచ్చి కొన్ని ప్రాంతాలను ముంచెత్తింది. ఇప్పుడు బుడమేరుకు మళ్లీ వరద వస్తే ఈ గండ్ల నుంచి తిరిగి నీరు విజయవాడలోకి వచ్చే ప్రమాదం పొంచి ఉంది. మొత్తం మూడు గండ్లలో రెండు పూడ్చివేశారు. మూడోది శుక్రవారం పూర్తయ్యే అవకాశం ఉంది. ఈలోపే మళ్లీ ఎగువ నుంచి బుడమేరుకు వరద వస్తే ఎలా అన్నది అధికారులను కలవరపెడుతోంది.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ముంపులో మునిగి, బురద పేరుకుపోయి కష్టాల కడలిలా మారిన వరద బాధిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా సర్కారు ముమ్మర చర్యలు తీసుకుంటోంది. సహాయ చర్యల్లో వేగం పుంజుకొంది. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు.. పెద్ద ఎత్తున దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆహారం, పాలు, నీరు అందించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో ఆహార పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. పొరుగునున్న తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా ఆహారం, తాగు నీరు తీసుకొచ్చి ఇక్కడ పంపిణీ చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారికి మందులు అందించేందుకు ఇరవై '104' అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. మార్కెటింగ్ శాఖ మొబైల్ రైతు బజార్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. కిలో రూ.2, 5, 10 కే వివిధ రకాల కూరగాయలను అందిస్తున్నారు. పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మంది కార్మికులు పారిశుధ్య యజ్ఞంలో నిమగ్నమయ్యారు. మరోవైపు 25 డ్రోన్లతో బ్లీచింగ్ లిక్విడ్స్‌ను స్ప్రే చేయిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు వివిధ మునిసిపాలిటీల నుంచి సుమారు వెయ్యి ట్యాంకర్లను తెప్పించారు. వీటి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో విజయవాడ నగర పాలక సంస్థ నీటి సరఫరాను పునరుద్ధరిస్తోంది. అయితే, ఆ నీటిని తాగవద్దని, ఇతరత్రా అవసరాలకు వాడుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర ప్రజలకు సూచించారు. బాధితుల నివాసాలు, రహదారులపై పేరుకుపోయిన బురద మేటను ఫైర్ ఇంజన్లతో శుభ్రం చేస్తున్నారు. సింగ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు వెళ్లే బాధితుల కోసం 179 ఆర్టీసీ బస్సులను ఉచితంగా తిప్పేలా ఏర్పాట్లు చేశారు.

బాధితులకు పాలు, నీరు, ఆహార సరఫరా
104 అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలు
పారిశుధ్య యజ్ఞంలో పదివేల మంది కార్మికులు
బాధితులకోసం 179 ఉచిత బస్సులు

ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ..

మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. ఆహారం, పాలు, తాగునీరు సరిగా అందుతుందో లేదో పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని బాధితుల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేస్తున్నారు. మునిసిపల్ మంత్రి నారాయణ గురువారం వరద నీటిలో సుమారు 2 కిలోమీటర్లు నడుస్తూ పరిస్థితిని సమీక్షించారు. మంత్రి సవిత.. రాజరాజేశ్వరి పేటలో పర్యటించారు. విజయవాడ నార్త్ ఏసీపీ డి.రాజారాం, సత్యనారాయణపురం సీఐ బాబ్జీతో కలిసి లోతట్టు ప్రాంతాల్లోని బాధితులను తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా... మంత్రి కూడా వారితో ట్రాక్టర్ ఎక్కారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్దకు తీసుకొచ్చి బంధువులకు అప్పగించారు. మంత్రి పార్థసారథి కృష్ణలంకలోని వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు.

లైన్‌మెన్ కుటుంబానికి 25 లక్షలు

- మృతుడి భార్యకు ఉద్యోగ నియామక పత్రం అందజేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విధులు నిర్వర్తిస్తూ వరదలో కొట్టుకుపోయి మరణించిన లైన్‌మెన్ వజ్రాల కోటేశ్వరరావు కుటుంబానికి రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.25 లక్షలు అందజేశారు. మంత్రితోపాటు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు గురువారం వజ్రాల కోటేశ్వరరావు ఇంటికి వెళ్లి పరిహారం అందించారు. అదేవిధంగా సంస్థ నుంచి కోటేశ్వరరావుకు రావాల్సిన రూ.13లక్షలను మంత్రి అందజేశారు. పిల్లల చదువుకు ఏటా రూ.25 వేలు సాయం అందిస్తామని ప్రకటించారు. దీంతోపాటు కోటేశ్వరరావు భార్యకు విద్యుత్ సంస్థలో ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేశారు. విద్యుత్ సంస్థల ఉద్యోగుల భద్రతపై మంత్రి గొట్టిపాటి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మృతి చెందిన లైన్‌మెన్ ఇంటికి మంత్రి స్వయంగా వెళ్లి పరిహారం అందజేయడంపై విద్యుత్ సంస్థల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వరద ప్రభావ ప్రాంతాలలో పంపిణీ చేసిన పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత


మిల్క్ ఫ్యాక్టరీ రోడ్డులో సంచార రైతు బజారు వాహనంలో తక్కువ ధరకు కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం


వరద ప్రభావిత ప్రాంతాల్లో హోమియోపతి మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


విజయవాడలోని కేఎల్ రావు పార్కు, బ్యాక్‌సైడ్ కాలనీలో రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు


వైఎస్ఆర్ కాలనీలో వరద నీటిలో థర్మోకోల్‌పై మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

33కి చేరిన మృతులు

- ఎన్టీఆర్ జిల్లాలోనే 25 మంది.. 275 పశువులు, 59,975 కోళ్లు మృతి
- వరదలకు 3,756 కి.మీ. ఆర్‌అండ్‌బీ రోడ్లు 348 కి.మీ. పంచాయతీ రోడ్లు ధ్వంసం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 33కు చేరింది. ఎన్టీఆర్ జిల్లాలోనే 25 మంది మరణించారు. గుంటూరు జిల్లాలో ఏడుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు చనిపోయారు. ఎన్టీఆర్ జిల్లాలో గల్లంతైన ఇద్దరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్‌బీ రోడ్లు 3,756 కిలోమీటర్ల పొడవున దెబ్బ తిన్నాయని తేలింది. పంచాయతీ రాజ్ రోడ్లు 348 కిమీ దెబ్బతిన్నాయి. విజయవాడతో సహా వివిధ పట్టణాల్లో 533.57 కిమీ రోడ్లు దెబ్బతిన్నాయని గుర్తించారు. 33 మంచినీటి పథకాలు దెబ్బతిన్నాయి. 1,69,370 హెక్టార్లలో వ్యవసాయ, 19,453 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. 46.22 హెక్టార్ల ఆక్వా చెరువులు దెబ్బతిన్నాయి. 275 పశువులు, 59,975 కోళ్లు మృత్యువాతపడ్డాయి. 403 మత్స్యకార బోట్లు పూర్తిగా, 26 పాక్షికంగా దెబ్బతిన్నాయి. 414 వలలు పాడైపోయాయి. వరదల కారణంగా గత ఐదురోజుల్లో విజయవాడలో 339 రైళ్లు రద్దు కాగా, 181 రైళ్లను దారి మళ్లించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. విజయవాడ సహా ఎన్టీఆర్, గుంటూరు, కృష్ణా, ఏలూరు, పల్నాడు జిల్లాల్లో 214 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయగా, 45,369 మంది పునరావాసం పొందుతున్నారు. 158 వైద్యశిబిరాల్లో సేవలు అందిస్తున్నారు. 344 మంది గర్భిణులను వైద్యశాలలకు తరలించారు. 50 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, నేవీ బృందాలు, ఆరు హెలికాప్టర్లు, 228 బోట్లతో పాటు 315 మంది గజ ఈతగాళ్లు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. కంట్రోల్ రూమ్‌లు, స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌కు వస్తున్న ఫోన్‌కాల్స్‌కు అధికారులు స్పందించి బాధితులకు సహాయం అందించారు. ముంపులో ఉన్న కుటుంబాలకు పాలు, అల్పాహారం, భోజనం, బిస్కెట్లు వంటివి అందజేస్తున్నారు. విజయవాడలో ఫైరింజన్లతో ఇళ్ల ముందు బురదను శుభ్రం చేస్తున్నారు. పాడైన వాటర్ పైపులైన్లకు రిపేర్లు చేస్తున్నారు. ట్యాంకులు, కాలువలు, వాగులకు పడిన గండ్లను పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ముంచింది జగనే!

(మొదటి పేజీ తరువాయి)

కట్టలు మరింత బలోపేతమయ్యేవి. అది జరగనందునే నేడు ఈ విపత్తు.

జల విలయానికి శ్రీకారం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే రాష్ట్రంలో జల విలయానికి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. తొలుత పోలవరం ప్రాజెక్టు పనుల కాంట్రాక్టు సంస్థను రద్దు చేశారు. ఆ వెంటనే చంద్రబాబు హయాంలో బుడమేరుతో సహా రాష్ట్ర జల వనరుల శాఖ చేపట్టిన 198 అభివృద్ధి పనులను అర్థంతరంగా ఆపేస్తూ 2020 సెప్టెంబరు 8న ఆదేశాలు జారీ చేశారు. ఆ ఉత్తర్వులో ఏముందంటే.. ఉత్తరాంధ్రలో 12, గోదావరి డెల్టాలో 24, పోలవరం ప్రాజెక్టులో 7, కృష్ణా డెల్టా సిస్టమ్‌లో 51, ఒంగోలులో 2, ఎన్టీఆర్ తెలుగుగంగలో 25, కర్నూలులో 9, కడపలో 14, మైనర్ ఇరిగేషన్‌లో 16, అనంతపురంలో 18 చొప్పున మొత్తంగా 198 పనులు ముందస్తుగా రద్దు (ప్రీక్లోజర్) చేశారు. అధికారుల నుంచి ఎలాంటి నివేదికలు లేకున్నా జగన్ ఏకపక్షంగా పనులన్నింటినీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సాగునీటికి సంబంధించి జరుగుతున్న కీలకమైన పనులన్నింటినీ వెంటనే నిలిపివేయాలని నాటి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌ను ఆదేశించారు. ఈ విధంగా ఆపేసిన పనులను తన హయాంలో మళ్లీ ప్రారంభించే ఆలోచన కూడా చేయలేదు. రివర్స్ టెండరింగ్ అంటూ హడావుడి చేయడమే తప్ప దానితో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయారు.

కీలక దశలో బుడమేరు పనులు రద్దు

ముందూ వెనకా ఆలోచించకుండా జగన్ ఆపేసిన పనుల్లో బుడమేరు కాలువ ఆధునీకరణ పనులు కూడా ఉన్నాయి.

- ప్యాకేజీ నం. 15-1-4గా పేర్కొన్న బుడమేరు ప్రధాన కాలువ 24.000 కి.మీ. నుంచి 42.500 కి.మీ. వరకూ (ఎనికేపాడు) ఈపీసీ విధానంలో రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు పనులు అప్పగించారు. ఈ పనులను మధ్యలోనే ఆపేయడంతో కాలువ మరింత అధ్వాన్న స్థితికి చేరుకుంది. ప్రస్తుత బుడమేరు విలయంలో దెబ్బతిన్న సింగ్‌నగర్, రాజరాజేశ్వరీపేట తదితర ప్రాంతాలు ఈ పనుల పరిధిలోనే ఉన్నాయి.
- ప్యాకేజీ నం.15-1-4 పార్ట్ వర్క్ కింద బుడమేరు కాలువ పనులను ఎనికేపాడు వరకూ గుడివాడకు చెందిన ఎస్ఏఎస్ ఆబు కన్‌స్ట్రక్షన్ చేపట్టింది. ఈ పనులనూ అర్థంతరంగా ఆపేశారు.
- ప్యాకేజీ 15-1-5 కింద బుడమేరు ప్రధాన కాలువ పనులు 42.500 కిలోమీటర్ల నుంచి 50.600 కిలోమీటర్ల వరకూ ఎనికేపాడు ముందు వరకూ విస్తరణ పనులను హైదరాబాద్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ చేపడుతోంది. ఈ పనులనూ ముందుకు సాగకుండా జగన్ ఆపేశారు.
- ఇదే ప్యాకేజీలోని కొంతభాగాన్ని గుడివాడకు చెందిన ఎస్ఏఎస్ బాబు కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించారు. ఈ పనులన్నీ పూర్తయితే బుడమేరుకు ఎంత వరద వచ్చినా తట్టుకునేది. విజయవాడ నగరం సగం మునిగిపోయేది కాదు. దాదాపు 6లక్షల మంది నిరాశ్రయులయ్యేవారు కాదు.

చేసిన పాపం దాచేసి..

అధికారంలో ఉన్నప్పుడే చేయాల్సినదంతా చేసేసి ఇప్పుడేమో చంద్రబాబు నివాసం మునిగిపోకుండా ఉండేందుకే బుడమేరు చానల్ ఓపెన్ చేశారంటూ జగన్ ఆరోపిస్తున్నారు. బుడమేరు ఆధునీకరణ పనులు నిలిపేసి, అంతా చంద్రబాబు తప్పంటూ మాట్లాడుతున్నారు. అయితే బుడమేరుతో సహా 198 పనులను జగన్ నిలిపేసిన విషయం ఉత్తర్వుతో సహా బయటపడటంతో బుడమేరుకు జగన్ శాపంలా మారారని అందరికీ అర్థమైంది. ఆధారాలతో సహా ఆయన చేసిన నిర్వాకం రుజువైనందున వరద నష్టానికి జగన్ బాధ్యత వహిస్తారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జల వనరుల ప్రాజెక్టుల పనులను నిలిపివేసి బుడమేరు, అన్నమయ్య, పోలవరం ప్రాజెక్టులకు శాపంగా మారిన జగన్ ఇప్పుడు ప్రజలను నమ్మించి మోసగించాలని చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుడమేరు పనులు చేపట్టాలనుకున్నా కరోనా కారణంగానే పనులు ముందుకు సాగలేదంటూ తన రోత పత్రికలో రాయించుకుంటున్నారు. వాస్తవానికి కరోనా ప్రభావం పోయి మూడేళ్లు దాటింది. ఈ మూడేళ్లలో బుడమేరు పనులు ఎందుకు చేపట్టలేదో జగన్ వివరించాలన్న డిమాండ్ వస్తోంది. జగన్ జారీ చేసిన జీవో 365ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే యోచనలో రాజకీయపక్షాలు ఉన్నాయి.

వరద ప్రాంతాల్లో కరెంటు బిల్లుల వసూలు వాయిదా: సీఎం

అమరావతి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వరద ప్రాంతాల్లో ఈ నెల కరెంటు బిల్లుల వసూలు వాయిదా వేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'వరదల్లో పాడైపోయిన వాటి మరమ్మత్తులకు రేట్లను ప్రభుత్వమే ఖరారు చేయాలని నిర్ణయించాం. ఎవరికి ఇష్టం వచ్చిన రేట్లు వాళ్ళు డిమాండ్ చేసి ప్రజలను దోచుకోకుండా చూడాలని అనుకొంటున్నాం. వాహనాల రిపేర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల రిపేర్లు, గ్యాస్ స్టవ్‌ల రిపేర్లు... ఇలా ఏ రిపేర్‌కు అయినా ఒక రేటును ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఆన్ లైన్‌లో ఇటువంటి సేవలు అందించేవారితో కూడా మాట్లాడుతున్నాం. ఫైర్ ఇంజన్లు ఈ రోజు ఐదు వేల ఇళ్ళు శుభ్రం చేశాయి.

శాంతించిన కృష్ణమ్మ..

పెరుగుతున్న బుడమేరు

అమరావతి/విజయవాడ/శ్రీశైలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ శాంతిస్తున్నప్పటికీ బుడమేరు మాత్రం శాంతించడం లేదు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వస్తున్న నీరు పూర్తిగా తగ్గుముఖం పడుతోంది. బ్యారేజీకి 1,35,452 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. దీనిని పూర్తిగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజీ 70 గేట్లలో రెండింటిని పూర్తిస్థాయిలో ఎత్తి ఉంచారు. 55 గేట్లను మూడు అడుగులు, పది గేట్లను రెండు అడుగుల మేరకు ఎత్తారు. మూడు గేట్లను పూర్తిగా మూసివేశారు. బుధవారం రాత్రి మైలవరం, రెడ్డిగూడెం, గంపలగూడెం, తిరువూరు ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసింది. ఈ నీరంతా బుడమేరు కాలువకు వస్తోంది. దీంతో అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో బుడమేరు కాస్తంత ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా.. శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి మళ్లీ వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం 1,22,062 క్యూసెక్కులు వచ్చింది. దీంతో ఒక క్రస్టుగేటు ఎత్తి 27,937 క్యూసెక్కులను, ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,708 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కులు.. మొత్తం 95,761 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 213.88 టీఎంసీలుగా నమోదైంది. నాగార్జున సాగర్ నుంచి దిగువకు 66,288 క్యూసెక్కులను వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 30,401 క్యూసెక్కులు వస్తుండగా.. ముందస్తు చర్యల్లో భాగంగా 57,456 క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి వదిలేస్తున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన.. మధ్య కోస్తాలో ఒక మాదిరి

విశాఖపట్నం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోస్తా పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు, మూడు రోజుల్లో ఉత్తరంగా పయనించే క్రమంలో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించి వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉత్తర కోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం కోస్తా, సీమల్లో అనేకచోట్ల వర్షాలు, శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాంధ్రలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా శుక్ర, శనివారాల్లో ఉత్తర కోస్తాపై ఎక్కువ ప్రభావం చూపుతుందని, మధ్య కోస్తాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు.


వైఎస్సార్ కాలనీలో వరద నీటిలో తరలి వెళ్తున్న ఓ కుటుంబం


విజయవాడలోని అంబాపురం మెయిన్ రోడ్డులో గురువారం కూడా నడుం లోతు నీళ్లలో వెళ్తున్న స్థానికులు


గర్భిణిని తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది




తీరని కష్టం!

(మొదటి పేజీ తరువాయి)

పట్టింది. వాంబే కాలనీ, సుందరయ్య నగర్, రాజీవనగర్, కండ్రిక, పాతపాడులోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నడుం లోతు నీళ్లు ఉన్నాయి. వరద తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటూ జరిగిన నష్టాన్ని అంచనా వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాపారులు షట్టర్లు ఎత్తి వరద కారణంగా తడిచి ముద్దయిన వస్తువుల్లో పనికి వచ్చే వస్తువులను ఆరబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషిన్, కూలర్, ఏసీల వంటి ఉపకరణాలు నీళ్లలో మునిగిపోయాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు తిరిగి పనిచేసే అవకాశమే లేదు. కొంతమంది ఇళ్లలో ఖరీదైన ఫర్నీచర్ కొట్టుకుపోయింది. రెండు మూడు రోజులపాటు నీళ్లలో నానడంతో ఇంట్లో ఉన్న వస్తువులేవీ పనికొచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ఇక బైకులు, కార్ల సంగతి సరేసరి! వేల వాహనాలు ఇప్పుడు షెడ్డుకు వెళ్లక తప్పదు.

పైసాపైసా పోగేసుకుని...



తమ్మిన రమేశ్.. రోజువారీ కూలీ. భార్య ఇద్దరు పిల్లలు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్ దిగువన ఉన్న రైతు బజార్ వెనుకే నివసిస్తున్నారు. పైసాపైసా దాచుకుని కూడబెట్టుకున్న వస్తువులన్నీ బుడమేరు వరదకు నాశనమైపోయాయి. చివరికి ఇంజనీరింగ్ చదివే బిడ్డ పుస్తకాలు, ల్యాప్‌టాప్ కూడా పాడయ్యాయి. సంవత్సరాల తరబడి కష్టపడి కూడబెట్టుకున్నవన్నీ వరదపాలయ్యాయని రమేశ్ కుటుంబం వాపోతోంది.

కళ్ల నీళ్లు...



పఠాన్ అస్మాన్ ఖాన్ అజిత్‌సింగ్ నగర్ వాసి. ఫైపుల రోడ్డులో రిజ్వాన్ ఆప్టికల్స్ పేరుతో కళ్లజోళ్ల షాపు నడుపుతున్నారు. అందులోనే కంటి పరీక్షలు చేసే కంప్యూటరైజ్డ్ మిషన్ కూడా ఉంది. ఈ షాపే ఆయన జీవనాధారం. బుడమేరు వరదతో షాపు మొత్తం నీట మునిగింది. వరద నీరు తగ్గడంతో గురువారం షాపు తెరిచారు. మిషన్లను, కళ్లజోళ్లను, ఫ్రేములను బురద కమ్మేసింది. ఈ పరిస్థితి చూసి అస్మాన్ కళ్లలో నీళ్లు తిరిగాయి.

కొన్నేళ్ల కష్టం.... వరదపాలు

పెద్ది ఉమామహేశ్వరరావు సొంతూరు శ్రీకాకుళం జిల్లా సంతగడు మండలం. ఏడెనిమిది సంవత్సరాల క్రితం ఉపాధి కోసం విజయవాడకు వచ్చారు. కార్పెంటర్ పని చేసుకుంటూ వాంబేకాలనీ 'ఎ' బ్లాక్ వీధిలో రెండు గదుల ఇంటిని కొని సొంత గూడును ఏర్పాటు చేసుకున్నారు. బుడమేరు వరద ఆ ఇంటిని ముంచేసింది. బీరువా, ఫ్రిజ్, కూలర్, వాషింగ్ మిషన్ అన్నీ నీటిలో మునిగిపోయాయి. వరద నీరు రావడంతో నాలుగు రోజులపాటు మేడ మీద ఉమామహేశ్వరరావు కుటుంబ సభ్యులు.. గురువారమే కిందికి దిగారు.

సర్వం కోల్పోయాం: నాగలక్ష్మి, వాంబేకాలనీ

మాది చిన్న కుటుంబం. కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాం. వాంబే కాలనీలో అద్దెలు తక్కువ కావడంతో కొద్ది నెలల కిందటే ఇక్కడికి వచ్చాం. కింది అంతస్తులో నివాసం ఉంటున్నాం. వరద చుట్టుముట్టడంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ వదిలేసి.. కట్టుబట్టలతో మొదటి అంతస్తులోకి వెళ్లిపోయాం. నాలుగు రోజుల తర్వాత కిందికి దిగాం. మా ఇల్లు ఇంకా నీటిలోనే ఉంది. జీవనోపాధి కోసం కొన్నాళ్ల కిందటే కొన్న పిండి గ్రైండర్ పాడైపోయింది. వస్తువులన్నీ ధ్వంసమయ్యాయి. మళ్లీ వీటిని సమకూర్చుకోవడం మామా వల్ల కాదు.

షాపు, ఇల్లూ ధ్వంసం...



అద్దంకి అప్పారావు, వరద నీరు లోపలికి రాకుండా తడిసిన బియ్యం బస్తాలు అడ్డు

ఆయన పేరు అద్దంకి అప్పారావు. విజయవాడ రాజీవ్ నగర్‌లో రేషన్‌షాపు డీలర్. ఈయన దివ్యాంగుడు. ఈయన భార్య కూడా దివ్యాంగురాలే. ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చిన్న ప్రవాహంగా బుడమేరు వరద మొదలైంది. వారున్న వీధి చివరే వీరి రేషన్ షాపు ఉంటుంది. షాపు లోతట్టున ఉండటంతో... వరద నుంచి కాపాడుకునేందుకు బియ్యం బస్తాలను ఇంట్లోని గదిలోకి మార్పించారు. దీని కోసం కూలీలకు రూ.6 వేల వరకు ఖర్చు పెట్టారు. తీరా చూస్తే ఇల్లు కూడా మొత్తం మునిగిపోయింది. రేషన్ బియ్యం మొత్తం తడిసిపోయాయి. ఆయన నివాసంలో కట్టుకునే బట్టలు కూడా లేకుండా మొత్తం బురదమయమైపోయాయి.



బుడమేరుతో 'బండి' కష్టాలు

షెడ్డులకు క్యూ కడుతున్న వాహనాలు.. బీమా వర్తించదంటున్న కంపెనీలు

- అర్జెంట్ అంటే కుదరదంటున్న మెకానిక్‌లు
- బైకైతే వేలల్లో... కారైతే లక్షల్లో ఖర్చు
- తలలు పట్టుకుంటున్న వాహన యజమానులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'అన్నా.. నా బండి రిపేర్ చేయ్యాలి. అర్జెంటు అన్నా. ఇది లేకపోతే ఉద్యోగమే లేదు.' 'ఇప్పుడు కాదన్నా. కనీసం 10 రోజులు పడుతుంది. చాలా బళ్లు ఉన్నాయి.' ఇది ఇప్పుడు బెజవాడ నగరంలో మెకానిక్‌లకు, బైక్ యజమానులకు మధ్య జరుగుతున్న సంభాషణ. ముంచెత్తిన వరదలో వేలాది బైకులు రెండు మూడు రోజుల పాటు నానాయి. దీంతో ద్విచక్ర వాహనాలు స్టార్ట్ కావట్లేదు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి నగరంలోని మెకానిక్‌ల వద్దకు వందలాది మంది తమ ద్విచక్ర వాహనాలు తీసుకొస్తున్నారు. విజయవాడ శివారు ప్రాంతాల్లోని అజిత్‌సింగ్ నగర్, రాజరాజేశ్వరి పేట, జక్కంపూడి కాలనీ తదితర ప్రాంతాల నుంచి బైకులు తీసుకుని నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, ఏలూరు రోడ్డు, మాచవరం, గుణదల తదితర ప్రాంతాల్లోని మెకానిక్‌ల వద్దకు వస్తున్నారు. ఒక్కసారిగా వందలాది బైకులు మరమ్మతుకు రావడంతో మెకానిక్‌లు తమవల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. నగరంలోని మెకానిక్ షాపులన్నీ పార్కింగ్ ప్రదేశాలను తలపిస్తున్నాయి. ఇక్కడకు వస్తున్న వాహన యజమానుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కోరకమైన కష్టం.

కార్లదీ ఇదే పరిస్థితి

వరద బీభత్సానికి కార్లూ భారీగా పాడయ్యాయి. ఐదారు అడుగుల మేర బుడమేరు వరద నీరు రావడతో మొత్తం కార్లు మునిగిపోయి కదలకుండా ఆగిపోయాయి. బుధవారం వరద నీరు తగ్గడంతో వాటిని స్టార్ట్ చేసేందుకు యజమానులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో నగరంలోని కార్ల షోరూమ్‌ల వద్దకు యజమానులు క్యూ కడుతున్నారు. 'ఇప్పటికిప్పుడు అంటే కుదరదు. మరో రెండు రోజులు పడుతుంది. సర్వీసింగ్ సెంటర్లు ఖాళీ లేవు. గురు, శుక్రవారాలకు సరిపడా కార్లు ఇప్పటికే ఉన్నాయి. ఆ తర్వాత వినాయకచవితి, ఆదివారం సెలవు. సోమవారం అయితే తీసుకొచ్చి 'చేస్తాం' అంటూ సర్వీసింగ్ సెంటర్ల యజమానులు చెపుతున్నారు. ప్రకృతి విపత్తు కావడంతో ఇన్సూరెన్స్ వర్తించబోదని, నీటిలో రెండు, మూడు రోజుల తడిచిన కారు షోరూమ్‌కు వస్తే ఇంజిన్, బ్రేక్ డ్రమ్, వైరింగ్ సిస్టమ్ మొదలు కొని సీట్లు, ఆడియో సిస్టమ్ వరకూ అన్నీ పరిశీలించి రిపేరీ చేయడం లేదా మార్చడం తప్పదంటున్నారు. కనీసం రూ.లక్ష నుంచి రూ.రెండున్నర లక్షల వరకూ ఖర్చయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. బుడమేరు వరదకు విజయవాడలో కనీసం మూడు వేలకు పైగా కార్లు నీటిలో చిక్కుకు పోయాయని సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారి ముత్యాల అనిల్ కుమార్ చెప్పారు. భరించలేక యజమానులు విక్రయిం చేందుకు వస్తున్నారని అన్నారు.



సత్వరమే వాహనాల క్లెయిములు

- బీమా కంపెనీలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ, అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల పెద్ద సంఖ్యలో వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వాహన బీమా ఉండి నష్టపోయిన వాహనదారులకు మద్దతుగా నిలవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ బీమా కంపెనీలకు గురువారం ఆదేశాలు జారీచేసింది. ప్రత్యేక శిబిరాలు నిర్వహించి క్లెయిముల ప్రక్రియను సులభతరం చేయాలని సూచించింది. క్లెయిములు త్వరగా సెటిల్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. నష్టపోయిన వాహనదారులు సంప్రదించాల్సిన నోడల్ అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లను వివిధ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించింది. బీమా కవరేజీ ఉండి ముంపునకు గురైన వాహనాలకు 10 నుంచి 12 రోజుల్లో పరిహారం అందేలా చూస్తున్నామని సీఎం చంద్రబాబు రెండ్రోజుల క్రితం చెప్పారు. ఈ మేరకు ఆయన బ్యాంకర్లు, బీమా కంపెనీలతో బుధవారం మాట్లాడారు. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించింది. వరదల్లో వాహనాలు నష్టపోయిన వారికి సత్వరమే క్లెయిమ్‌లు సెటిల్ చేయాలని ప్రభుత్వ రంగ బీమా కంపెనీలను ఆదేశించింది.

మార్కెటింగ్ జాబ్... బైకేమో రిపేర్

'నాది మార్కెటింగ్ ఉద్యోగం. రోజూ తిరగాల్సిందే. బైకు ఇంజిన్ పాడైంది. వరదల్లో మునిగితే బీమా వర్తించదట. రిపేరు చేయించాలంటే రూ.18 వేలు అవుతుంది అంటున్నారు. ఎలా చేయాలో దిక్కుతోచడం లేదు. పోనీ అప్పు చేసైనా డబ్బులు ఇద్దామంటే మెకానిక్‌లు వారం రోజులైనా ఇవ్వలేం అంటున్నారు. దిక్కు తోచడం లేదు.'

- శివ, సింగ్‌నగర్

ఒక్క రోజే 45 బళ్లు వచ్చాయి

'30 సంవత్సరాలుగా ఇదే పని చేస్తున్నా. ఎప్పుడూ 10 బండ్లకు మించి రాలేదు. ఈ రోజు 45 బైకులొచ్చాయి. రాత్రింబవళ్లు చేసినా నెల రోజుల పని ఉంది. ఇంజిన్‌లోకి నీరు చేరింది. వైరింగ్ సిస్టమ్ పాడైంది. ఇవన్నీ చేయాలంటే బాగా ఖర్చవుతుంది. బైకు పాతదైతే చేయించుకోక పోవడమే మంచిదని వచ్చిన వారికి చెబుతున్నా.'

- గోపి, బైక్ మెకానిక్, మాచవరం

కొత్త బైకు... బీమా రాదంటున్నారు

'నాది కొత్త బైకు. 14 నెలలైంది కొనుగోలు చేసి. ఇన్సూరెన్స్ ఉన్నా ఇలాంటి వాటికి రాదంటున్నారు. షోరూమ్‌లో చేయించాలంటే రూ.26 వేలు అవుతుందని చెప్పారు. మెకానిక్ అయితే తగ్గుతుందని బీఆర్‌టీఎస్ రోడ్డుకు వచ్చా. ఇక్కడేమో ఇప్పుడే చేయలేం అంటున్నారు. బండి లేకుంటే ఉద్యోగానికి వెళ్లడం కుదరదు. ఇప్పటికే నాలుగు రోజులు పోయాయి. ఇంకా డ్యూటీ పోతే అటు జీతం తగ్గి, ఇటు బండి ఖర్చు మీదపడి కోలుకోవడం కష్టంగా ఉంటుంది.'

- మూర్తి, రాజరాజేశ్వరిపేట

మేము సైతం..

బాధితులకు అండగా కదులుతున్న దాతృత్వం

- ఏపీ జేఏసీ అమరావతి 120 కోట్ల భారీ విరాళం
- రూ.కోటి ఇచ్చిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- స్పందిస్తున్న సంఘాలు, పరిశ్రమలు, దాతలు, టీడీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



చంద్రబాబుకు లేఖను అందజేస్తున్న ఉద్యోగ సంఘం నేతలు బొప్పరాజు తదితరులు

వర్షాలు, వరదలతో అతలాకుతలమైన రాష్ట్ర ప్రజలను, ప్రత్యేకంగా విజయవాడ వాసులను ఆదుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ పరిశ్రమలు, దాతలు, రాజకీయ నేతలు, ప్రజలు స్పందిస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం రూ.120 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన లేఖను ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర ప్రతినిధులు గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందించారు. జేఏసీ పరిధిలోని 90 ప్రభుత్వ సంఘాలు, ఆర్టీసీ, కోఆపరేటివ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చాయి. బొప్పరాజు మాట్లాడుతూ.. 'ఉద్యోగుల సమస్యలపై చేపట్టిన చలో విజయవాడ సందర్భంగా విజయవాడ ప్రజలు మాకు అండగా ఉన్నారు. వాకి ఔదార్యం మేం మరిచిపోలేం. ఉద్యోగులకు మంచినీళ్లు, మజ్జిగ, పాలు వంటివి అందించారు. ఈ రోజున మాకు రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది' అని అన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, సంఘం మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి, ఆర్టీసీ నేత లు జీవీ నరసయ్య ఉన్నారు.

ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘం...

ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘం జేఏసీ.. రూ.8.10 కోట్లను సీఎం సహాయ నిధికి అందించింది. జేఏసీ అధ్యక్షులు కేవీ కృష్ణయ్య సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేశారు.

పెమ్మసాని ఫౌండేషన్ కోటి

వరద బాధితుల సహాయార్థం పెమ్మసాని ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కును కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర సహాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమక్షంలో అందజేశారు.

విజయ డైరీ రూ.50 లక్షలు

కృష్ణ మిల్క్ యూనియన్(విజయ డైరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. విజయవాడ నాలుగో డివిజన్‌లోని ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల అభివృద్ధి సంఘం సభ్యులు రూ.25 లక్షలు అందజేశారు. క్యాపిటల్ హాస్పిటల్స్ యాజమాన్యం సీఎం ఆర్‌ఎఫ్‌కు రూ.25 లక్షల విరాళాన్ని అందించింది. ఎండీ మన్నె హరీశ్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వీఎస్ఆర్ భూపాల్ సీఎం చంద్రబాబును కలసి చెక్కును అందించారు.



మంత్రి లోకేశ్‌కు రూ.ఐదు లక్షల చెక్కును అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో బుద్దా వెంకన్న, పక్కన టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ కేశినేని చిన్ని

ఐఏఎస్ అధికారుల భార్యల సంఘం విరాళం

ఐఏఎస్ అధికారుల భార్యల సంఘం రూ.5 లక్షల విరాళం ప్రకటించింది. సీఎం చంద్రబాబును కలసిన సంఘం అధ్యక్షురాలు, సీఎస్ సతీమణి రేష్మ ప్రసాద్, పద్మవల్లి తదితరులు చెక్కును అందజేశారు. కాగా, టీటీడీ ఉద్యోగ సంఘాలు ఒకరోజు మూల వేతనాన్ని విరాళంగా అందించాలని నిర్ణయిం చాయి. పామర్రు నియోజకవర్గానికి చెందిన కిలారపు శ్రీనివా సరావు రూ.10 లక్షల విరాళం అందజేశారు.

ఏయూ ఉద్యోగులు, పెన్షనర్స్ 63.59 లక్షలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బంది, పెన్షనర్లు, కాంట్రాక్టు అధ్యాపకులు, మినిమం టైమ్ స్కేల్ ఉగ్యోగులు తమ ఒక్కరోజు మూల వేతనం రూ.63.59 లక్షలు అందిస్తారని వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు తెలిపారు. విశాఖలోని సెంచరీ క్లబ్ ప్రతినిధులు రూ.10,00,116ల చెక్‌ను కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అందజేశారు.

డ్వాక్రాల విరాళం రూ.5 లక్షలు

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు రూ.5 లక్షలు విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించాయి. ఈమేరకు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు చెక్కును గురువారం సాయంత్రం అందజేశాయి.

గోసలైట్స్ విరాళం రూ.35 లక్షలు

విజయవాడ గోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ నరేంద్ర రూ.25 లక్షలు, సంస్థ సిబ్బంది రూ.10 లక్షలు.. మొత్తం రూ.35 లక్షలను వరద బాధితులకు విరాళంగా అందించారు.



రూ.కోటి చెక్కును చంద్రబాబుకు అందజేస్తున్న దేవీ ఫిషరీస్ ఎండీ యార్లగడ్డ సూర్యరావు

విరాళాల వెల్లువ...

ఏ.శివకుమార్‌రెడ్డి రూ.1.50 కోట్లు, ఇ.చంద్రారెడ్డి రూ.50 లక్షలు, గుడివాడ విశ్వభారతి ఇన్‌స్టిట్యూషన్స్ రూ.30 లక్షలు, బృందావన్ మీటింగ్ ఏజన్సీస్ రూ.25 లక్షలు, వెలగపూడి శంకర్‌రావు రూ.25 లక్షలు, మదన్‌మోహన్‌రావు రూ.25 లక్షలు, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ రూ.10 లక్షలు, అంబికా అగర్‌బత్తీస్ ఆరోమా ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్ అంబికా కృష్ణ రూ.5 లక్షలు, అనుమోలు జగన్మోహన్‌రావు రూ.5 లక్షలు, అనుమోలు అనార్కలి రూ.5 లక్షలు, రమేష్ హాస్పిటల్స్ రూ.3 లక్షలు, అమరావతి కార్ మెకానిక్స్ అసోషియేషన్స్ రూ.2 లక్షలు, పి.సుధాకర్ రూ.1,14,000, కావూరి దుర్గా మల్లేశ్వరప్రసాద్ రూ.1,00,116లు, కోనసీమ జిల్లాకు చెందిన శ్రీ విజయదుర్గ పీఠం రూ.1 లక్ష, మందలపు జయలక్ష్మి రూ.1 లక్ష, ఎం.గ్రీష్మ రూ.1 లక్ష, పీఎస్ కమలాదేవి రూ.1 లక్ష, హెచ్‌ఎం ప్రమీలా రాణి రూ.1 లక్ష, పరచూరి ప్రమీలారాణి రూ.1 లక్ష, ఎంవీజీ కుమార్ రూ.1 లక్ష, పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి రూ.51 వేలు, ఎం.కృష్ణ రూ.50 వేలు, వై.ఉమామహేశ్వరరావు రూ.50 వేలు, వి.కస్తూరీబాయి రూ.50 వేలు, గోవర్ధన్, గౌతమి, చలపతి కలిపి రూ.50 వేలు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తరఫున రూ.50 వేలు సాయాన్ని సంఘం నేతలు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, జయరాజ్ తదితరులు చంద్రబాబుకు అందజేశారు.

లోకేశ్‌ను కలసిన దాతలు

పలువురు ప్రముఖులు లోకేశ్‌ను కలసి చెక్కులను అందజేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రూ.10 లక్షలు, మల్లెల రాజేష్ నాయుడు రూ.10 లక్షలు, అమలాపురం ఎంపీ గంటి హరీష్, రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, పార్టీ సీనియర్ నేత బుద్దా వెంకన్న, విజయవాడకు చెందిన బుద్దిరాజు శివాజీ రూ.5 లక్షలు చొప్పున అందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న సూర్య శ్రీకృష్ణరాజు, బలుసు శ్రీనివాసరావు

వరద సహాయ చర్యలకు భారీ విరాళం

బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఎండీ బలుసు శ్రీనివాసరావు రూ.కోటి విరాళం ఇచ్చారు. విజయవాడలో చంద్రబాబును కలసి విరాళం చెక్ అందజేశారు. అలాగే ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ రూ.2 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. సంస్థ డైరెక్టర్ ఎస్ఆర్‌కె సూర్య శ్రీకృష్ణరాజు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం రూ.కోటి విరాళం చెక్ అందించారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు

పరిశుభ్రత ముఖ్యం..!

సంక్రమిత వ్యాధులు ప్రబలే ప్రమాదం

- నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి
- మంగళగిరి ఎయిమ్స్ ప్రత్యేక సూచనలు

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో వరద నీరు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే.. వరద నుంచి బయటపడగానే హమ్మయ్య ముప్పు తొలగిపోయిందని భావించడం సరికాదని, ఇప్పుడే సంక్రమిత వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని మంగళగిరి ఎయిమ్స్ వైద్య బృందం హెచ్చరించింది. ఈ మేరకు వరద అనంతరం తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహణపై స్పష్టమైన సూచనలు చేస్తూ గురువారం ఒక బ్రోచర్‌ను చేసింది. దీనిలో వ్యక్తిగత భద్రత, కుటుంబ భద్రత, సమూహ భద్రత అంటూ మూడు అంశాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేసింది. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ సురక్షితంగా ఉండాలని అందులో పేర్కొంది. వరద నీటిలో తిరగొద్దని, డ్రైవింగ్ చేయొద్దని సూచించింది. ఇంటి చుట్టు పక్కల మురుగు నీరు లేకుండా చూసుకోవాలని, మురుగు నీటిని, డ్రైన్లను వెంటనే శుభ్రం చేసుకోవాలని పేర్కొంది. తడిగా ఉన్న విద్యుత్ ఉపకరణాలు తాకవద్దని సూచించింది. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, చేతి పంపు నీటిని తాగవద్దని చెప్పింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు దోమ తెరలు, దోమల నివారణ మందులు వాడాలని తెలిపింది. వరద బాధితులు తరుచూ చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని వివరించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో పలు టెక్నికల్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. పీజీ ప్రోగ్రామ్‌లు, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్‌లకు క్వాలిఫయింగ్ ఎగ్జామ్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు ఫీజు రూ.1000.
వెబ్‌సైట్: nielit.gov.in

నీలిట్‌లో టెక్నికల్ ప్రోగ్రామ్‌లు

పీజీ ప్రోగ్రామ్స్

ఇన్ వీఎల్ఎస్ఐ & ఎంబెడెడ్ సిస్టమ్ డిజైన్

ఇది ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్. దీని వ్యవధి 24 వారాలు. ఇందులో అడ్వాన్స్‌డ్ డిజిటల్ డిజైన్, సీఎంఓఎస్ లాజిక్ డిజైన్, ఎంబెడెడ్ సీ అండ్ ఏఆర్ఎం కార్టెక్స్, ఎంబెడెడ్ లీనక్స్, ఎంబెడెడ్ ఆర్‌టీఓఎస్, హెచ్‌డీఎల్ లాంగ్వేజ్ అండ్ కోడింగ్ ఫర్ సింథసిస్, ఎఫ్‌పీజీఏ డిజైన్ మెథడాలజీ అండ్ ప్రొటోటైపింగ్, ఎంబెడెడ్ ప్రొడక్ట్ డిజైన్ మాడ్యూల్స్‌తోపాటు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. మొత్తం 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: (ఎంఈ/ ఎంటెక్/ బీఈ/బీటెక్) (ఈసీఈ/ ఈఈఈ/ ఏఈఐ/ సీఎస్ఈ/ ఐటీ/ బయోమెడికల్/ ఎలక్ట్రానిక్స్/మెకట్రానిక్స్)/ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/సీఎస్) ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.70,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 9
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 23

ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సిస్టమ్ డిజైన్

ఇది 24 వారాల వ్యవధి గల ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో డేటా అక్విజిషన్ సిస్టమ్స్, ప్రాసెస్ ప్లాంట్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ సిస్టమ్ డిజైన్, పీఎల్‌సీ అండ్ పీఐడీ కంట్రోలర్స్, స్కాడా/హెచ్ఎంఐ సిస్టమ్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రియల్ నెట్‌వర్కింగ్ అండ్ ఇండస్ట్రియల్ ఐఓటీ, డిస్ట్రిబ్యూటెడ్ కంట్రోల్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ డ్రైవ్స్ మాడ్యూల్స్‌తోపాటు ప్రాజెక్ట్‌వర్క్‌లు ఉంటా యి. సోమవారం నుంచి శుక్రవారం వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పన్నెండున్నర వరకు థియరీ తరగతులు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. మొత్తం 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: (బీఈ/బీటెక్)(ఎలక్ట్రికల్/ఈఈఈ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/మెకట్రానిక్స్/కెమికల్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.59,000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 18



సర్టిఫికెట్ కోర్సులు

కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ యూజింగ్ సీఆర్ఈఓ

ఇది నాలుగు వారాల వ్యవధి గల ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో క్యాడ్ ఇంట్రడక్షన్, మోడలింగ్, డిటెయిలింగ్, డిజైన్ అసెంబ్లీ, డేటా ఎక్స్ఛేంజ్ మాడ్యూల్స్‌తోపాటు ఇంటర్నల్ టెస్ట్ ఉంటాయి. థియరీ తరగతులు, ల్యాబ్ సెషన్స్ ఉంటాయి. వారాంతాలు మినహా అన్ని రోజుల్లో ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఈ కోర్సులో మొత్తం 16 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు పూర్తిచేసినవారు క్యాడ్ డిజైనర్లు, ప్రొడక్ట్ డిజైనర్లు, క్యాడ్ టెక్నీషియన్లుగా రాణించవచ్చు.

అర్హత: (బీఈ/బీటెక్/డిప్లొమా)(మెకానికల్/ప్రొడక్షన్/ఆటోమొబైల్/టూల్ అండ్ డై/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్/మెకట్రానిక్స్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు/చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 2
- **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7

సైబర్ సెక్యూరిటీ

ఇది ఆరు వారాల వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ప్రతిరోజూ రెండు గంటలు ఆన్‌లైన్ సెషన్స్, మరో రెండు గంటలు ప్రాక్టికల్ సపోర్ట్ ఉంటాయి. ఆన్‌లైన్ సెషన్స్‌కు అటెండ్ కాలేనివారి కోసం రికార్డెడ్ లెక్చర్స్ అందిస్తారు. ఈ కోర్సుని బిగినర్స్ కోసం ఉద్దేశించారు. ఇందులో లీనక్స్ అండ్ నెట్‌వర్కింగ్ బేసిక్స్, ఇంట్రడక్షన్ టు వర్చువలైజేషన్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఫండమెంటల్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, యాక్సెస్ మేనేజ్‌మెంట్, ప్రివెన్షన్ అండ్ ప్రొటెక్షన్-క్రిప్టోగ్రఫీ, క్లవుడ్ కాన్సెప్ట్స్ సెక్యూరిటీ స్కానింగ్ అండ్ స్టాండర్డ్స్ తదితర అంశాలు బోధిస్తారు.

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్, ఆపరేటింగ్ సిస్టమ్ అండ్ నెట్‌వర్కింగ్ అంశాలపై పరిజ్ఞానం ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.9500.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **కోర్సు ప్రారంభం:** సెప్టెంబరు 23 నుంచి

టిస్‌లో డ్యూయెల్ డిగ్రీ

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్)- 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ పబ్లిక్ పాలసీ అండ్ లా-మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ఇన్ లా అండ్ సోషల్ పాలసీ' అనే డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. దీని వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది కోర్సును హైదరాబాద్ క్యాంపస్‌లో, రెండో ఏడాది కోర్సును ముంబై క్యాంపస్‌లో చదవాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి ఏడాది ప్రోగ్రామ్‌ను హైదరాబాద్ క్యాంపస్‌కు చెందిన స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. ఇందులో పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ సంబంధిత అంశాలు ఉంటాయి. దీనికి 46 క్రెడిట్లు నిర్దేశించారు.

- రెండో ఏడాది ప్రోగ్రామ్‌ను ముంబై క్యాంపస్‌కు చెందిన స్కూల్ ఆఫ్ లా-రైట్స్-కానిస్టిట్యూషనల్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. ఇందులో లీగల్ ఎడ్యుకేషన్, ఇంటర్‌సెక్షన్స్ ఆఫ్ లెజిస్లేషన్, లా, పబ్లిక్ పాలసీ అంశాలు ఉంటాయి. దీనికి 41 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: డ్యూయెల్ డిగ్రీలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా(ఎల్ఎల్‌బీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి మాత్రం ప్రోగ్రామ్ పూర్తయిన తరవాత ఎంఏ(పబ్లిక్ పాలసీ అండ్ లా) డిగ్రీని అందిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** admissions.tiss.edu

TISS
Tata Institute of Social Sciences

రిలయన్స్ ఫౌండేషన్ యూజీ స్కాలర్‌షిప్



రిలయన్స్ ఫౌండేషన్-డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 5000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. స్కాలర్‌షిప్ కింద ప్రోగ్రామ్ మొత్తానికి రూ.రెండు లక్షలు ఇస్తారు. అభ్యర్థులు ఈ మొత్తాన్ని ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ల్యాప్‌టాప్ కొనుగోలు, అకడమిక్ బుక్స్ కొనుగోలు నిమిత్తం వినియోగించుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో మూడేళ్లు/అంతకన్నా ఎక్కువ వ్యవధిగల ఏదేని రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.15 లక్షలకు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. వివాహితులు కూడా అర్హులే.


- ఆన్‌లైన్/రిమోట్/డిస్టెన్స్/నాన్ రెగ్యులర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో చేరినవారు; ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నవారు; విదేశాల్లో చదివినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో వెర్బల్ ఎబిలిటీ, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం గంట. అభ్యర్థి సాధించిన స్కోర్‌ను వెంటనే సంస్థకు పంపుతారు. అభ్యర్థులకు తెలపరు. ఈ టెస్ట్ రాస్తేనే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాక్టీస్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఈ టెస్ట్‌ను ఒకసారి మాత్రమే రాయడానికి వీలుంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 6
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, అడ్రస్ ప్రూఫ్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, డిగ్రీ అడ్మిషన్ లెటర్, కుటుంబ వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, వైకల్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రం
- **వెబ్‌సైట్:** www.scholarships.reliancefoundation.org

కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకే) ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఫర్ విజనరీ లీడర్‌షిప్ ఇన్ మాన్యుఫాక్చరింగ్(పీజీపీఈఎక్స్-వీఎల్ఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ), జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జేఐసీఏ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రామోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, ఎంహెచ్ఆర్‌డీ-ఇండియా ఉమ్మడిగా రూపొందించాయి. దీనికి ఐఐఎం కోల్‌కతా, ఐఐటీ మద్రాస్ సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా 36 వారాల క్లాస్ రూం స్టడీ, కేస్ స్టడీస్, ల్యాబ్ సెషన్స్, ఇండివిడ్యువల్ అండ్ టీం అసైన్‌మెంట్స్, జపనీస్ ఫ్యాకల్టీ గెస్ట్ లెక్చర్స్, ఆరు వారాల ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటాయి. వారంపాటు జపాన్‌లో ఇండస్ట్రియల్ విజిట్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ మాన్యుఫాక్చరింగ్' సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.

ఐఐటీ కాన్పూర్‌లో పీజీ



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2025 ఫిబ్రవరి 28 నాటికి కనీసం నాలుగున్నరేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

ఎంపిక: ఐఐఎంసీ, ఐఐటీకే, ఐఐటీఎం ఉమ్మడిగా అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తాయి. రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరిని మాత్రమే రిటెన్ టెస్ట్‌కు అనుమతిస్తారు. రిటెన్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, ఇంజనీరింగ్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 5
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** నవంబరు 19న
- **రిటెన్ టెస్ట్ కేంద్రాలు:** ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై
- **రిటెన్ టెస్ట్ తేదీ:** డిసెంబరు 1
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్స్:** డిసెంబరు 6
- **ఐఐటీ మద్రాస్‌లో పర్సనల్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 22
- **ప్రవేశం పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 31
- **వెబ్‌సైట్:** www.iitk.ac.in/ime/vlm

జాబ్ కార్నర్

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీల సంఖ్య: 213

ఢిల్లీలోని పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు, హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్...లేటరల్ ఎంట్రీ విధానంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ఆఫీసర్: **56 పోస్టులు**
2. మేనేజర్: **117 పోస్టులు**
3. సీనియర్ మేనేజర్: **33 పోస్టులు**
4. చీఫ్ మేనేజర్: **7 పోస్టులు**

విభాగాలు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రాజ్‌భాష, హ్యూమన్ రిసోర్స్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సైబర్ సెక్యూరిటీ, అకౌంట్స్, ఫారెక్స్, పబ్లిక్ రిలేషన్ అండ్ పబ్లిసిటీ, కార్పొరేట్, ఐఎస్ ఆడిటర్, సైబర్ ఫోరెన్సిక్స్, వెబ్ డెవలపర్, ఎస్క్యూఎల్ డెవలపర్, చార్టర్డ్ అకౌంటెంట్, లా మొదలైనవి.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంసీఏ, పీజీ, ఐసీడబ్ల్యూఏఐ, సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, సీఐఐబీ, పీజీడీబీఏ, పీజీడీబీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

పే స్కేల్: నెలకు ఆఫీసర్‌కు రూ.48,480 - 85,920. మేనేజర్‌కు రూ.64,820- రూ.93,960. సీనియర్ మేనేజర్‌కు రూ.85,290-1,05,280. చీఫ్ మేనేజర్‌కు రూ.1,02,300- రూ.1,20,940 ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ మొదలైన వాటి ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ కేటగిరీకి రూ.850. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15

వెబ్‌సైట్: punjabandsindbank.co.in/

నేషనల్ సీడ్స్‌లో ట్రాన్స్‌లేటర్స్

ఢిల్లీలోని వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎస్‌సీ లిమిటెడ్)...డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రాన్స్‌లేటర్-గ్రేడ్ 4(అఫీషియల్ లాంగ్వేజ్)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, మాస్టర్ డిగ్రీ(ఇంగ్లీష్/హిందీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.22,000- రూ.77,000

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

పని ప్రదేశాలు: న్యూఢిల్లీ, లఖ్‌నవూ, జైపూర్, పట్నా, సికింద్రాబాద్

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెరిట్ స్కోరు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్: https://www.indiaseeds.com/

పీడీఐఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్.. పీడీఐఎల్ కార్యాలయాలు/ప్రాజెక్ట్ సైట్‌లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 22

పోస్టుల వివరాలు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ప్రాసెస్ - కెమికల్): **10 పోస్టులు**
2. రెగ్యులర్ పోస్టులు(ఫైనాన్స్/హెచ్ఆర్/మెకానికల్/సివిల్): **12 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, గేట్-2024 స్కోరు, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, పీజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: https://www.pdilin.com/

లిటిల్స్



తగ్గితే ఎందుకు మంచిది

ఒక ఊరిలో జగ్గు, రంగా అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు వారిద్దరు మాటిమాటికీ కారణం లేకున్నా గొడవలు పడుతుండేవారు.ఎంతమంది మందలించినా, వారిద్దరూ తమ వైఖరి మార్చుకోలేదు. పొరపాటున ఒకరి వైపు మరొకరు చూసుకున్నా కూడా

'నీ మనసులో ఏదో దురుద్దేశం పెట్టుకునే నా వంక ఉరిమి చూసావు నువ్వు'అని దెబ్బలాడుకునే వారు ఇద్దరూ. ఆ ఊరివారు అంతా ఊరు చివరనున్నమంచినీటి చెరువులోనుంచి తాగడానికి నీళ్లు తెచ్చుకునే వారు.

ఆ చెరువుకు వెళ్లే దారి కొండ మీదుగా చాలా సన్నగా, ఇరుగ్గా ఉండేది. నడుస్తూ, కొంచెం పక్కకు జరిగితే కొండ మీదినుండి పడిపోయే విధంగా ఉన్న ఆ దారిలో ఒక రోజు జగ్గు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయానికి రంగా నీళ్లు తీసుకుని వెనక్కి వస్తూ ఇద్దరూ ఒకరికొకరు ఎదురు పడ్డారు. ఇలాగే ఎవరైనా ఒకరికొకరు ఎదురు పడితే, మిగతా వారంతా ఎవరో ఒకరు వెనక్కి నడిచి ఎదుటి వారికి దారి ఇచ్చి సర్దుకుపోతారు.. కానీ వీరిద్దరిలో ఎవరూ వెనక్కి వెళ్లడానికి ఇష్టపడలేదు. అలాగే ఒకరి మొహాల్లోకి మరొకరు కోపంగా చూసుకుంటూ దారి చూసుకోకపోవడం వల్ల ఇద్దరూ పట్టు తప్పి కొండమీదనుండి కిందపడి దెబ్బలు తగిలించుకున్నారు.

కొన్నిసార్లు నెగ్గడానికి కాకుండా తగ్గడానికి ఇష్టపడితేనే మనం బాగుపడతాం.

7 తేడాలను కనిపెట్టండి





జత ఉన్న కార్డులు ఏవి ?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 403


				6		7		1
	8			7	4	2	5	
1					2			6
								4
	9	4				6	3	
3								
8			9					5
	3	2	6	1			8	
7		1		2				

సుడోకు - 402 సమాధానం

6	7	8	9	1	3	4	2	5
3	2	9	4	5	6	1	8	7
4	1	5	8	7	2	3	9	6
1	9	6	7	4	8	2	5	3
2	5	7	3	9	1	6	4	8
8	3	4	6	2	5	9	7	1
9	4	3	5	6	7	8	1	2
5	8	1	2	3	9	7	6	4
7	6	2	1	8	4	5	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
11
నవ్య నివేదన
శుక్రవారం • 6 సెప్టెంబరు 2024



హరేకృష్ణ

శ్రీకృష్ణుడి అంతరంగిక శక్తి.. రాధ

సత్యం సత్యం పునః సత్యం సత్యమేవ పునః పునః
వినా రాధా ప్రసాదేన మత్ప్రసాదో న విద్యతే

"ఓ నారదా! ఇది సత్యం, సత్యం. మళ్లీ మళ్లీ ఇదే సత్యం, ఇదే సత్యం అని చెబుతున్నాను. రాధ కృప లేనిదే.. నా కృపను ఎవరూ పొందలేరు" అని నారద మహర్షికి స్వయంగా శ్రీకృష్ణుడు వివరించినట్టు 'నారద పురాణం' చెబుతోంది. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడితో సమానుడు కానీ, అధికుడు గానీ మరొకరు లేరు. బలంతో ఆయనను ఎవరూ జయించలేరు. అంతేకాదు, ఆయన బలవంతంగా నిర్వర్తించాల్సిన కార్యాలేవీ ముల్లోకాల్లోనూ లేవు. శ్రీకృష్ణుడు ఏది చేసినా... కేవలం ఆనందానుభూతికోసం, తన స్వీయ సంకల్పంతో మాత్రమే నిర్వహిస్తాడు. మరి అంతటి శ్రీకృష్ణుడు సైతం రాధ మీద ఆధారపడడం ఏమిటి?

శ్రీకృష్ణుడు అజేయుడు అయినప్పటికీ... ఆయనలో ఒక అద్భుతమైన గుణం ఉంది. అదే భక్తుల ప్రేమకు వశం కావడం. ఆయన తన భక్తుల విశుద్ధమైన సేవలకు మాత్రమే బద్ధుడు. ఎలాంటి స్వలాభాపేక్షా



లేకుండా, నిస్వార్థంతో చేసే సేవ భగవంతుణ్ణే కట్టిపడేసేటంత గొప్పది. శ్రీకృష్ణుడు సర్వాకర్షకుడు. అయితే ఆయనను ఆకర్షించే శక్తి మరేదైనా ఉందా అంటే... అవుననే చెప్పాలి. ఆ శక్తే శ్రీకృష్ణుడి అంతరంగిక శక్తి స్వరూపిణి అయిన శ్రీరాధికాదేవి.

దేవీ కృష్ణమయీ ప్రోక్తా రాధికా పరదేవతా
సర్వలక్ష్మీమయీ సర్వకాన్తిః సమ్మోహినీ పరా

"దివ్య దేవతా స్వరూపిణి అయిన రాధారాణి శ్రీకృష్ణుని అర్ధాంగి. సర్వలక్ష్ములలో ఆమే ప్రధానురాలు. సర్వాకర్షకుడైన భగవంతుణ్ణి సైతం ఆకర్షించగలిగే ఆకర్షణ ఆమెలో ఉంది. ఆమే దేవదేవుని ఆది అంతరంగిక శక్తి" అని 'శ్రీచైతన్య చరితామృతం' చెబుతోంది. అత్యుత్తమ భక్తికి ఆమె నిదర్శనం. శ్రీకృష్ణుడికి చేసే సకల సేవలు ఆమె ద్వారానే స్వామికి చేరుతాయి. రాధిక అంటే 'అత్యున్నత ఆరాధన' అని అర్థం. ఆమె విశుద్ధ భక్తితత్త్వం కలిగినది కనుకనే... శ్రీకృష్ణుడు ఆమె పట్ల ఆకర్షితుడవుతాడు.

"బృందావనధామంలో విశుద్ధ భక్తులందరూ రాధారాణి కృప కోసం ప్రార్థిస్తారు. పూర్ణత్వం తాలూకు శక్తితత్త్వానికి ఆమె ప్రతిరూపం. ఈ భౌతిక ప్రపంచంలో పరిపూర్ణమైన స్త్రీ రూపాన్ని ఆమె పోలి ఉంటుంది. అటువంటి తల్లి అయిన రాధ కృప... భక్తి శ్రద్ధలు కలిగిన వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఆమె కృప పొందిన భక్తులను శ్రీకృష్ణుడు తక్షణమే స్వీకరిస్తాడు. కాబట్టి భక్తులు ముందుగా రాధ కృప కోసం ప్రార్థించాలి. తద్వారా భక్తియుత సేవల పట్ల మనలో నిద్రాణమై ఉన్న సహజమైన ప్రేమను తిరిగి మేల్కొలపగలుగుతాము" అని హరే కృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు తన 'శ్రీమద్భాగవత' వ్యాఖ్యానంలో తెలిపారు. రాధ ఆవిర్భవించిన పవిత్రమైన రోజు రాధాష్టమి. ఇది కృష్ణాష్టమికి పదిహేను రోజుల తరువాత వస్తుంది. ఈ పర్వదినాన రాధాకృష్ణులకు పుష్పాంజలి సమర్పిస్తూ "ఓ రాధారాణీ! దీనుడినైన నాపై దయచూపమని... దయచేసి నీ కృష్ణుడికి తెలియజేయి" అని ప్రార్థించాలి.

శ్రీచైతన్యుల పరంపరలో ఆచార్యులైన శ్రీల ప్రభుపాదులు... ఆ భగవత్ప్రేమను లోకానికి అందజేసిన మహనీయులు. భగవంతుడితో జీవుడు తన అనుబంధాన్ని పునఃస్థాపించుకోవడానికి ఆయన అందించిన అత్యంత సరళమైన మార్గమే హరినామ సంకీర్తన. 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే... హరే రామ హరే రామ రామ రామ హరే హరే' అనే మహామంత్రాన్ని జపిస్తూ... శ్రీ చైతన్య మహాప్రభువును ఆశ్రయించినవారు... అజ్ఞానాంధకారమయమైన ఈ కలియుగాన్ని సులభంగా దాటగలరు. జీవితంలో పరిపూర్ణత సాధించగలరు.

(11న రాధాష్టమి)

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



విశేషం

ఆకారం, ఆహార్యం...

అన్నిట్లోనూ మర్మాలే!

ఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజం
పాశాంకుశధరం దేవం ధ్యాయేత్ సిద్ధి వినాయకం...

అంటూ శ్రీగణేశ చతుర్థి రోజున శ్రీ సిద్ధి వినాయక వ్రతం చేసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. పై శ్లోకం ఆ మహా గణపతి రూపాన్ని వర్ణిస్తుంది. ఆయన రూపంలోని ప్రతి అంశంలో ప్రతీకాత్మకత ఉంది. మంత్ర, జ్యోతిష శాస్త్రాల్లో, వేదాంతంలో గణపతి అవయవాల నుంచి ఆహార్యం వరకూ ప్రతిదానికీ ఒక నిర్వచనం ఉంటుంది. అవేమిటో తెలుసుకుందాం:



గజాననం: వినాయకుడిది ఏనుగు తల. అది అనంతమైన జ్ఞానానికీ, యోగశక్తికీ, మేధస్సుకూ, పరిపూర్ణతకూ చిహ్నం.

చిన్న కళ్ళు: చిన్నవిగా ఉండే ఆయన నేత్రాలు ఏకాగ్రతకు చిహ్నాలు. మాయామయమై, తప్పుదోవ పట్టించే లోకాన్ని నిశితంగా పరిశీలించి, ఏది వాస్తవమో దాన్నే పరిశీలించమని చెబుతాయి.

త్రినేత్రం: వినాయకుడి మూడో కన్ను ఆధ్యాత్మిక జ్ఞానానికి ప్రతీక.

వక్రతుండం: వంపు తిరిగిన తొండం ఓంకారానికి సంకేతం. మానవాళికి భ్రాంతి కలిగించే మాయకు వక్రమని పేరు. చెడు సంస్కారాలకు కూడా అది చిహ్నం. వాటిని నిర్మూలించేవాడు గణపతి.

శూర్పకర్ణం: గణపతి చెవులు పెద్దవిగా, నోరు చిన్నదిగా ఉంటుంది. ఎక్కువ వినాలి, తక్కువ మాట్లాడాలి. అప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడన్నది దీని వెనుక పరమార్థం. లోకంలోని ఆర్తుల ప్రార్థనలను తన పెద్ద చెవులతో గణపతి ఆలకిస్తాడు. అలాగే 'శూర్ప' అంటే చేట. వ్యర్థాలను తొలగించడం చేట చేసే పని. అజ్ఞానాన్ని తొలగించి, కేవలం జ్ఞానాన్ని మాత్రమే అందించే దైవం గణపతి అని ఇది సూచిస్తుంది.

లంబోదరం: విఘ్నేశ్వరుడి పొట్ట విశ్వానికి చిహ్నం. విశ్వాన్ని తనలో భరించే సామర్థ్యం, సర్దుబాటు తత్త్వాన్ని లంబోదరుడు ప్రదర్శిస్తున్నాడు. అలాగే, జీవితంలో ఎన్నో విషయాలు ఎదురవుతూ ఉంటాయి. అవి మంచివైనా, చెడువైనా సమానంగా, ప్రశాంతంగా స్వీకరించాలని అది సూచిస్తుంది.

నాగబంధం: విఘ్నేశుడి ఉదరానికి ఉండే నాగబంధం కుండలినీ శక్తికి ప్రతీక.

ఏకదంతం: ఏకదంతుడిగా వినాయకుడు విఖ్యాతుడు. ఎందుకంటే ఆయన రెండు దంతాల్లో ఒకటి విరిగి ఉంటుంది. పూర్తిగా ఉన్న దంతం వివేకానికీ, విరిగిన దంతం భావోద్వేగాలకూ సూచికలు. భావోద్వేగాలను వివేకంతో గెలవాలని అవి చెబుతాయి.

అభయహస్తం: గణేశుడి నాలుగు చేతుల్లో ఒకటి అభయహస్తం. లోకానికి ఆయన రక్షకుడని అది చెబుతుంది.

అంకుశం: వినాయకుడి రెండో చేతిలో గొడ్డలి ఉంటుంది. అది అజ్ఞానాన్ని ఖండిస్తుంది.

పాశం: విఘ్నేశుని మూడో చేతిలో ఉండే పాశం విఘ్నాలను తొలగిస్తుంది. కోరికలను నిర్మూలిస్తుంది.

జపమాల, మోదకం, పద్మం: గజాననుడి నాలుగో చేతిలోని వస్తువులు ఆలంకారాన్ని బట్టి మారుతూ ఉంటాయి. వాటిలో జపమాల జ్ఞాన సంపదకు సంకేతం. సాధన చేస్తే ఫలం లభిస్తుందని మోదకంతో ఉన్న హస్తం చెబుతుంది. తామర పువ్వు మానవ జీవితంలో అత్యంత ఉన్నత స్థితిగా చెప్పే ఆత్మ వివేకానికీ, మోక్షానికీ చిహ్నం.

మూషిక వాహనం: సమదర్శనానికి చిహ్నం. అలాగే ఎలుకను కోరికలకు ప్రతీకగా చెబుతారు. కోరికలను అదుపులో పెట్టాలి తప్ప అవి మనమీద స్వారీ చేయకూడదనేది మూషికవాహనంలోని సందేశం.

శ్రీగణేశ తత్త్వం

శ్రీగణేశుణ్ణి వినాయకచవితి రోజున పూజ చేసుకోవడం, ఆ రోజు ఆయన జన్మ వృత్తాంతాన్ని 'వినాయక వ్రతకల్పం'లో చదవడం, ఇళ్ళలో జరిగే శుభకార్యాలల్లో ముందుగా విఘ్నేశ్వర పూజ చేసుకోవడం... ఇవి అందరూ అనుసరిస్తున్నవే. పార్వతీదేవి నలుగుపిండితో (భూతత్త్వంతో) వినాయకుణ్ణి సృష్టించడం, తను స్నానానికి వెళ్ళినప్పుడు వినాయకుణ్ణి కాపలాగా పెట్టడం, శివుడు లోపలికి ప్రవేశించకుండా అతను అడ్డుకోవడం, కోపోద్రిక్తుడైన శివుడు అతని తలను ఖండించడం, తదనంతరం ఏనుగు తలను అతనికి శిరస్సు స్థానంలో అతికించడం, త్రిమూర్తులు, ఇతర దేవతలు తమ శక్తులను, ఆయుధాలను గణేశుడికి ప్రసాదించడం... ఇవన్నీ పురాణగాథగా మనకు ఇంతకుముందే తెలుసు. కానీ గణేశుణ్ణి గురించి తెలుసుకోవలసింది ఎంతో ఉంది. గణేశతత్త్వం ఒక మహా విజ్ఞాన సర్వస్వం. గణేశతత్త్వం గురించి సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి అనేక ప్రవచనాలలో ప్రస్తావించారు.

విశ్వ సృష్టి ఆరంభంలో... అంతా అంధకారం, శూన్యం. ఉన్నది ఒక్క సదాశివుడే. ఆయన తనలో భాగమైన ఆదిశక్తిని తననుంచి వేరు చేశాడు. తన అభీష్టం మేరకు చరాచర సృష్టి చెయ్యాలని దూరంగా పంపించాడు. ఆ క్రమంలో ఏర్పడిన భీకర శబ్దమే... ప్రప్రథమ నాదం... ఓంకారం. ఆ ఓంకారమే ఆదిదంపతుల ప్రథమ సృష్టి అయింది. అదే మంగళకరం, శుభప్రదం అయిన పవిత్రతామూర్తిని... శ్రీగణేశుణ్ణి సృష్టించింది. ఆ విధంగా పవిత్రతకు ప్రతీకగా, నిరాకారుడిగా శ్రీగణేశుడు ఆవిర్భవించాడు. ఓంకారం కూడా శ్రీగణేశుడి నిరాకారరూపమే. ఓంకార స్వరూపుడైన శ్రీగణేశుడు... చైతన్య రూపంలో విశ్వమంతటా వ్యాపించి ఉన్నాడు.

మానవ శరీరంలో అంతర్గతంగా ఏడు శక్తికేంద్రాలు... అంటే చక్రాలు, మూడు నాడులతో సూక్ష్మశరీర వ్యవస్థ భగవంతుడి శక్తితో నిర్మితమైన ఉంది. ఒక్కొక్క చక్రం, నాడి ఒక్కొక్క అధిష్ఠాన దేవత ఆధీనంలో ఉంటాయి. అన్నిటికన్నా ప్రప్రథమమైన మూలాధార చక్రంలో శ్రీగణేశుడు అధిష్ఠించి ఉంటాడు. అందుకే ఆయనకు ప్రథమ పూజ నిర్వహిస్తారు. గణేశుణ్ణి ఆరాధించడానికి ముందు ఆయన తత్త్వాన్ని, గుణాలను, లక్షణాలను తెలుసుకుందాం.

ఎవరైతే పవిత్రమైన నడవడికను కలిగి ఉంటారో.. వారిపట్ల గణేశుడు అత్యంత ప్రసన్నుడిగా ఉంటాడు. అందుకే ప్రాచీన భారతీయ సంస్కృతి సంప్రదాయాలన్నిటినీ శ్రీగణేశుణ్ణి ప్రసన్నం చేసుకొనే విధంగా... పవిత్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఋషులు రూపొందించారు. మూలాధార చక్రం పంచభూతాలలోని భూతత్త్వంతో నిర్మితమయింది. కాబట్టి మనం భూమాతను ఎంతగా గౌరవిస్తే... గణేశుడు అంతగా అనుగ్రహిస్తాడు. సామరస్య ధోరణి కూడా ఆయన తత్త్వమే. మన కుటుంబ సభ్యుల మధ్య, వ్యక్తుల పట్ల ఆహ్లాదకరమైన సామరస్య దృష్టిని ఏర్పరచుకోవడానికి ఈ తత్త్వం ఉపయోగపడుతుంది. బలమైన కుటుంబ వ్యవస్థకు, ఆరోగ్యకరమైన సమాజానికి ఈ తత్త్వం అత్యవసరమని శ్రీమాతాజీ నిర్మలాదేవి స్పష్టం చేశారు.

గణేశుడిలోని మరొక విశిష్టత... ఆయనలోని జ్ఞాన సంపద. మనలోని జ్ఞానబీజం ఎదిగేకొద్దీ అప్రయత్నంగానే మనల్ని ధార్మికతలోను, ధర్మనిరతిలోను ఉంచుతుంది. ఈ తత్త్వం మనలో పెంపొందినప్పుడు... ఇతరులతో అకారణంగా దూకుడుతో వ్యవహరించం. పరులను హింసించం. మనది కానిది ఏదీ ఉచితంగా ఆశించం. ఇటువంటి వ్యక్తిత్వం కలిగిన జ్ఞానం శ్రీగణేశుడి వల్లనే వస్తుంది. అప్పుడు మనలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. చదువులో మంచి ఫలితాలను సాధించగలం. అంతే కాదు, ఇది పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. అయితే... శ్రీగణేశుడు మనలోనే ఉన్నాడనే స్పృహ, సమర్పణభావం మనలో ఉండాలి. తద్వారా సమాజంలోని వాతావరణం పవిత్రంగా, నిర్మలంగా ఉంటుంది.

మనలోని కుండలినీశక్తి ఉత్థానం శ్రీగణేశుడి అనుమతితోనే జరుగుతుంది. ఆత్మసాక్షాత్కారం పొందుతున్న సమయంలో.. కుండలిని జాగృతం చెందినప్పుడు... ఆ గణేశుని జ్ఞానమే మన మెదడులోకి చేరుతుంది. ఎందుకంటే కుండలినిలో ఉన్న శక్తి ఆయనే. ఆ జ్ఞానాన్ని గనుక పొందితే... అన్ని చెడు అలవాట్లను, తప్పుడు ఆలోచనలను, అధర్మమైన, అనైతికమైన పనులను అప్రయత్నంగా మీరు విడిచిపెడతారు. అది జరగాలంటే... గణేశతత్త్వం మీలో పెంపొందాలంటే... పసిపిల్లల్లో ఉండే అమాయకత్వం మీలో ఉండాలి. దాన్నే 'అబోధిత తత్త్వం' అంటారు. దాన్ని అనుసరిస్తే మనిషి ఆత్మసాక్షాత్కారం పొందుతాడు. భగవత్ సామ్రాజ్యంలోకి ప్రవేశించడానికి అనుమతి లభిస్తుంది.

గణేశుడు సర్వశక్తిమంతుడు. ఆదిశక్తి అయిన జగదంబ సృష్టించిన గణాలకు ఆయనే అధిపతి. మూలాధార చక్రంలోని అసమతుల్యత, లోపాలే మనలో కలిగే అనేక శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు, రుగ్మతలకు కారణం. గణేశుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... కేవలం పూజించడం మాత్రమే కాకుండా... ఆయన తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి. సమతుల్యత, సామరస్యం, అబోధిత తత్త్వం, సచ్ఛీలత, నిర్మలచిత్తం, సమర్పణ భావం, వినయ విధేయతలు, ఆత్మవిశ్వాసం, వివేకం, నిర్భయత్వం, ధర్మనిరతి లాంటి సద్గుణాలను గ్రహించి, మనలో స్థిరపరచుకోవాలి. అదే నిజమైన ఆరాధన. ఇవన్నీ గణేశుని అనుగ్రహంవల్లే ప్రాప్తిస్తాయి. శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహజయోగ సాధన దీనికి దోహదపడుతుంది.

సహజయోగ



డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



గీతాసారం

విషాదం నుంచి జ్ఞానోదయం దాకా

"సమస్త దిశల నుంచి పొంగి ప్రవహిస్తూ నదులన్నీ వచ్చి సముద్రాన్ని చేరుతాయి. ఆ ప్రవాహ జలాలన్నిటినీ సముద్రం కలుపుకొంటుంది. కానీ తన హద్దులను ఏమాత్రం దాటిపోదు. అదే విధంగా సమస్త విషయాలను తెలుసుకుంటున్నా, సమస్త భోగాలు కళ్ళకు కనిపిస్తున్నా స్థితప్రజ్ఞుడు ఎటువంటి వికారానికి లోనుకాడు. అటువంటి వ్యక్తే శాంతిని పొందగలడు. భోగాల పట్ల ఆసక్తి ఉన్నవాడు మోక్షాన్ని పొందలేడు. ఏ వ్యక్తి అయితే సమస్తమైన కోరికలను విడిచిపెడతాడో, దేనిమీదా ఆశలేకుండా, అహంకార మమకారాలు లేకుండా ఉంటాడో... అతనే బ్రహ్మానందస్థితిని పొందుతాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఈ సందర్భంగా... శాశ్వతమైన స్థితిని (మోక్షాన్ని) పోల్చడానికి సముద్రాన్ని ఆయన ఉదాహరణగా తీసుకున్నాడు. దీనిద్వారా కొన్ని విషయాలు స్పష్టం చేశాడు. మొదటిది.. ఇంద్రియాల ద్వారా నిరంతరం ప్రేరణలు, ప్రలోభాలు, కోరికలు తనలో ప్రవేశించినా... గంభీరమైన సముద్రంలా... శాశ్వతమైన స్థితిని పొందిన మనిషి స్థిరంగా ఉంటాడు. రెండోది... సముద్రంలో కలిసినప్పుడు నదులు తమ ఉనికిని కోల్పోతాయి. అదే విధంగా శాశ్వతమైన స్థితిని చేరుకున్న వ్యక్తిలో ప్రవేశించిన కోరికలు కూడా తమ ఉనికిని పోగొట్టుకుంటాయి. మూడోది... మనకు ఏదైనా దుఃఖదాయకంగా మారితే.. దానికి కారణం బాహ్య ప్రపంచం మనలో కలిగించే ఉద్రేకాలను నియంత్రించలేకపోవడమే. అందుకే... సముద్రంలా మనం కూడా అటువంటి అస్థిరమైన, అనిత్యమైన



ఉద్వేగాలను, ఉద్రేకాలను విస్మరించడం నేర్చుకోవాలని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

మనకు ఉన్న అవగాహన ప్రకారం... ప్రతి కర్మకు కర్త, కర్మఫలం ఉంటాయని అనుకుంటాం. మొదట... కర్మను, కర్మ ఫలాలను వేరుచేసే మార్గాన్ని శ్రీకృష్ణుడు బోధించాడు. ఆ తరువాత... కర్తను, కర్మను వేరు చేయడం కోసం అహంకారాన్నీ, కర్తృత్వ భావాలను వదిలెయ్యాలని సూచించాడు. ఈ శాశ్వతమైన శాంతి స్థితిని చేరుకున్నాక తిరిగి వెనక్కు వచ్చే ప్రసక్తే లేదు. అప్పుడు ఏ కర్మ అయినా... ఈ బ్రహ్మాండంలోని కోటానుకోట్ల చర్యలలో ఒకటిగా మిగిలిపోతుంది. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడు విషాదంలో మునిగిపోయాడు. అది అర్జున విషాదయోగం. ఆ విషాదాన్ని సానుకూలంగా ఉపయోగించినప్పుడు... దానికి మోక్షాన్ని అందించే సామర్థ్యం ఉంటుందని 'భగవద్గీత'లోని రెండో అధ్యాయమైన 'సాంఖ్యయోగం'లో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

ఆలయదర్శనం

ఆదిత్యం గణనాథంచ దేవీ రుద్రంచ కేశవమ్... పంచదైవత మిత్యుక్తమ్

సూర్యుణ్ణి, గణపతిని, శక్తిని, రుద్రుణ్ణి, విష్ణువును పంచభూతాత్మకులని అంటారు. ఒక్కొక్క దైవానికి ఒక్కో విధమైన శక్తి ఉంటుంది. ఈ దైవాలు అందరినీ ఏకకాలంలో పూజించిన ఫలం ఒక్క గణపతిని పూజిస్తే లభిస్తుందనేది శ్రుతి వాక్యం. పంచాయతనంలో పరబ్రహ్మ స్వరూపుడైన గణపతి ముఖ్యుడు. తొలిపూజను అందుకొనే దైవం. గణపతిని సంతృప్తిపరచి, అనుగ్రహం పొందితే... అన్నీ సానుకూలం అవుతాయి. గణపతినే ప్రధానంగా ఉపాసించేవారిని 'గాణపత్యులు' అంటారు. గాణపత్య సంప్రదాయానికి పట్టుకొమ్మ... మరాఠా ప్రాంతం.

భారతీయులకు తొలి పండుగ వినాయక చవితి. భాద్రపద శుద్ధ చవితిని వినాయక చవితిగా... దేశమంతటా ఇంటింటా, వాడవాడలా జరుపుకొంటారు. సామూహికంగా నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల ప్రజలు వైదిక సంప్రదాయానుసారం స్వామిని పూజిస్తారు. గణపతి తత్త్వాన్ని 'క్షిప్రప్రసాద తత్త్వం' అంటారు. అంటే కోరిన వెంటనే కోరిక తీర్చే దయాగుణం. గణపతి రూపాలు అనేకం. అలాగే నామాలు కూడా. ప్రతి నామానికీ తనదైన ప్రత్యేకత ఉంది. శాస్త్రప్రకారం 108 నామాలున్నాయి. 'ముద్గల పురాణం'తో సహా పలు పురాణాలు 32 నామాలను, శిల్పశాస్త్రం 16 నామాలను చెప్పాయి. వాటిలో ఎనిమిది నామాలకు ప్రతీకగా... గాణపత్య సంప్రదాయానికి చెందిన అష్ట వినాయక క్షేత్రాలు మహారాష్ట్రలో ఏర్పడ్డాయి. ఈ క్షేత్రాల్లో వినాయకుడు స్వయంభువుగా వెలిశాడని ప్రతీతి. అవి:

అష్ట గణపతి క్షేత్రాలు

మయూరేశ్వరుడు, మోర్గావ్



ఈ ప్రాంతంలో ఎక్కువగా నెమళ్ళు ఉండేవట. అందుకే అక్కడ వెలసిన గణపతికి 'మయూరేశ్వరుడు' అనే పేరు వచ్చింది. ఇది సింధు అనే రాక్షసుణ్ణి వినాయకుడు వధించిన ప్రదేశం. గర్భాలయంలో గణపతి... నెమలిపై ఆసీనుడై దర్శనమిస్తాడు. మూలవిరాట్టుకు ఎదురుగా... పెద్ద మూషికం కాళ్ళతో మోదకాన్ని పట్టుకొని ఉంటుంది. ఆలయానికి ఎనిమిది దిక్కుల్లో గణపతి విగ్రహాలు, వాటికి ఇరుపక్కలా ఆయన పత్నులైన సిద్ధి, బుద్ధి విగ్రహాలు ఉంటాయి. గణపతి శిరస్సుపై పాము పడగ ఉంటుంది.

శ్రీ సిద్ధి వినాయకుడు, సిద్ధిటెక్



మధు, కైటభులనే రాక్షసుల సంహార సమయంలో శ్రీహరికి గణపతి సిద్ధి కలుగజేసిన ప్రాంతంగా దీన్ని పరిగణిస్తారు. అందుకే దీన్ని 'సిద్ధిటెక్' అంటారు. ప్రసిద్ధమైన ఇతిహాసం కలిగిన క్షేత్రం ఇది. తమ జీవితంలో ఒక్కసారైనా ఈ గణపతిని దర్శించుకొని... సిద్ధిని పొందాలని మహారాష్ట్రీయులు ఆకాంక్షిస్తారు. ఇక్కడ వినాయకుడి తొండం కుడివైపు తిరిగి ఉండడం విశేషం. భీమా నదీతీరంలో... చిన్న కొండమీద, చుట్టూ కనువిందు చేసే ప్రకృతి మధ్య ఈ ఆలయం ఉంది.

మహాగణపతి, రంజన్‌గావ్




త్రిపురాసుల సంహారానికి వెళ్ళే ముందు గణపతి కోసం శివుడు ఇక్కడ తపస్సు చేశాడట. ఉత్తరాయణ, దక్షిణాయన సంధి కాలంలో సూర్యకిరణాలు నేరుగా స్వామిపై ప్రసరించేలా ఈ ఆలయ నిర్మాణం జరిగింది. గర్భాలయంలో రెండు మూలవిరాట్టులుంటాయి. ఒకటి చాలా పెద్దది. రెండోది దాని కింద ఒక అరలో ఉంటుంది. ఈ రెండిటినీ భక్తులు దర్శించుకోవచ్చు. వేరే మతాలకు చెందిన రాజులు సాగించిన విధ్వంసానికి గురికాకుండా... ఆ విగ్రహాన్ని అరలో దాచి ఉంచారనేది చారిత్రక కథనం.

విఘ్నహర గణపతి, ఓజర్



పూర్వం అభినందనుడనే రాజు గణపతి కోసం చేస్తున్న తపస్సును భంగం చెయ్యడానికి... విఘ్నాసురుణ్ణి ఇంద్రుడు సృష్టించాడు. ఇది తెలిసిన గణపతి ఆ అసురుణ్ణి ఇక్కడ సంహరించి, విఘ్నహర గణపతిగా వెలిశాడు. ఈ ఆలయం కుకుడీ నదీ తీరంలో... తూర్పుకు అభిముఖంగా ఉంటుంది.

చింతామణి గణపతి, తేయూర్



మోరయా గోసానీ అనే భక్తుడి తపస్సుకు మెచ్చిన విఘ్నేశ్వరుడు... వ్యాఘ్ర (పులి) రూపంలో ఇక్కడ దర్శనమిచ్చాడట. దానికి చిహ్నంగా... ఈ ఆలయం ముందు వ్యాఘ్ర రూపం కనిపిస్తుంది. కపిలముని ఈ ఆలయాన్ని నిర్మించాడనీ, గణపతికి చింతామణిని సమర్పించాడనీ స్థలపురాణం చెబుతోంది. దేవేంద్రుడు, అంగారకుడు తదితర గ్రహాలు, దేవతలు... గణపతిని అర్చించిన క్షేత్రం ఇది. ఇక్కడ విఘ్నేశ్వరుడు నిత్యం అనేక దివ్యాలంకారాలతో భక్తులకు దర్శనమిస్తాడు.

గిరిజాత్మక గణపతి, లేన్యాద్రి



వినాయకుడి తలని శివుడు ఖండించినప్పుడు పార్వతి తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ఆ దుఃఖాన్ని తొలగించడం కోసం శివుడు గజముఖాన్ని అమర్చి, వినాయకుణ్ణి తిరిగి బతికించాడు. అది జరిగిన ప్రాంతం ఇదేననీ, దానికి సంకేతంగా... గణపతి ఇక్కడ కొండ మీద గజముఖుడిగా, గిరిజాత్మకుడిగా కొలువు తీరాడనీ స్థలపురాణం వివరిస్తోంది. 'గణేశ పురాణం'లోనూ ఈ ఆలయ ప్రశస్తి ఉంది. ఆలయం ఉన్న కొండ చుట్టూ గుహలు, బౌద్ధుల ఆరామాలు ఉన్నాయి.

భల్లాలేశ్వర గణపతి, పాలీ



భల్లాలుడు అనే బాలుని కోరిక మేరకు భల్లాలేశ్వరుడిగా గణపతి ఇక్కడ వెలిశాడు. ప్రతిరోజూ ఉదయం సూర్యుడి తొలికిరణాలు సభామండపం మీదుగా వచ్చి, గణపతి పాదాలను స్పృశిస్తాయి. ప్రధానమందిరం వెనుక వైపు శ్రీడుండి వినాయక మందిరం ఉంది. ఈ ఆలయం గొప్పతనాన్ని 'ముద్గల పురాణం', 'గణేశ పురాణం' విశదంగా వివరించాయి.

వరద వినాయకుడు, మహడ్



ఇక్కడ వేదకాలం నుంచి గణపతి ఉన్నాడనీ, కొలనులో కొలువైన గణేశుణ్ణి గృత్సమద మహర్షి 'గణానాం త్వామ్...' అనే వేద మంత్రం ఉపాసించి సాక్షాత్కరింపజేసుకున్నాడనీ, అనంతరం కొలను నుంచి గణపతి విగ్రహాన్ని వెలికి తీసి ప్రతిష్ఠించాడనీ స్థల పురాణం చెబుతోంది. గృత్సమద మహర్షిని గాణపత్య సంప్రదాయానికి తొలి ప్రవక్తగా గాణపత్యులు భావిస్తారు. గర్భాలయంలో స్వయంగా స్వామిని పూజిస్తే వరదానం అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం.

ఈ ఆలయాలన్నీ మహారాష్ట్ర ప్రధాన నగరాల్లో ఒకటైన పుణేకి సమీపంలో ఉన్నాయి. ఈ ఆలయాలు, మూలవిరాట్టులు... పురాణేతిహాస చరిత్ర కలిగినవి. పశ్చిమ కనుమల ప్రకృతి సౌందర్యంతో విలసిల్లుతూ ఉంటాయి. ఒకటి లేదా రెండు రోజుల్లో ఈ అష్ట వినాయకులను దర్శించుకోవచ్చు.

● ఆయపిళ్ళ రాజపాప